
సౌర వెలుగు నీడలో..



వాహనాలకు ఎండ, వాన నుంచి రక్షణతో పాటు సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది మహేశ్వరం మండలం రావిర్యాలకు చెందిన ఓ సంస్థ. వందలాది కార్లకు నీడను కల్పించడమే కాకుండా పైకప్పుపై ఏర్పాటు చేసిన సౌర ఫలకల ద్వారా ఎనిమిది కిలోవాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. - ఈనాడు, హైదరాబాద్

సర్వాంగ సుందరంగా బాపూఘాట్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అనుదీప్ దురిశెట్టి

మెహిదీపట్నం: గాంధీ జయంతి వేడుకలకు లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని, బాపూఘాట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అక్టోబరు 2న ఉదయం 6గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, 10కి సీఎం రేవంత్‌రెడ్డి బాపూజీకి నివాళులర్పిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రోటోకాల్ తప్పకుండా పాటించాలన్నారు. డీసీపీ చంద్రమోహన్, ఆర్డీవో మహిపాల్, డీఈవో రోహిణి, తహసీల్దార్ అహల్య ఉన్నారు.

నాగోల్, మియాపూర్ స్టేషన్లలో.. 6 నుంచి పార్కింగ్ రుసుం వసూలు



ఈనాడు, హైదరాబాద్: నాగోల్, మియాపూర్ మెట్రోస్టేషన్లలో ఈ నెల 6 నుంచి వాహనాల పార్కింగ్‌కు నామమాత్రపు రుసుం వసూలు చేయనున్నట్లు హైదరాబాద్ మెట్రో సోమవారం ప్రకటించింది. ఈ స్టేషన్లలో పార్కింగ్ ఫీజు వసూలు చేయాలని గతంలోనే యాజమాన్యం నిర్ణయించింది. ప్రయాణికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడం, నాగోల్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగడంతో నాడు తాత్కాలికంగా వాయిదా వేసింది.

ఆఫర్ల పొడిగింపు : ప్రయాణికులకు అందిస్తున్న అన్ని రకాల ఆఫర్లను 2025 మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు హైదరాబాద్ మెట్రో ఓ ప్రకటనలో పేర్కొంది. సూపర్ సేవర్ 59, స్టూడెంట్ పాస్, సూపర్ సేవర్ ఆఫ్ పీక్ వంటి ఆఫర్లను వినియోగించుకోవచ్చని వెల్లడించింది.

అత్యుత్సాహమే మూసీకి శాపం

- కనీసం నిర్వాసితులతో చర్చించకుండానే కూల్చివేతలంటూ ఆర్భాటం
- అధికారుల వ్యూహాత్మక తప్పిదంతో ఎగసిన ఆందోళనలు



మురుగుతో మహానగరాన్ని ఇబ్బంది పెడుతున్న మూసీనదిని సుందరీకరించాలన్న డిమాండ్ ఏళ్లుగా ఉంది. ఈ డిమాండ్‌ను గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఆమోదముద్ర వేశాయి. గత భారాస ప్రభుత్వం మూసీలో ఆక్రమణలు ఎన్ని ఉన్నాయన్న లెక్కలు వేసి ఆ తరువాత ముందుకెళ్లలేదు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఈ నది ప్రక్షాళనకు నడుం బిగించారు. సుందరీకరణకు ముందు ఆక్రమణల తొలగింపు ప్రక్రియ చాలా కీలకం. సున్నితమైన ఈ విషయంలో ఉన్నతాధికారులు ఒక ప్రణాళిక లేకుండా ముందుకెళ్లారు. కనీసం సమాచారం లేకుండా ఆక్రమణలకు మార్కింగ్ చేయడంతోపాటు కూల్చివేతలకు సిద్ధపడటంతో బాధితులు ఒక్కసారిగా ఆగ్రహించారు. ఫలితంగా ఇప్పుడు ఆక్రమణల తొలగింపు వ్యవహారం పెద్ద చిక్కుముడిలా మారింది.

మాట్లాడకుండానే మార్కింగ్..

గత ప్రభుత్వ హయాంలో నదిగర్భం, సమీపంలోనూ 12,500 ఆక్రమణలు ఉన్నాయని గుర్తించారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత మరోసారి ఆక్రమణలను పరిశీలిస్తే దాదాపు 16 వేలు ఉన్నట్లు గుర్తించారు. ఆక్రమణదారులతో మాట్లాడి వారిని ఒప్పించిన తరువాతే తొలగింపు ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. నిర్వాసితులకు ఇచ్చే పరిహారం, ఇతరత్రా సౌకర్యాలు తెలిపి వారిని సమ్మతం చేయాల్సి ఉంది. కానీ మూసీ అభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులకు ఏమైందో ఏమో ఒక్కసారిగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లను రంగంలోకి దింపి ఆక్రమణల తొలగింపునకు పూనుకున్నారు. నదీగర్భంలో ఉన్న చాలామంది రెండు పడక గదుల ఇళ్లకు తరలిస్తున్నా.. అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఎదురుతిరిగారు.

కూల్చుతారనే ప్రచారంతో..

మూసీనది బఫర్‌జోన్‌లో దాదాపు 10వేల వరకు పక్కా నిర్మాణాలున్నాయి. వీటిలో చాలావాటికి కన్వేన్స్ డీడ్, బల్దియా నిర్మాణ అనుమతిచ్చింది. ఇలా సొంత ఇళ్లు ఉన్న వారికి నష్టపరిహారంపై కనీస సమాచారం ఇవ్వకుండానే అధికారులు మార్కింగ్ వేశారు. దీంతో ఆందోళనలు మొదలయ్యాయి. మూసీ ప్రాజెక్టుతో హైడ్రాకు సంబంధం లేకపోయినా రేపోమాపో కూల్చివేస్తారని కొందరు కావాలని ప్రచారం చేయడంతో నిర్వాసితుల్లో ఆందోళన తీవ్రమైంది. ఇదే సమయంలో భారాస, భాజపా, ఎంఐఎం ప్రజాప్రతినిధులు ఆందోళనకారులకు సంఘీభావం ప్రకటించడంతో పరిస్థితి దారితప్పిందని అధికారులు చెబుతున్నారు. దీనివల్లే మూసీలో ఆక్రమణల తొలగింపు వ్యవహారం క్లిష్టంగా మారింది. మరోవైపు మూసీ బఫర్ జోన్ గుర్తింపు అన్ని ప్రాంతాల్లో సవ్యంగా జరగలేదని చెబుతున్నారు. ఉదాహరణకు పురానాపూల్ నుంచి కార్వాన్ వెళ్లేందుకు గతంలోనే బఫర్ జోన్‌లో వంద అడుగుల రోడ్డు నిర్మించారు. ఇప్పుడా రోడ్డును విస్మరించి బఫర్‌జోన్‌ను గుర్తించడంతో ఆందోళనలు తీవ్రమయ్యాయి. ఇప్పటికైనా నిర్వాసితులకు అన్ని రకాల న్యాయం చేస్తేనే మూసీ తొలగింపు ప్రక్రియ సజావుగా జరుగుతుంది.. లేని పక్షంలో సుందరీకరణ కలగానే మిగులుతుందని కాంగ్రెస్ ప్రజాప్రతినిధి ఒకరు పేర్కొనడం విశేషం.

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

పాతబస్తీకి వస్తే.. ఖబడ్దార్

ఆర్డీవోకు మజ్లిస్ ఎమ్మెల్యేల హెచ్చరిక



బాపూఘాట్‌లో కలెక్టర్ అనుదీప్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కౌసర్ మొహినుద్దీన్, ముబీన్, జుల్ఫికర్ అలీ

మెహిదీపట్నం: పాతబస్తీలో మూసీ తీరం వెంట ఇళ్లను నిర్మించుకొని ఉంటున్న వారిని ఖాళీ చేయాలంటూ సర్వే చేసేందుకు వస్తే తీవ్ర పరిణామాలుంటాయని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు కౌసర్ మొహినుద్దీన్, ముబీన్, జుల్ఫికర్ అలీలు హైదరాబాద్ ఆర్డీవో మహిపాల్‌ని సోమవారం హెచ్చరించారు. ఇప్పటి వరకూ ఏ శాఖ ప్రభుత్వ అధికారులు తమ ఇలాఖాలోకి రాలేదని, ఒక వేళ వస్తే.. తమనుదాటి వెళ్లాలేరని సవాల్ విసిరారు. గోల్కొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్డీవోను కలిసిన ఎమ్మెల్యేలు సర్వే ఏ ప్రాతిపదికన చేస్తున్నారని, ఇళ్లకు రెడ్‌మార్కులు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. రీ-సర్వే చేశాకే మా ఇళ్లవద్దకు రావాలని అప్పటి వరకూ రెడ్ మార్క్ వేయకూడదని హెచ్చరించారు. మూసీ తీరం వెంట బఫర్‌జోన్, ఇతర అంశాలపై 2003లో అప్పటి ప్రభుత్వం నిర్వహించిన సర్వేనే ప్రామాణికంగా తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఆ సర్వే ప్రకారమే మార్కింగ్ చేయాలని సూచించారు.



గూడు గోస వినండి సారూ..

అత్తాపూర్‌లోని మూసీ పరీవాహక ప్రాంతంలో సోమవారం మాజీ మంత్రి కేటీఆర్ పర్యటించారు. పలువురు మూసీ బాధితులు ఆయనకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి, సబితారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి ఆయనతో ఉన్నారు.

ప్రాజెక్టులకు సై.. నిధులు నిండుకున్నయ్

ఈనాడు, హైదరాబాద్

- తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో జీహెచ్ఎంసీ
- హెచ్-సిటీ పనులను భుజానికెత్తుకున్న సర్కారు

జీహెచ్ఎంసీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. రూ. 6వేల కోట్ల అప్పులు, ఆయా బ్యాంకు రుణాలకు మూడ్నెల్లకోసారి చెల్లించాల్సిన రుణ వాయిదాలతో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో.. కొత్త పనులను చేపట్టడం అసాధ్యమని సర్కారు భావించింది. రూ. 150కోట్ల రుణాన్ని.. జీహెచ్ఎంసీ చేపట్టనున్న కూడళ్ల సుందరీకరణకు, ఇతరత్రా పనులకు ఇవ్వాలని హెచ్ఎండీఏకి సూచించింది. మౌలిక సౌకర్యాల కల్పనకు జీహెచ్ఎంసీ రూ. 5వేల కోట్లు అడగ్గా.. అందులోని హెచ్-సిటీ ప్రాజెక్టు పనుల పై సర్కారు దృష్టి పెట్టి అనుమతులను మంజూరు చేస్తోంది.



కేబీఆర్ పార్కుతో మొదలు..

కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ కష్టాలను పరిష్కరించే హెచ్-సిటీ ప్రతిపాదనలను సర్కారు మొదటగా ఆమోదించిందని, వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు జీహెచ్ఎంసీ చెబుతోంది. ఆర్నెల్లలోనిర్మాణ పనులు మొదలు కావొచ్చని అంచనా వేస్తున్నారు. తర్వాతి దశలో.. మూసాపేట వై జంక్షన్, పాతబస్తీ, రేతిబౌలి, నానల్‌నగర్, ఖాజాగూడ, బండ్లగూడ, తదితర కూడళ్లు, పలు ఆర్ఓబీ, ఆర్‌యూబీ పనులకు అనుమతులు రానున్నాయి.

సర్కారు నిధులిస్తేనే..: ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను రాబడి అంతంతమాత్రంగానే ఉంది. నిర్మాణ అనుమతుల రూపంలో వచ్చే ఆదాయమూ తగ్గుముఖం పట్టింది. బల్దియాకు కొత్తగా బ్యాంకు రుణాలు మంజూరవట్లేదు. కొన్ని బ్యాంకులు ఇస్తామని ముందుకొస్తున్నా.. వడ్డీ రేటు అధికంగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో.. సర్కారైనా మౌలిక సౌకర్యాలకు నిధులు కేటాయించాలని జీహెచ్ఎంసీ కోరుతోంది.

హెచ్ఎండీఏ ద్వారా రూ.150 కోట్లు..

జీహెచ్ఎంసీకి రూ. 150కోట్ల అప్పు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించగా. . నేరుగా నిధులిచ్చేందుకు హెచ్ఎండీఏ ఒప్పుకోలేదు. పనులు పూర్తవగానే బిల్లులు ఇవ్వాలని, వాటికి చెల్లిస్తామని చెప్పింది. అదైనా మంచిదేగా అని. . కమిషనర్ ఆమ్రపాలి యుద్ధప్రాతిపదికన అన్ని జోన్లలో కూడళ్ల సుందరీకరణ, పైవంతెనలకు రంగులు, ఇతర పనులను చేపట్టాలని ఆదేశాలిచ్చారు. పనులు రెండు నెలల్లో పూర్తవుతాయని ఇంజినీర్లు చెబుతున్నారు.

గ్రేటర్‌లో తొలుత 'సారథి'

ఈనాడు, హైదరాబాద్

రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి

రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలకు సంబంధించి కొత్త పోర్టల్ 'వాహన్-సారథి'లో తొలుత గ్రేటర్‌లో సారథిని అమలు చేయనున్నారు. ఈ నెల ఒకటి నుంచి సికింద్రాబాద్ రవాణాశాఖ నుంచి ప్రయోగాత్మక పరిశీలన కింద అమలు చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. తర్వాత దశల వారీగా గ్రేటర్‌లోని అన్ని కార్యాలయాల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. దేశ వ్యాప్తంగా రవాణా సేవలన్నింటిపై ఏకీకృతమైన విధానాన్ని అమలు చేసేందుకు గతంలో వాహన్-సారథి సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు ఇందులో భాగస్వామ్యం అయ్యాయి. ఇటీవల తెలంగాణ కూడా పచ్చజెండా ఊపింది. డ్రైవింగ్ లైసెన్సు వివరాలన్నీ 'సారథి'లో, వాహనాల వివరాలను 'వాహన్'లో నమోదు చేయనున్నారు. ఈ నేపథ్యంలో తొలుత సారథి సేవలను గ్రేటర్‌లో అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు.

ఇవీ ప్రయోజనాలు...

- సారథితో లైసెన్సుల జారీ ఇతరత్రా సేవలు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి.
- ఎల్ఎల్ఆర్ సైతం ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే పొందే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ విధానాన్ని కర్ణాటకలో విజయవంతంగా అమలు చేస్తున్నారు. పాత డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్ చేసుకోవడం, చిరునామా, మార్పులు, చేర్పులు లాంటి సేవలతోపాటు ఒక జిల్లా నుంచి మరో జిల్లా లేదా రాష్ట్రానికి బదిలీ అయినప్పుడు డ్రైవింగ్ లైసెన్సులను కూడా 'సారథి' ద్వారా సులువుగా ఆన్‌లైన్‌లోనే కల్పించనున్నారు.
- ఈ సేవల కోసం ఆన్‌లైన్‌లో ఫీజులు, నిర్ణీత డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. ఇది విజయమైంతన తర్వాత వాహన్ పోర్టల్‌ను సైతం అందుబాటులోకి తేనున్నారు. ఫలితంగా మొత్తం వాహనాల డేటా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానుంది.

పంచాయతీ.. మున్సిపాలిటీల లేఅవుట్లపై నజర్

చెరువులకు సమీపంలోని స్థలాలపై రెవెన్యూ సర్వే



ఈనాడు, హైదరాబాద్: చెరువులు.. జలవనరుల సంరక్షణకు హైడ్రా తరహా వ్యవస్థను జిల్లాలకు విస్తరించనున్న నేపథ్యంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని గ్రామాలు..మున్సిపాలిటీల్లో ఇళ్ల నిర్మాణం కోసం వేసిన లేఅవుట్లపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. ప్రధానంగా మేజర్ పంచాయతీల నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లుగా మారిన వాటిలో తొలుత సర్వే నిర్వహిస్తారు. బఫర్ జోన్‌లు..ఎఫ్‌టీఎల్‌లలో అనుమతులిచ్చిన సంస్థలకు లేఖలు రాశారు. స్థానిక ఇరిగేషన్ అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లి డిజిటల్ జీపీఎస్ సర్వేలు, గ్రామ నక్షాలు సరిపోల్చనున్నారు. చెరువుల బఫర్‌జోన్లలో కొందరు వెంచర్లు వేశారన్న ఫిర్యాదులతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీకి సమీపంలోని మేజర్ గ్రామాల్లోని చెరువులకు సమీపంలోని పట్టా భూములను కొందరు కొనుగోలు చేసి.. ఎఫ్‌టీఎల్ స్థలాలను కలిపేసుకున్నారు. నిర్మాణాలకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా అనుమతులివ్వడంతో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు లే-అవుట్లలో కలసిపోయాయి. ఇలాంటి లేఅవుట్లపై అధికారులు దృష్టిపెట్టనున్నారు.

చంపాక.. 22 కి.మీ. నడక

- మహిళ నగలు, ఫోనుతో నిందితుడి పరార్
- దుండిగల్ హత్య కేసులో వీడని మిస్టరీ

ఈనాడు, హైదరాబాద్, దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్‌లో మహిళ హత్య కేసు వెనుక మిస్టరీ వీడడం లేదు. పోలీసులు 3 ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నా హంతకుడి ఆచూకీ చిక్కడం లేదు. హత్య అనంతరం నిందితుడు మల్లంపేట నుంచి మియాపూర్ వరకూ 22 కిలోమీటర్ల వరకూ నడుచుకుంటూ వెళ్లినట్లు సీసీ పుటేజీలు సేకరించారు. ఈనెల 23న మల్లంపేట గ్రీన్‌పార్క్ కాలనీలోని అపార్టుమెంట్‌లో ఉండే బొద్దుల శారద (50) హత్యకు గురైంది. హత్యకు ముందు మాస్కు ధరించిన ఒక వ్యక్తితో కలిసి తన నివాసానికి వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. దాదాపు 100 సీసీ కెమెరాలను పరిశీలించగా చివరగా మియాపూర్‌లోని మద్యం దుకాణం వరకు వెళ్లినట్లు గుర్తించారు. ఆ తర్వాత అదృశ్యమయ్యాడు. పథకం ప్రకారం హత్య చేసి పరారైనట్లు పోలీసులు నిర్ధారించుకున్నారు. తాజాగా మృతురాలి ఫోను ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.





తీరొక్క పువ్వై.. గౌరమ్మ కొలువై


నగరంలో బతుకమ్మ సంబరాలు మొదలయ్యాయి. సోమవారం కూకట్‌పల్లిలో మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలతో తరలివచ్చి ఆడిపాడారు.

దసరాకు 1450 ప్రత్యేక బస్సులు

ఈనాడు, హైదరాబాద్: దసరా నేపథ్యంలో గ్రేటర్ పరిధిలోని అన్ని డిపోల నుంచి మొత్తం 1450 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు అధికారులు వెల్లడించారు. నగరం నుంచి స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు ఛార్జీలతో వీటిని నడపనున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్ల నుంచి 1180, రంగారెడ్డి నుంచి 265 బస్సులను జిల్లాలకు నడిపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రద్దీనిబట్టి బస్సులను పెంచే అవకాశం ఉంది.

భూ వివరాలు సమస్తం.. యాప్‌లో నిక్షిప్తం

ఈనాడు, హైదరాబాద్



హెచ్ఎండీఏ కోసం సిద్ధం చేయనున్న సర్కారు

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలో స్థలం, ఇల్లు కొనాలంటే ఆ భూమి ఏ జోన్‌లో ఉంది? వాటి పరిధిలో నీటి వనరులు ఉన్నాయా లాంటి వివరాలు తెలుసుకోవాలంటే అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిందే. ఈ నేపథ్యంలో కొనుగోలుదారులను ముందే అప్రమత్తం చేసేందుకు హెచ్ఎండీఏ ఓ యాప్‌ను సిద్ధం చేస్తోంది. హెచ్ఎండీఏలోని ఏడు జిల్లాల పరిధికి సంబంధించి మాస్టర్‌ప్లాన్ వివరాలన్నీ యాప్‌లో పొందుపర్చనున్నారు.

ఏ జోన్ ఎక్కడ?

ప్రస్తుతం హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్-2030లో రకరకాల జోన్లు ఉన్నాయి. నివాసిత, పారిశ్రామిక, బహుళ వినియోగ, కన్జర్వేషన్, బయో కన్జర్వేషన్ జోన్లతోపాటు భవిష్యత్తులో ఏర్పాటు చేయనున్న రహదారులు, చెరువులు, కుంటలు, అడవులు ఇలా అన్ని రకాల సమాచారం అందుబాటులో ఉంది. లేఅవుట్లు, బహుళ అంతస్తుల భవనాలు, ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అనుమతులు ఇచ్చే సమయంలో ఆ వివరాలన్నీ పరిగణలోకి తీసుకొని అధికారులు ముందుకెళ్తారు. అపార్టుమెంట్, స్థలం ఎఫ్‌టీఎల్‌లో ఉంటే అలాంటి సమాచారం యాప్‌లో కనిపిస్తుంది. అనుమతుల కోసం కూడా యాప్‌లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించనున్నారు.

చంచల్‌గూడ జైలులో గంజాయి నిందితులు

43 కేసులు.. 134 మంది అరెస్టు

ధూల్‌పేట, న్యూస్‌టుడే: రెండు నెలల క్రితం ఆ ప్రాంతంలోని ఏ వీధిలో చూసినా గంజాయి బ్యాచ్‌ల హల్‌చల్.. చీకటి పడిందంటే చాలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఇంజినీరింగ్, వైద్య విద్యార్థులు, వ్యసనపరులు ఆ పరిసర ప్రాంతాల్లో ఖరీదైన వాహనాలతో గంజాయి కోసం 'క్యూ' కట్టేవారు. గంజాయి రహిత ధూల్‌పేటగా చెయ్యాలన్న లక్ష్యంతో ఆబ్కారీ శాఖ చేపట్టిన ఆపరేషన్ ధూల్‌పేటతో అక్కడ మార్పు కొట్టొస్తోంది. స్టేట్ టాస్కుఫోర్సులోని అంజిరెడ్డి ఆధ్వర్యంలోని బృందానికి ధూల్‌పేట బాధ్యతలు అప్పగించి ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్, ధూల్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ఎక్సైజ్ అధికారులు, సిబ్బందికి విడతల వారిగా విధులు కేటాయించారు.



- గత రెండు నెలలుగా 43 కేసులు నమోదు కాగా.. 134 మంది గంజాయి విక్రేతలను అరెస్టు చేసి జైలుకు తరలించారు. మరో 51 మంది పరారీలో ఉండటంతో ఇప్పటికే చంచల్‌గూడ జైలులోని ప్రత్యేక బ్యారక్‌లో వంద మందికి పైగా రిమాండ్‌లో ఉన్నారు. మరోవైపు ధూల్‌పేటలో గంజాయి స్మగ్లింగ్ సూత్రధారులైన పేరుమోసిన హోల్‌సేల్ గంజాయి విక్రేతల్లో సుమారు అయిదుగురు ఇప్పటికీ అండర్ గ్రౌండ్‌లోనే ఉన్నారు. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. మోస్ట్ వాంటెడ్ అంగూరీభాయి కోసం ఇప్పటికీ గాలిస్తున్నారు.

దోమలపై జపాన్ మందు

ఈనాడు, హైదరాబాద్

- థర్మల్ ఫాగింగ్ యంత్రాలకు త్వరలో స్వస్తి!
- కోల్డ్ ఫాగింగ్ విధానాన్ని పరిశీలించిన బల్దియా



చీకటి పడగానే వీధుల్లో గుర్రుమనే శబ్దంతో పొగను విరజిమ్మే థర్మల్ ఫాగింగ్ యంత్రాలు త్వరలో అటకెక్కనున్నాయి. జపాన్ సాంకేతికతతో ప్రజారోగ్యానికి హాని చేయకుండా దోమలను అంతం చేసే కోల్డ్ ఫాగింగ్ విధానాన్ని జీహెచ్ఎంసీ పరీక్షిస్తోంది. నగరంలో నాలుగు ప్రాంతాల్లో రెండు విధానాలను పరీక్షించి ఫలితాలను శాస్త్రవేత్తలతో విశ్లేషించాలని కమిషనర్ నిర్ణయించారు. ఇప్పటికే ఓ ప్రాంతంలో పరీక్ష జరిపామని, జపాన్ సాంకేతికతతో పని చేసే యంత్రాలు మెరుగైన ఫలితం చూపాయని అధికారులు చెబుతున్నారు. కొత్త విధానం వస్తే ఏటా డీజిల్, పెట్రోలు నల్లబజారులో విక్రయిస్తున్నఅవినీతి అధికారులకు అడ్డుకట్టపడుతుందనే వాదన వినిపిస్తోంది.

థర్మల్ ఫాగింగ్ ఇలా..: డీజిల్, పెట్రోలు, మలాథిన్ రసాయన మిశ్రమాన్ని యంత్రం వేడి చేయగా వచ్చే పొగను వీధుల్లో చిమ్ముతారు. దోమలు మత్తుతో పడిపోతాయి. జీహెచ్ఎంసీలో పెద్ద ఫాగింగ్ యంత్రాలు 63 ఉన్నాయి. ఒక్కో యంత్రానికి రోజూ 45 లీటర్ల డీజిల్, 9 లీటర్ల పెట్రోలు వెచ్చిస్తున్నారు. ● 302 చిన్న ఫాగింగ్ యంత్రాలు ఉండగా రోజుకు 9 లీటర్ల డీజిల్, 1.5 లీటర్ల పెట్రోలు.. వినియోగిస్తున్నారు.

కోల్డ్ ఫాగింగ్.. : థర్మల్ ఫాగింగ్ యంత్రాలతో పోలిస్తే ఇవి పరిమాణంలో చిన్నవి. ధర మాత్రం ఎక్కువే. దోమల నియంత్రణ రసాయనంతో కలిపి నీటి మిశ్రమాన్ని అతి సూక్ష్మ పరిమాణంలో అధిక ఒత్తిడితో గాలిలోకి చిమ్మడం ద్వారా వాతావరణంలో దోమలను నశింపజేసే పొర ఏర్పడుతుంది. పెద్ద ఫాగింగ్ యంత్రాలకు 200 మి.లీ. చిన్న యంత్రాలకు 5 మి. లీ. డెల్టామెత్రిన్ రసాయనాన్ని వాడుతారు.

కుందన్‌బాగ్ ప్రయోగంలో..

- కుందన్‌బాగ్‌లోని 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జనావాసాలను రెండు భాగాలుగా ఓ వైపు థర్మల్ ఫాగింగ్‌ను, మరోవైపు కోల్డ్ ఫాగింగ్‌ను నిర్వహించారు. కోల్డ్ ఫాగింగ్ చేపట్టిన ప్రాంతాల్లో దోమలు అధికంగా మరణించినట్లు తేలింది. ఐసీటీ ధ్రువీకరణ, జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కేంద్రం అనుమతి తీసుకున్నాకే కోల్డ్ ఫాగింగ్‌ను అమలు చేస్తామని బల్దియా స్పష్టం చేస్తోంది.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: (సోమవారం నాటివి.. కిలోకు రూ.లలో..) టమాట 55, నల్ల వంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండ 35, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 65, క్యాప్సికం 70, పచ్చకాకర 38, పందిరిబీర 35, క్యాబేజీ 19, క్యారెట్ 40, దొండ 35, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 21, దోస 28, బీట్‌రూట్ 28, ఉల్లి 45, ఆలు 40, చామ 35, మొరంగడ్డ 45, కంద 55, గోబీ 23, సొర 13, పొట్లకాయ 18, అరటి 9, మునగ 6, మామిడి 65, ముల్లంగి 6, ఉల్లిపొరక 55, వేరుశనగ 50, నిమ్మకాయలు(డజన్) 45, అల్లం 160, వెల్లుల్లి 320.

ఆల్వాల్, న్యూస్‌టుడే: టమాట 55, వంగ 28, బెండ 35, పచ్చిమిర్చి 28, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 19, క్యారెట్ 40, దొండ 35, ఆలు 40, ఉల్లి 44, సొర 13, పొట్ల 18, బీన్స్ 60, గోరుచిక్కుడు 35, చిక్కుడు 55, దోస 28, బీర 35, కాకర 38, చామగడ్డ 35, కీర 35, క్యాప్సికం 70, బీట్‌రూట్ 28.

సికింద్రాబాద్

•సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

ఉత్సాహంగా వక్తృత్వ పోటీలు

సనత్‌నగర్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీఎస్‌పీసీబీ) ఆధ్వర్యంలో సోమవారం వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పీసీబీలోని సమావేశ మందిరంలో నిర్వహించిన పోటీలకు నగరంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సంవత్సరం నినాదమైన 'మాంట్ రియల్ ప్రోటోకాల్ అడ్వాన్సింగ్ క్లైమేట్ యాక్షన్' పేరిట నిర్వహించిన పోటీలో ఓజోన్ పొర క్షీణత, దాన్ని పరిరక్షించుకునే విధానాలపై పలువురు విద్యార్థులు అనర్గళంగా మాట్లాడారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, వాణిజ్య అధ్యక్షుడు ఎం.జయదేవ్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. పీసీబీ సీనియర్ సోషల్ సైంటిస్ట్ డా.డబ్ల్యూజీ ప్రసన్నకుమార్, జేఎన్‌టీయూ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ విజయలక్ష్మి, ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ అండ్ అడ్వకేసీ రిసోర్స్ పర్సన్ జె.పద్మ పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీలో అలా.. కంటోన్మెంట్‌లో ఇలా..

తాగునీటి సరఫరాలో వ్యత్యాసం

కార్ఖానా, న్యూస్‌టుడే: ఆ రెండు ప్రాంతాలూ నగరంలోనే ఉన్నాయి. అయినా నీటి సరఫరాలో వ్యత్యాసం. జనం అవస్థలుపడుతున్నా దీన్ని మాత్రం సవరించడం లేదు. జీహెచ్‌ఎంసీ, కంటోన్మెంట్ పరిధిలోనే ఇలా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జీహెచ్ ఎంసీ ప్రాంతంలో రోజు విడిచి రోజు నీటి సరఫరా **జరుగుతుండగా..** కంటోన్మెంట్ పరిధిలో చాలాచోట్ల మూడ్రోజులకో సారి ఇస్తున్నారు. ప్రజల అవసరాలకు సరిపడా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నీటి సరఫరా పెంచాలని ఇప్పటికే అనేకమార్లు ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు.

ఓ చోట రోజు విడిచి రోజు.. మరోచోట మూడ్రోజులకో సారి

నీటి నిల్వ సామర్థ్యం లేదు:

– శ్రీ గణేష్, ఎమ్మెల్యే

కంటోన్మెంట్ ప్రాంతానికి 69 లక్షల గ్యాలన్ల నీటిని సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. జలమండలి అందించినా నిల్వ చేసుకునేందుకు ఇక్కడి పంప్‌హౌస్‌లలో తగిన సామర్థ్యం లేదు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటే నేను అదనపు నీటిని సరఫరా చేయిస్తా. ఇప్పటికే సంబంధిత అధికారులతో మాట్లాడాను. త్వరలోనే పరిష్కారమవుతుంది.

అవసరం 70 లక్షల గ్యాలన్లు..

కంటోన్మెంట్ ప్రాంతానికి రోజు విడిచి రోజు నీటి సరఫరా జరగాలంటే దాదాపు 70లక్షల గ్యాలన్లకు పైబడి నీరు అవసరం. కానీ జలమండలి నుంచి దాదాపు 59 లక్షల గ్యాలన్లు మాత్రమే సరఫరా అవుతోంది. అవసరం మేర నీటిని అందించాలంటే కంటోన్మెంట్ నుంచి సుమారు రూ. 24 కోట్లు కనెక్షన్ ఛార్జీల రూపంలో చెల్లించాలని జలమండలి అడుగుతున్నట్లు బోర్డు అధికారులు చెబుతున్నారు. జీహెచ్ ఎంసీలో ఎలాంటి ఛార్జీలు వసూలు చేయని అధికారులు కంటోన్మెంట్ నుంచి అడగటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అసలే బోర్డు ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఇలాంటి సమయంలో ఛార్జీలు చెల్లించడం తలకు మించిన భారమని భావిస్తున్నారు.

సీఎంవో, ముఖ్య అధికారుల దృష్టికి సమస్య:

– మధుకర్ నాయక్, సీఈవో

నీటి సరఫరాను పెంచాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, ఇతర విభాగాల కార్యదర్శులతో పాటు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, సీఎంవో కార్యాలయ అధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. ఆయా విభాగాలతో చర్చలు సైతం జరుగుతున్నాయి. ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆధ్వర్యంలో ఇప్పటికే నగర ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి పరిస్థితిని వివరించాం. త్వరలోనే నీటి సరఫరా పెరుగుదల, కనెక్షన్ ఛార్జీల సడలింపు అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



ఛార్జీలు లేకుండా సరఫరా పెంచాలి:

– రామకృష్ణ, బోర్డు నామినేటెడ్ సభ్యుడు

కంటోన్మెంట్ బోర్డు నుంచి ఎటువంటి ఛార్జీలు వసూలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా నీటి సరఫరా పెంచాలి. గతంలో ఉచిత నీటి సరఫరా విషయంలోనూ ఈ ప్రాంతానికి అన్యాయం జరిగింది. జీహెచ్‌ఎంసీ ప్రాంతంలో అమలు చేసిన రెండు సంవత్సరాల తరువాత కంటోన్మెంట్‌లో ఉచిత నీటి సరఫరా మొదలుపెట్టారు. అది కూడా కోర్టును ఆశ్రయించడంతో జరిగింది. గతంలో నీటి బిల్లుల విషయంలోనూ వ్యత్యాసం చూపించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య
సికింద్రాబాద్: 8008573368
కంటోన్మెంట్: 8008573361
సనత్‌నగర్: 8008573356

కంటోన్మెంట్, రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే:

? న్యూబోయిన్‌పల్లి భావనకాలనీ లక్ష్మీనగర్ బస్తీలో వీధి దీపాలు వెలగడం లేదు. **– రాజు, స్థానికులు**

✓ బస్తీలోని దీపాల మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం. **– సావన్, వీధి దీపాల నిర్వహణాధికారి.**

? రెజిమెంటల్‌బజార్‌లోని అపోలో ఆసుపత్రి ఎదురుగా వెస్లీ బాలిక పాఠశాల రోడ్డులో కార్లను రెండు వైపులా నిలుపుతున్నారు. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. **– అనంతకృష్ణ, రెజిమెంటల్‌బజార్**

✓ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటాం. చలాన్లు విధిస్తాం. **– వెంకట్‌రాములు, గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్**

స్పందనకు వందనం

రసూల్‌పురా, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ రెండో వార్డులోని మార్గదర్శి కాలనీ, లక్ష్మీగుంటి కాలనీల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి వాటిని అక్కడే వదిలేశారు. ఈ విషయాన్ని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా.. 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. శానిటరి సూపర్‌వైజర్ జీవన్ స్పందించి సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరించారు.

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: మైలార్‌గడ్డ - నామాలగుండులో రహదారి నిర్మాణం మధ్యలో ఆగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకురాగా 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి పనులు పూర్తి చేశారు.

● మైలార్‌గడ్డ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న శిథిలాలు, వ్యర్థాల కుప్పలతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. దీనిపై ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించి వాటిని తొలగించారు.

దేవాలయాల నిర్వహణను ధార్మిక సంఘాలకు అప్పగించాలి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: దేవాలయాల నిర్వహణ బాధ్యత ధార్మిక సంఘాలకు అప్పగించాలని, తితిదే లడ్డూ వివాదంపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, అన్యాక్రాంతమైన దేవాలయాల భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని, ఆలయాల్లో అన్యమత ఉద్యోగులను తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విశ్వహిందూ పరిషత మహంకాళి జిల్లా ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్లకార్డులతో ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు.



ప్యారడైజ్ చౌరస్తా వద్ద ప్లకార్డులతో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధుల నిరసన

దసరా ఉత్సవాల్లో డీజేలు నిషేధం

పద్మారావునగర్, న్యూస్‌టుడే: నవరాత్రోత్సవాల సందర్భంగా మండపాల వద్ద, విగ్రహాల నిమజ్జన సమయంలో డీజేలను నిషేధించినట్లు చిక్కడపల్లి డివిజన్ ఏసీపీ మొగిలయ్య తెలిపారు. సోమవారం గాంధీనగర్ ఠాణాలో పరిధిలోని డీజే సౌండ్ సిస్టం, ప్యాడ్‌బ్యాండ్ నిర్వాహకులతో సీఐ డి.రాజుతో కలిసి సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పెద్దపెద్ద శబ్దాలతో ప్రాణాలు సైతం కోల్పోతున్నారని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే భవిష్యత్తు

కార్ఖానా, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల జోనల్ స్థాయి పోటీలను సోమవారం బోయిన్‌పల్లి క్రీడా మైదానంలో బోర్డు సీఈవో మధుకర్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. పోటీల్లో వికారాబాద్, మేడ్చల్, మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి సుమారు 699 మంది ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కోటాజీ తెలిపారు.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

అమలుకు నోచుకోని విద్యాహక్కు చట్టం

అడ్డగుట్ట, న్యూస్‌టుడే: విద్యాహక్కు చట్టం తీసుకొచ్చినా అమలుకు నోచుకోవడం లేదని తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.భాగ్యలక్ష్మి తెలిపారు. అడ్డగుట్ట బీజేఆర్ భవనంలో తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక సంయుక్తా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, నాణ్యమైన విద్యనందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ రమాదేవి, ప్రవీణ్, జమున తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: లాలాపేటలోని సాయినగర్‌లో ప్రాంతంలో చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అధికారులకు సూచించారు. సోమవారం ఈ మేరకు ఓ లేఖను జిల్లా కలెక్టర్‌కు పంపించారు. సాయినగర్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ కాంప్లెక్స్‌లో సీవరేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా ఏర్పాట్లను పూర్తి చేయాలని జలమండలి డీజీఎం సరితను ఆదేశించారు. రైల్వే, రెవెన్యూ విభాగాల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.

● **సికింద్రాబాద్** : సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో నిరుపేదలకు మంచి వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మైలార్‌గడ్డకు చెందిన పెద్దరాజు, దూద్‌బావికి చెందిన కావేరిలకు శస్త్ర చికిత్స కోసం రూ.2.75 లక్షల మేర ఎల్‌వోసీ పత్రాలు మంజూరుకాగా.. ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ, నేతలు కంది నారాయణ, శేఖర్‌లు పాల్గొన్నారు.



ఎల్ ఓసీ పత్రాలను అందజేస్తున్న పద్మారావు, హేమ

'గాంధీ' రోడ్డులో రద్దీ నివారణకు చర్యలు

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: గాంధీ ఆసుపత్రి రోడ్డులో ట్రాఫిక్ ఆటంకాలు కలగకుండా పోలీసులు మూడ్రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఆసుపత్రి ముందు రోడ్డు పక్కన నిలిపిన డీసీఎంలను తొలగించారు. మళ్లీ ఎవరైనా నిలిపితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దవాఖాన ఎదుట స్వచ్ఛంద సంస్థలు అన్నదానాలు చేస్తుండటంతో యాచకులు అక్కడే తిష్ఠ వేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గత రెండు నెలల్లో ముగ్గురు చనిపోయిన నేపథ్యంలో అన్నదానాలు మరోచోట చేసుకోవాలని నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నారు. అడ్డదిడ్డంగా ఆటోలు నిలిపితే చలానాలు విధిస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై దుకాణాలు, పార్కింగ్ చేయకుండా పర్యవేక్షిస్తున్నట్లు చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు వివరించారు.



కాలిబాట ఖాళీ చేయాలని సూచిస్తున్న పోలీసులు

బాధితులకు బాసట..

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: మోండామార్కెట్‌లోని ఓల్డ్‌జైల్‌ఖానా వద్ద షాపులు కూలిపోయి నష్టపోయిన బాధితులకు మేరు సంఘం ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు, ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా అందించారు. కూలిపోయిన వాటి స్థానంలో కొత్తగా దుకాణాలు నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మేరు సంఘం అధ్యక్షుడు వెన్నెం క్రిష్ణ, ప్రధాన కార్యదర్శి రాగి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

బల్కంపేట ఆలయంలో ఏర్పాట్లు

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానంలో ఈ నెల 3 నుంచి దేవీ దసరా శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి బి.కృష్ణ, ఛైర్మన్ కొత్తపల్లి సాయిబాబాగౌడ్ తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సోమవారం దేవస్థానంలోని ఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నట్లు చెప్పారు. అమ్మవారిని రోజుకో అలంకరణలో ప్రత్యేక మండపంలో భక్తులు దర్శనం చేసుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 4న ఉదయం 10 గంటలకు సామూహిక కుంకుమార్చన, 11న మహా పూర్ణాహుతి, బలిప్రదానం, 12నశాంతి హోమం ఉంటుందని వివరించారు.

అమ్మవారి అలంకరణలు

మొదటిరోజు 3న బాలాత్రిపురసుందరీదేవి, 4న మహాలక్ష్మీదేవి, 5న రాజరాజేశ్వరీదేవి, 6న గాయత్రీదేవి, 7న అన్నపూర్ణాదేవి, 8న మంగళగౌరీదేవి, 9న సరస్వతిదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్ధనీదేవి, 12న రేణుకాఎల్లమ్మదేవిగా అమ్మవారిని అలంకరిస్తారు.

సంక్షిప్త సమాచారం

వన మహోత్సవం

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్ మోడల్‌కాలనీలోని బృందావనం ఉద్యానంలో సోమవారం వన మహోత్సవం నిర్వహించారు. కాలనీ ఉపాధ్యక్షులు జె.ఎస్.టి.శాయి, కార్యదర్శి దండా బుచ్చిబాబు తదితరుల ఆధ్వర్యంలో క్రోటాన్స్, మందార, ఆర్కాపామ్ తదితర మొక్కలను నాటారు.

మొక్క నాటి.. పూజలు చేసి

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం కార్పొరేటర్ సామల హేమ జమ్మి మొక్కను నాటి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌రావు ఇచ్చిన 'ప్రతి ఊరికి ఒక జమ్మి చెట్టు - గుడిలో ఒక జమ్మి చెట్టు' పిలుపుమేరకు మొక్క నాటినట్లు తెలిపారు.

కబ్జాలపై చర్యలకు వినతి

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: అక్రమ నిర్మాణాలు, కబ్జాలకు పాల్పడుతున్న వారిపై దృష్టిసారించాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ సోమవారం జరిగిన ప్రజావాణిలో జడ్జీ రవికిరణ్‌కు వినతిపత్రం అందించారు. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల దారికి అడ్డంగా ప్రహరీ నిర్మించి కారు షెడ్డు ఏర్పాటు చేశారని తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

అడ్డగుట్ట, న్యూస్‌టుడే: ఆయుష్మాన్‌భారత్, వెల్‌నెస్ సెంటర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వెస్ట్‌మారేడుపల్లి మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక శిబిరాన్ని పరిశీలించారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడ్డగుట్ట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి వైద్యులు వీరు జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేసి మందులు అందజేశారు.

మూసీ సుందరీకరణ పేరుతో ప్రజల జీవితాల్లో అంధకారం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మూసీ సుందరీకరణ పేరుతో అక్కడ నివాసం ఉంటున్న ప్రజల జీవితాలు అంధకారం అవుతున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో దాదాపు 8 వేల కుంటుంబాలకు చెందిన సమస్య ఇది అని పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో పీఓడబ్ల్యూ సంధ్య మాట్లాడుతూ.. సుందరీకరణ పేరిట 1997లో కొందరిని అక్కడి నుంచి తరలించినా ఫలితం లేకపోయిందన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతలతో గోదావరి నుంచి 15 టీఎంసీల నీరు తరలించి మూసీ నింపడం హాస్యాస్పదమన్నారు. నివాస హక్కుల ప్రచార పరిరక్షణ సంస్థ (ఛత్రి) కన్వీనర్ వర్గీస్ తెక్నాత్, నివాస హక్కుల ఫెడరేషన్ నేత జీవన్ కుమార్, ఎంవీ ఫౌండేషన్ కన్వీనర్ వెంకట్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. ప్రభుత్వం మూసీ పరివాహక ప్రాంత వారికి జీవించే హక్కు కల్పించాలన్నారు. మూసీ కింద ఉన్న 74 గ్రామాల ప్రజలో మాట్లాడిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న సంధ్య

ఉత్సవాలకు ఆహ్వానం

సనత్‌నగర్, న్యూస్‌టుడే: ఈ నెల 3 నుంచి 10 వరకు జరిగే దేవీ నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి డా.కోట నీలిమకు మహంకాళి దేవస్థాన ప్రతినిధులు ఆహ్వానించారు. అందజేశారు. ఈవో మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అమీర్‌పేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసి సత్కరించి ఆహ్వానపత్రిక అందించారు.



నీలిమకు ఆహ్వానపత్రం ఇస్తున్న ఆలయ ప్రతినిధులు

మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీసీపీ రష్మీ పెరుమాళ్

కార్ఖానా, న్యూస్‌టుడే: దుర్గామాత మండపాల, దాండియా నిర్వాహకులు పోలీసుల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు. కంటోన్మెంట్ అన్నానగర్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో సోమవారం నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలని, నిబంధనలకు లోబడి డీజేలు వాడాలని తెలిపారు.

కంటోన్మెంట్ డిపో ఐఎన్‌టీయూసీ ఎస్‌డబ్ల్యూ కమిటీ ఎన్నిక

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: జేబీయస్ సమీపంలోని కంటోన్మెంట్ పార్కులో సోమవారం ఆర్టీసీ కంటోన్మెంట్ డిపో ఐఎన్‌టీయూసీ ఎస్‌డబ్ల్యూ కార్యవర్గ ఎన్నిక జరిగింది. ముఖ్యఅతిథి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, సంయుక్త ప్రధాన కార్యదర్శి నాగేశ్‌పటేల్‌తో కలిసి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. డిపో అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సుభాష్‌రెడ్డి, ప్రధాన సలహాదారుగా బుల్లెట్ శ్రీనివాస్, కోశాధికారిగా కత్తులయ్య ఎన్నికైనట్లు వెల్లడించారు.

చిన్నారుల సందడి

మారేడుపల్లి, న్యూస్‌టుడే: ఈస్ట్‌మారేడుపల్లి కిబో కిడ్స్ ప్లే స్కూల్లో సోమవారం చిన్నారుల దాండియా నృత్యాలు అలరించాయి. పిల్లలు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొన్నారు.



మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులు, రద్దీ ప్రాంతాల్లో మహిళా ప్రయాణికులే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలు, చోరీ వస్తువులను కొనుగోలు చేసిన ఇద్దరిని టాస్క్‌ఫోర్స్, గోపాలపురం పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు వారి నుంచి 20 చరవాణులు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన సిరిగిరి కవిత(37) పండ్లు విక్రయిస్తుంది. మేడ్చల్‌కు చెందిన ఆమె మరిది వాంకుడోత్ ప్రసాద్(28) ఆటోడ్రైవర్. వచ్చే ఆదాయం చాలక ఇద్దరూ కలిసి చోరీల బాటపట్టారు. ద్విచక్ర వాహనంపై వచ్చి రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సుల్లో, రద్దీ ప్రదేశాల్లో మహిళల బ్యాగుల్లోని చరవాణులు దొంగిలించి వెళ్లిపోతుంటారు. వాటిని కాచిగూడకు చెందిన మహ్మద్ రఫీయుద్దీన్(30), మహ్మద్ ఇస్మాయిల్(26)కు విక్రయిస్తున్నారు. చోరీలపై ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టి ముమ్మరం చేశారు. నిందితులు రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం అంగీకరించారు. వీరు గోపాలపురం, ఉప్పల్, కామారెడ్డి, ఓయూ, గౌరారం, సిద్దిపేట, పేట్‌బషీరాబాద్, రామాయంపేట, మేడ్చల్ పోలీసుస్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడ్డారు. గతంలోనూ 13 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరి నుంచి చోరీ సొత్తు కొనుగోలు చేసిన మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



చోరీలకు పాల్పడుతున్న ఇద్దరితో పాటు కొనుగోలు చేసిన మరో ఇద్దరు నిందితులు

కత్తులు దూసి.. ప్రతిభతో మెరిసి

ఫెన్సింగ్‌లో రాణిస్తున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: న్యూబోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఫెన్సింగ్ క్రీడలో సత్తా చాటుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆశ్రమ పాఠశాలలు 230 ఉండగా.. కేవలం రెండుచోట్ల మాత్రమే ఈ శిక్షణ ఇస్తున్నారు. ఈ రెండు పాఠశాలల్లో 21 మంది బాలబాలికలు శిక్షణ పొందుతూ జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు ప్రతిభ కనబరుస్తున్నారు.

పాఠశాలలో క్రీడ ప్రారంభమైందిలా...


2021లో పాఠశాలలో జరిగిన వజ్రోత్సవాలకు ప్రస్తుత మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గిరిజన బాలబాలికల్లో క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని ఆయన గమనించారు. అప్పటికే రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన ఇక్కడా శిక్షణ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. శిక్షణ సామగ్రికి రూ.లక్ష విరాళం అందించడమే కాకుండా శిక్షకులకు ఏడాది పాటు జీతభత్యాలు చెల్లించారు. క్రీడలపై విద్యార్థుల ఆసక్తిని గమనించిన ప్రధానోపాధ్యాయుడు బానోత్ లాలు విషయాన్ని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ 2022లో రెండు పాఠశాలల్లో ఫెన్సింగ్‌లో శిక్షణనిచ్చేందుకు శాఖ తరఫున ప్రత్యేకంగా కోచ్ శివానంద్‌ను నియమించడమే కాకుండా రూ.10 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఉదయం, సాయంత్రంశిక్షణ ఇస్తున్నారు.

జాతీయస్థాయిలో ప్రతిభ..

పాఠశాల విద్యార్థులు రమావత్ సునీల్, మేఘావత్ కిట్టులో గతేడాది హనుమకొండలో జరిగిన అంతర్‌జిల్లా పోటీల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలు సాధించారు. గతేడాది గుజరాత్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో మేఘావత్ కిట్టు, ఇటీవల ఎర్నాకుళంలో జాతీయస్థాయి పోటీల్లో రమావత్ సునీల్ ప్రతిభను కనబరిచారు.



హెచ్‌ఎం బానోత్‌లాలు, కోచ్ శివానంద్‌తో మేఘావత్ కిట్టు, రమావత్ సునీల్



సాధన చేస్తున్న విద్యార్థులు

మంచి అవకాశాలు

పాఠశాలలో 240 మంది చదువుతున్నారు. వీరిలో ఆసక్తి ఉన్న వారిని గుర్తించి 21 మందికి ఫెన్సింగ్ క్రీడలో శిక్షణ ఇస్తున్నాం. మిలటరీ, ఐటీ తదితర ప్రభుత్వ శాఖలు ఫెన్సింగ్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. నిరుపేద కుటుంబాలకు చెందిన ఈ విద్యార్థులు ఇదే తరహాలో ముందుకెళ్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు.

–బానోత్ లాలు, పాఠశాల హెచ్‌ఎం

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (సోమవారం నాటివి.. కిలో రూ.లో) టమాటా 55, వంగ 28, బెండ 35, పచ్చిమిర్చి 28, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 19, క్యారెట్ 40, దొండ 35, ఆలు 40, ఉల్లి 44, సొర 13, పొట్ల 18, బీన్స్ 60, గోరుచిక్కుడు 35, చిక్కుడు 55, దోస 28, బీర 35, కాకర 38, చామగడ్డ 35, కీర 35, క్యాప్సికం 70, బీట్‌రూట్ 28, కందగడ్డ 55, చిలకడదుంప 45, మామిడి 65, మునగ 80, ముల్లంగి 7(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: టమాటా కిలో రూ.55, వంగ 35, బెండ 35, పచ్చిమిర్చి 28, కాకర 38, బీర 35, క్యాబేజీ 19, బీన్స్ 60, క్యారెట్ 40, దొండ 35, చిక్కుడు 55, క్యాప్సికం 70, ఆలు 40, కీర 21, దోస 28, చామగడ్డ 35, అరటి 9, బీట్‌రూట్ 28, సొర 13, గోకర 35, చిలకడదుంప 45, మామిడి 65, మునగ 80.

శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి



ధ్రువపత్రాలతో ఉద్యోగార్థులు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మల్కాజిగిరి డివిజన్ ఆర్కేనగర్ సామాజిక భవనంలో కోవి తెలంగాణ సర్వీస్ ఆర్గనైజేషన్‌లో బాగాంగా నిరుద్యోగులకు శిక్షణ తీసుకున్న వారికి సోమవారం ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. బేసిక్ కంప్యూటర్ ట్రైనింగ్ ఎక్సెల్ ప్రోగ్రాంలో శిక్షణ అందజేశారు. కార్యక్రమానికి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.సుమతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యువతకు ఉపాధి నిమిత్తం తమ సంస్థ ఆశేక కోర్సులు అందజేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చేతన జైన్, కల్పనారావు, నీరజ, నిషా అగర్వాల్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలి



రిక్షాను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో చెత్త తొలగించేందుకు కొత్తగా తరలింపు రిక్షాలను కార్పొరేటర్ వి.శ్రవణ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో డివిజన్‌ను గ్రేటర్‌లోనే ఆదర్శంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటివారు చెత్తను రిక్షాలలోనే వేయాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తవేస్తే పరిసరాలు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో సర్కిల్ వైద్యాధికారి మంజుల, పర్యవేక్షకుడు శ్రీనివాస్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యం: సుధీర్‌బాబు

కాప్రా: రద్దీ రహదారుల్లో నిరంతరాయంగా విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాచకొండ కమిషనర్ జి.సుధీర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం రాచకొండ కమిషనరేట్‌లో ట్రాఫిక్ సిబ్బందితో సమావేశమయ్యారు. 730 మంది సిబ్బందికి వివిధ రకాల సామగ్రి ఇచ్చారు. సమావేశంలో డీసీపీలు ప్రవీణ్ కుమార్, శ్రీనివాసులు, జి.శ్రీనివాస్‌కుమార్, నవీన్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు వెతలు.. కన్నీటి గాథలు

● భూగర్భ మురుగునీటి పనుల కోసం ఎదురుచూపు ● ఆగిన రూ.133 కోట్ల పనులు

గౌతంనగర్, న్యూస్‌టుడే: చిన్నపాటి వర్షమొచ్చినా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఏకలవ్యనగర్, గౌతంనగర్, వాణీనగర్ తదితర కాలనీలు ముంపు బారిన పడుతున్నాయి. వేల కుటుంబాలు ఎన్నో అవస్థలు పడుతున్నాయి. ఎవర్ని కదిలించినా తమ కష్టాలు చెప్పుకొని కన్నీటి పర్యంతం అవుతున్నారు. భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ ఆధునికీకరణ పనులకు సంబంధించి గతేడాది ఏప్రిల్‌లో సుమారు రూ.1.33 కోట్ల మేరకు కలెక్టర్ నిధుల నుంచి మంజూరయ్యాయి. తదనంతరం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మారిపోవడంతో ఆయా పనులు పట్టాలెక్కలేదు. అప్పుడున్న సంబంధిత అధికారులు కూడా బదిలీలపై వెళ్లిపోవడంతో ఆయా దస్త్రాలను పట్టించుకునే నాథుడే లేని పరిస్థితి.



ఏకలవ్యనగర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న ఓ వీధి

● పనులు చేపట్టాల్సిన కాలనీలు – 3
● ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలు – 3,470
● ఏకలవ్యనగర్‌కు మంజూరైన నిధులు – రూ.66 లక్షలు
● గౌతంనగర్‌.. రూ.35 లక్షలు
● వాణీనగర్‌కు.. రూ.35 లక్షలు

అధికారుల వద్దకు ఎప్పుడో చేరిన దస్త్రం..

గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో యూజీడీ పనులకు సంబంధించి గతేడాది మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ నిధుల నుంచి సుమారు రూ.1.33 కోట్లు మంజూరయ్యాయి. అప్పటి జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కానీ పనులను జలమండలి అధికారులు చేపట్టాల్సి ఉండటంతో దస్త్రం మల్కాజిగిరి జలమండలి అధికారుల వద్దకు చేరింది. వారు తదుపరి అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ పనులు మాత్రం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు.



వాణీనగర్‌లో రోడ్డుపై పారుతున్న వ్యర్థ జలాలు



జలమండలి ఎండీకి నివేదించాం..

–మేకల సునీతాయాదవ్, కార్పొరేటర్, గౌతంనగర్

డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ పనులను త్వరితగతిన చేపట్టాలని ఇప్పటికే రెండుసార్లు జలమండలి ఎండీకి రాతపూర్వకంగా విజ్ఞప్తి చేశాం. పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెబుతున్నారు తప్ప.. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. రెండు వారాల క్రితం జలమండలి ఎండీని కలిసి విన్నవించాం. వివరాలు తెలుసుకుని సానుకూలంగా స్పందించారు.



పనులు ప్రారంభమయ్యేలా చర్యలు

–వెంకటేష్, కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు

జిల్లా కలెక్టర్ నిధులతో చేపట్టాల్సిన భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ పనులకు సంబంధించిన విషయమై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతో ఉన్నతాధికారులను కలిసి త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ఈ విషయమై స్థానిక కాలనీవాసులతో కూడా చర్చించి సమస్యను సాధ్యమైనంత త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

గౌతంనగర్, మల్కాజిగిరి, అల్వాల్, డిఫెన్స్ కాలనీ, న్యూస్‌టుడే:

? గౌతంనగర్ డివిజన్ మల్లికార్జుననగర్‌లో రోజులతరబడి చెత్త నిల్వలు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. –శ్రీనివాసన్, మల్లికార్జుననగర్

✓ చెత్త నిల్వలను డంపింగ్ యార్డుకు తరలిస్తాం. – నాగరాజు, పారిశుద్ధ్య నిర్వహణ సూపర్‌వైజర్

? మల్కాజిగిరి డివిజన్ విమలాదేవినగర్‌లో రహదారులను సరిగా శుభ్రం చేయటం లేదు. చెత్తకుప్పలను తొలగించడం లేదు. – వెంకటేశ్వర్‌రావు, కాలనీవాసి

✓ మీ ప్రాంతంలో సమస్యను పరిశీలిస్తాం. రహదారులను శుభ్రం చేయించి చెత్తకుప్పలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, పర్యవేక్షకులు, సర్కిల్ పారిశుద్ధ్య విభాగం

? కొత్తచెరువు కట్టపై వ్యర్థాలు పారబోస్తున్నారు. దీంతో కట్టపాడవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. – రాజ్‌కుమార్, రెడ్డి ఎన్‌క్లేవ్

✓ వ్యర్థాలు తొలగించి కట్టపై చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. – ప్రభాకర్, పారిశుద్ధ్య అధికారి

? యాప్రాల్ కిందిబస్తీ ఎన్‌క్లేవ్ కాలనీలో పలు వీధి దీపాలు నాలుగు రోజులుగా నిరంతరాయంగా వెలుగుతున్నాయి. విద్యుత్ వృథాను అరికట్టండి. – వెంకయ్య, యాప్రాల్

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – వెంకటేష్, వీధి దీపాల నిర్వహణ అధికారి

ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు



మంజూరు పత్రం అందజేస్తున్న మైనంపల్లి

గౌతంనగర్, న్యూస్‌టుడే: గౌతంనగర్ డివిజన్‌కు చెందిన డి.రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు రూ.48వేలు మంజూరయ్యాయి. ఆ పత్రాన్ని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, పీవీ సత్యనారాయణ, పరిధ్ పాల్గొన్నారు.

భవిష్యత్తు అవసరాల నిమిత్తం ఆర్‌యూబీ నిర్మాణం



వాజ్‌పేయినగర్ రైల్వే క్రాసింగ్ వద్ద వివిధ శాఖల అధికారులతో రాజశేఖర్‌రెడ్డి

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య నియంత్రణ కోసం భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ఆర్‌యూబీ నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం రైల్వే, జలమండలి, విద్యుత్తు శాఖలకు సంబంధించిన అధికారులతో కలిసి వాజ్‌పేయినగర్ రైల్వే క్రాసింగ్ వద్ద చేపట్టనున్న వంతెన నిర్మాణం పనులను పరిశీలించారు. పాత ప్రణాళిక ప్రకారం సుమారు వంద ఇండ్లను పాక్షికంగా తొలగించాల్సి ఉండేదని.. కానీ తాజా ప్రణాళికతో కేవలం 24 ఇండ్లను పాక్షికంగా తొలగించాల్సి వస్తుందన్నారు. నష్టపోతున్న వారికి ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. భవిష్యత్తులో ట్రాఫిక్ పెరిగే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.80 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ పనులు మూడు నెలల్లో ప్రారంభమై సంవత్సరం లోపు పూర్తవుతుందని అన్నారు. వంతెన నిర్మాణం సమయంలో ఆటంకంగా ఉన్న విద్యుత్తు స్తంభాలు, జలమండలి నీటి సరఫరా పైపులు తొలగించేందుకు కసరత్తు ప్రారంభించాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ సంజీవ్ కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాస్ మూర్తి, జేఈ రంజిత్, జలమండలి డీజీఎం రాజు, మేనేజర్ నవీన్, విద్యుత్తు ఏడీఈ యాదగిరి, ఏఈ గోపాల్, భాజాపా నాయకులు జగదీష్ గౌడ్, పర శురాంరెడ్డి, వెంకన్న తదితరులు ఉన్నారు.

లడ్డూ వివాదంపై న్యాయమూర్తితో విచారణ చేయించాలి



చౌరస్తాలో ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవాలయ లడ్డూ ప్రసాదం వివాదంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని విశ్వహిందూ పరిషత్ ప్రాంతీయ ఉపాధ్యక్షురాలు బేకే సునీత, ఆధ్యాత్మికవేత్త సౌమిత్రి వేణుగోపాలాచార్యులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా మల్కాజిగిరి చౌరస్తాలో వారు నిరసన చేపట్టారు. భక్తులు పవిత్రంగా కొలిచే స్వామివారి ప్రసాదంలో జరిగిన తప్పులపై రాజీవారి విచారణ చేయించాలన్నారు. దేవాలయాల్లో పవిత్రతను కాపాడాల్సిన అన్యమతస్తులను తొలగించాలన్నారు. అన్యాక్రాంతమైన దేవాలయ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం ఉండరాదని.. దేవాదాయ ధర్మాదాయశాఖను రద్దుచేసి పీఠాధిపతులు, స్వామీజీలు, ధార్మిక సంస్థలు, సేవాసంస్థల ప్రతినిధులతో ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయాలలో ఉపయోగించే పూజా ప్రసాద సామగ్రిపై సర్కార్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రామనరసింహులు, రజనీకాంత్, పుష్పరాజ్, దుర్గాప్రసాద్, రాజిరెడ్డి, గోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



పారిశ్రామికవాడ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: తార్నాక ఆనంద్‌బాగ్ డివిజన్ మౌలాలి పారిశ్రామికవాడలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కమిటీ కార్యదర్శి నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. ఇందుకోసం వలస కార్మికుల చట్టాన్ని అమలుచేయాలని కోరారు. పారిశ్రామిక వాడలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.26వేలు జీతం ఇవ్వాలని.. వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింప చేయాలన్నారు. సీఐటీయూ ప్రతినిధులు శంకర్, మల్లేశ్, అనసూయ, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ వేడుక.. సంస్కృతికి ప్రతీక

3 నుంచి నవరాత్రుల సందడి



సంతోష్‌నగర్‌లో అంబాభవానీ



మల్లికార్జున్‌నగర్ నల్లపోచమ్మ

గౌతంనగర్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే దేవీ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు గౌతంనగర్ డివిజన్ పరిధిలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈనెల 3 నుంచి 12 వరకు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు సమాయత్తమవుతున్నాయి. అమ్మవారిని రోజుకో రూపంలో కొలుస్తూ విశేష పూజలు, కుంకుమార్చన, అన్నదానం, పుష్పాలంకరణ కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

తొమ్మిది రూపాలు.. నవరాత్రుల సందర్భంగా ఆలయాలకు రంగులు వేయడంతో పాటు విద్యుత్తు దీపాలతో అలంకరించి కొత్త సొబగులు తీసుకొచ్చారు. గౌతంనగర్ డివిజన్ సంతోష్‌నగర్‌లోని అంబాభవానీ ఆలయం, నల్లపోచమ్మ అమ్మ వారి ఆలయం, రైల్వేగేట్ సమీపంలోని దుర్గామాత ఆలయాలు నవరాత్రి సంబరాల కోసం సిద్ధమవుతున్నాయి. 41 ఏళ్ల చరిత్ర కలిగిన అంబాభవాని ఆలయానికి ప్రస్తుత కమిటీ అధ్యక్షుడు టి.కృష్ణ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మల్లికార్జున్‌నగర్ మల్లన్నగుట్టలోని నల్లపోచమ్మ అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షుడు రామస్వామి వ్యవహరిస్తున్నారు. 3న బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణతో ప్రారంభమై... 12న రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిస్తారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రఘునాథ్ స్వామి

అల్వాల్, న్యూస్‌టుడే: ఓల్డ్అల్వాల్‌లో పునర్నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణ పనులను సోమవారం అధికారులు తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రఘునాథ్ స్వామి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వేణుగోపాల్ ఉప వైద్య అధికారి శశికళ, అల్వాల్ అధికారి యూకేందర్‌రెడ్డి నిర్మాణ పనుల తీరును సమీక్షించారు. సాధ్యమైనంత తొందరలో పనులు పూర్తి చేయాలని జిల్లా అధికారి గుత్తేదారుకు సూచించారు. ఆసుపత్రి నిర్మాణం ఎలాంటి లోపాలకు ఆస్కారం ఉండకుండా పర్యవేక్షించాలని స్థానిక అధికారులను కోరారు.

లయోలాలో బాపు దివస్ వేడుకలు

అల్వాల్: అల్వాల్‌లోని లయోలా అకాడమీలో గాంధీ జయంతిని పురస్కరించుకుని బాపు దివస్ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. అక్టోబరు 2 వరకు నిర్వహించే ఈ ఉత్సవాలను లయోలా స్టూడెంట్ కౌన్సిల్, ఖాదీ గ్రామీణ అభివృద్ధి, పరిశ్రమల కమిషన్(కేవీఐసీ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అకాడమీలో ఖాదీ ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అంతకుముందు మెట్రోపాలిటన్ ఖాదీ సంస్థాన్ ఛైర్మన్ విద్యాసాగర్‌రావు ప్రదర్శనను ప్రారంభించారు. కేవీఐసీ డైరెక్టర్ మనోజ్‌కుమార్, లయోలా ప్రిన్సిపల్ బాబు, జోసెఫ్, అరుల్‌జోతి పాల్గొన్నారు.

టెంపుల్ అల్వాల్‌లో స్వచ్ఛతా హీ సేవ



మొక్క నాటుతున్న సర్కిల్ అధికారులు

అల్వాల్, న్యూస్‌టుడే: టెంపుల్ అల్వాల్‌లో సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సహాయ మున్సిపల్ కమిషనర్(ఏఎంసీ) నర్సింహారెడ్డి నాయకత్వంలో ఉద్యోగులు సర్కిల్ కార్యాలయం, పరిసరాల్లో మొక్కలు నాటారు. రోడ్లను శుభ్రం చేసి వ్యర్థాలను ఎత్తిపోశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోరుతూ నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ కార్యక్రమాలను ఇంటి నుంచి మొదలు పెట్టాలని నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. సూపరింటెండెంట్ స్వామి, పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్, ఉద్యానవన అధికారి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఆహార కల్తీ.. భద్రతపై అవగాహన అవసరం



విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ మల్లన్న

అల్వాల్, న్యూస్‌టుడే: అల్వాల్‌లోని లయోలా అకాడమీ బీఎస్సీ ఫుడ్‌టెక్నాలజీ విద్యార్థులు యాదాద్రి జిల్లా తుర్కపల్లి-మాదాపూర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఆహారకల్తీ, భద్రతపై సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లయోలా విద్యార్థులు ఆహార కల్తీ ఏవిధంగా జరుగుతుంది, ఎలా గుర్తించాలి, నివారించాల్సిన దానిపై పాఠశాల విద్యార్థులకు వివరించారు. ఫుడ్ టెక్నాలజీ హెచ్ఓడీ అనూష, సుజాత నాయకత్వంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. అంతకుముందు ఎమ్మెల్సీ మల్లన్న అవగాహన సదస్సును ప్రారంభించారు. విద్యార్థుల సూచనలు విన్నారు. లయోలా ప్రిన్సిపల్ ఫాదర్ బీబీబాబు, వైస్‌ప్రిన్సిపల్ ఆంటోని, డాక్టర్ తిరుపతి, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మాలతి పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై దాడి.. కేసు నమోదు

గౌతంనగర్: భారాస కార్పొరేటర్‌పై దాడి జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మల్కాజిగిరి సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ భారాస కార్పొరేటర్ ఏకే మురుగేష్ డివిజన్ పరిధిలోని పీవీఎన్‌కాలనీలో ఉంటారు. ఆయనకు వేరే వ్యక్తులతో వ్యాపార లావాదేవీల్లో పొరపొచ్చాలు గొడవల కారణంగా ఈనెల 23న పలువురు వ్యక్తులు మురుగేష్‌పై దాడిచేసి గాయపరిచారు. ఆయన పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

తనిఖీల్లో మత్తు ఇంజెక్షన్లు స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

పంజాగుట్ట, న్యూస్‌టుడే: మత్తు ఇంజెక్షన్లు తరలిస్తున్న వ్యక్తిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. యూసుఫ్‌గూడ కృష్ణానగర్ చెందిన మహ్మద్ నయాముద్దీన్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్. ఈనెల 28న అమీర్‌పేటలో దివ్యశక్తిహాస్పిటల్ వద్ద పంజాగుట్ట పోలీసులు తనిఖీలు చేశారు. వాహనం డిక్కీలో 7 మత్తు ఇంజెక్షన్లు లభించాయి. పోలీసులు నయాముద్దీన్‌ను అరెస్ట్ చేసి విచారించగా అవి మదీనాగూడకు చెందిన ఓ వ్యక్తి ఇచ్చాడని చెప్పాడు. పోలీసులు ఖుసీఫ్‌ను స్వాధీనం చేసుకుని, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను పిలిపించి విచారించారు. మల్కాజిగిరి నేరేడ్‌మెట్‌కు చెందిన సిద్ధూ వాటిని కొనుగోలు చేస్తున్నట్లు తేలడంతో ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

'ప్రజావాణి'కి 155 ఫిర్యాదులు

ఈనాడు, హైదరాబాద్: జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 155 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ ఆమ్రపాలి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర కార్యాలయంలో చేపట్టిన కార్యక్రమంలో ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్న ఆమె.. ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు తీసుకున్నారు. కేంద్ర కార్యాలయంలో 118 ఫిర్యాదులొచ్చాయి. జోనల్ కార్యాలయాల్లో 37 అర్జీలను ప్రజలు అందజేశారు. వాటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేర్వేరు విభాగాలకు చెందిన 13 మంది ఉద్యోగులు పదవీవిరమణ పొందగా, వారిని పరిపాలన విభాగం ఆధ్వర్యంలో సన్మానించినట్లు తెలిపారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించండి



ట్రాలీ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సునీత యాదవ్

మౌలాలి, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కార్పొరేటర్ గున్నాల సునీత యాదవ్ సూచించారు. కార్మికులకు చెత్త తరలించేందుకు వినియోగించే రిక్షాలు, ట్రాలీలను ఆమె సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌చార్జి శ్రీనివాస్, అజయ్, భారతి, అంజమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి: ఐఎఫ్‌టీయూ

రాంనగర్, న్యూస్‌టుడే: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం.. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరావు ఆరోపించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసంఘటితరంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. శ్రీనివాస్, ప్రదీప్, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ర్యాంపుపై రంధ్రం.. ప్రాణ సంకటం



నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి ఆర్కేపురం వంతెన సమీపంలోని ముగురు కాల్వపై నున్న ర్యాంప్ మధ్యలో రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఇది రాత్రి సమయంలో వాహనదారులకు ప్రాణసంకటంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే అధికారులు సమస్య తీవ్రతను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. –న్యూస్‌టుడే, డిఫెన్స్‌కాలనీ

పోరాటాలకు సిద్ధం కావాలి

ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే: మహిళా హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. కమలానగర్‌లో సోమవారం ఐద్వా మేడ్చల్ జిల్లా 3వ మహాసభ జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల వినోద, విజయ, ఐఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

ఏఎస్ రావునగర్: ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ప్రీతం సూచించారు. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ముఖ్య అతిథిగా వచ్చారు.

అలరించిన ద్విభాషా గీత విభావరి

గాంధీనగర్: బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకురాలు లతామంగేష్కర్ జయంతి వేడుకలను త్యాగరాయ గానసభలో నిర్వహించారు. తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి అలరించింది. గాయకులు ఏకగళ, యుగళ గీతాలను శ్రవణానందంగా ఆలపించారు.

వైద్య బీమా పరిమితి పెంచండి

బాగ్‌లింగంపల్లి: జలమండలి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వైద్య బీమా కింద ప్రస్తుతం రూ.3 లక్షలు చెల్లిస్తున్నారని.. సంబంధిత మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలని వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బీఆర్ టీయూ కార్యాలయంలో సమావేశం జరిగింది.

శాస్త్రీయ దృక్పథం అవసరం

ఏఎస్‌రావునగర్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఆచార్య కోయ వెంకటేశ్వర్‌రావు సూచించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను గీతం జూనియర్ కళాశాలలో నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

అవీ ఇవీ

ఐఎన్‌టీయూసీ ఎన్‌డబ్ల్యూ కమిటీ ఎన్నిక

కంటోన్మెంట్: జేబీఎస్ సమీపంలోని కంటోన్మెంట్ పార్కులో సోమవారం ఆర్టీసీ కంటోన్మెంట్ డిపో ఐఎన్‌టీయూసీ ఎన్‌డబ్ల్యూ కార్యవర్గ ఎన్నిక జరిగింది. ముఖ్య అతిథి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. డిపో అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌కుమార్ ఎన్నికైనట్లు వెల్లడించారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

గాంధీనగర్: ఉద్యోగులు విధి నిర్వహణలో అందించిన సేవలు చిరకాలం నిలిచిపోతాయని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ రియాజ్ అన్నారు. చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో జరిగిన.. ఉప గ్రంథపాలకుడు మదన్ మోహన్ పదవీవిరమణ కార్యక్రమంలో మాట్లాడారు.

రంగస్థల పురస్కారాల ప్రదానం

గాంధీనగర్, న్యూస్‌టుడే: సాంస్కృతిక సంస్థ అభినందన, త్యాగరాయగానసభల సంయుక్తాధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలు నిర్వహించారు. అభినందన-అక్కినేని రంగస్థల పురస్కారాలను నటులు సుబ్బరాయశర్మ, విజయ భాస్కర్, లంకా లక్ష్మీనారాయణలకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ భవానీప్రసాద్ ముఖ్యఅతిథిగా ప్రదానం చేసి సన్మానించారు.

ఉత్సాహంగా వక్తృత్వ పోటీలు

సనత్‌నగర్: అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీఎస్‌పీసీబీ) ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలను నిర్వహించారు. నగరంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నరికారు.. తరలించడం మరిచారు



గౌతంనగర్ డివిజన్ దయానంద్‌నగర్ ఒకటో వీధిలో విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్నాయని తొలగించిన చెట్ల కొమ్మలను అక్కడే నుంచి తరలించడం లేదు. ఇళ్ల ముందు అడ్డుగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆకులు కుళ్లి దుర్వాసన వ్యాపిస్తోందని.. కొమ్మలను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. –న్యూస్‌టుడే, గౌతంనగర్

నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

రాంనగర్, న్యూస్‌టుడే: దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని మండపాల నిర్వాహకులకు చిక్కడపల్లి ఏసీపీ రమేష్ సూచించారు. సోమవారం రాత్రి తన కార్యాలయంలో.. వారందరితో ఆయన ప్రత్యేకంగా సమావేశమై పలు విషయాలపై అవగాహన కల్పించారు. రహదారులపై రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులుకలుగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అమ్మవారి ప్రతిమల నిమజ్జనం ఊరేగింపులో డీజేలను వినియోగించొద్దని సూచించారు. దేవీ శరన్నవరాత్రులు ముగిసేవరకు ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో చిక్కడపల్లి సీఐ సీతయ్య, పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ముషీరాబాద్

● ముషీరాబాద్ ● అంబర్‌పేట

అలరించిన ద్విభాషా గీత విభావరి


కనకరత్నంకు జ్ఞాపిక అందజేస్తూ..

గాంధీనగర్: బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకురాలు లతామంగేష్కర్ జయంతి వేడుకలను త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న ఏకగళ, యుగళ గీతాలను శ్రవణానందంగా ఆలపించారు. అనంతరం మల్లాది కనకరత్నంకు సిటీ స్మాల్ కాజెస్ కోర్టు సూపరింటెండెంట్ వీవీఎస్ అంజనీకుమారి, నిర్మాత రామసత్యనారాయణలు ఆత్మీయ సత్కారం చేశారు. బహుగళ గాయకుడు టి.రామోజీ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో దేవిక, శ్యామల, కిరణ్మయి, శారదాదేవి, దుర్గాప్రసాద్, వెంకట్రావు, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి


కార్యక్రమంలో జస్టిన్‌పటేల్, రితీష్‌జాగీర్దార్ తదితరులు

కాచిగూడ: అభివృద్ధి కార్యక్రమాల్లో అన్నివర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని తెలంగాణ లోటస్ ఫౌండేషన్, ఎస్ఎన్ పటేల్ సంస్థ ఛైర్మన్ జస్టిన్‌పటేల్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక హోటల్‌లో ఏర్పాటుచేసిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమాన్ని ఆయనతో జైన్ మైనార్టీ ఫెడరేషన్ తెలంగాణ కన్వీనర్ రితీష్ జాగీర్దార్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రం అన్నిరంగాల్లోనూ అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందని చెప్పారు. పవన్, నిహాల్, తుషార్, ఇర్ఫాద్, కునాల్, లలిత్, సుత్ర, మహేందర్, పురుషోత్తం పటేల్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట్ సర్కిల్ ఈఈగా రమేష్‌బాబు

అంబర్‌పేట: జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌(ఈఈ)గా రమేష్‌బాబు బాధ్యతలను చేపట్టారు. సోమవారం ఆయన తులసీనగర్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో.. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, డీఈఈ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు దుర్గ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మల తొట్లు.. ఏర్పాటుకు టెండర్లు

వేడుకలు సమీపిస్తుండడంతో అంబర్‌పేట సర్కిల్ అధికారుల సమాయత్తం


తొట్టిలో బతుకమ్మలు వేస్తున్న మహిళలు (పాతచిత్రం)

అంబర్‌పేట, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మల నిమజ్జన ప్రక్రియకు సంబంధించి తొట్లు ఏర్పాటు కోసం జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ అధికారులు సమాయత్తమవుతున్నారు. బతుకమ్మ పండగ సమీపిస్తోంది. ఈ వేడుకలు మొదలయ్యాక.. తొమ్మిది రోజుల పాటు మహిళలంతా కలిసి ఉత్సాహంగా బతుకమ్మలు ఆడుతారు. ఆట, పాటల అనంతరం ఘనంగా పూజలు నిర్వహించాక వాటిని సమీపంలోని చెరువులు, కొలనులు, కుంటలలో నిమజ్జనం చేస్తారు. అయితే, నగరంలో ఇవి కనుమరుగు కావడంతో నిమజ్జనానికి కృత్రిమ తొట్లను జీహెచ్‌ఎంసీ కొన్నేళ్లుగా ఏర్పాటు చేస్తోంది. ఈ ఏడాది కూడా ఎక్కడికక్కడ వాటిని ఏర్పాటు చేసేలా అధికారులు దృష్టి సారించారు.

మున్సిపల్ డివిజన్	ఏర్పాటు చేయనున్న తొట్లు
నల్లకుంట	43
గోల్నాక	41
హిమాయత్‌నగర్	38
అంబర్‌పేట	36
కాచిగూడ	36
బాగ్‌అంబర్‌పేట	33

డివిజన్ల వారీగా.. జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలోకి అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట డివిజన్లు, ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ డివిజన్ వస్తుంది. ప్రస్తుతం ఆయా డివిజన్లలోని వివిధ ప్రాంతాలు, కాలనీలు, బస్తీలలో బతుకమ్మ తొట్ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.

అంచనా వ్యయం: ఒక్కో బతుకమ్మ తొట్టిని ఏర్పాటు చేయడానికి అంచనా వ్యయాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు ఖరారు చేశారు. ఇందుకు రూ. 2.60 లక్షల నుంచి 3.50 లక్షల వరకు అవుతుందని అంచనా వేస్తున్నారు. అందుకనుగుణంగా టెండర్లను కూడా పిలిచారు. అంచనా వ్యయం కంటే ఎవరు తక్కువ ధరకు టెండర్లు వేస్తే వారికి బతుకమ్మ నిమజ్జనం తొట్ల ఏర్పాటు పనులను అప్పగిస్తారు.

టెండర్లు పిలిచాం..

–ప్రశాంతి, డీఈ, జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్

బతుకమ్మ తొట్ల ఏర్పాటు కోసం ఇప్పటికే టెండర్లు పిలిచాం. అవి ఖరారు కాగానే వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో..

ముషీరాబాద్, న్యూస్‌టుడే: బతుకమ్మలను సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేసేందుకు ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోనూ డివిజన్లవారీగా తాత్కాలిక నీటి తొట్ల ఏర్పాటుపై జీహెచ్‌ఎంసీ దృష్టి సారించింది మొత్తం ఆరు డివిజన్లలో.. గతేడాది ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే ఈ దఫా కూడా వాటిని అందుబాటులోకి తేనున్నారు. ఇందుకు కావాల్సిన నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి జీహెచ్‌ఎంసీ అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. మొత్తం 65 చోట్ల త్వరలోనే సంబంధిత తొట్లు ఏర్పాటు చేయన్నట్లు జీహెచ్‌ఎంసీ డీఈ సన్ని తెలిపారు. వాటితోపాటు ట్యాంక్‌బండ్‌లోని బతుకమ్మ ఘాట్‌లోనూ మరో 20 వరకు తొట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు.

డివిజన్‌లలో ఏర్పాటు చేయనున్న తొట్లు..

గాంధీనగర్ –14; అడిక్‌మెట్ – 14;
ముషీరాబాద్ –12; రాంనగర్ –12;
భోలక్‌పూర్ –8; కవాడిగూడ –5

మేమున్నాం.. మీకు తోడుగా..	
ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

ముషీరాబాద్, నల్లకుంట, న్యూస్‌టుడే:

? ముషీరాబాద్ ప్రధాన రహదారిలోని రాజా డీలక్స్ సమీపంలో రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. రాకపోకల వేళ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. –బల్ల ప్రశాంత్ నేత, స్థానికుడు

✓ పరిశీలించి వెంటనే మరమ్మత్తులు చేయిస్తాం.
–గీతాకుమారి, జీహెచ్‌ఎంసీ డీఈ

? తిలక్‌నగర్ పరిధిలో నల్లాల నుంచి మురుగు నీరు వస్తోంది. తాగేందుకు అవి అనుకూలంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. –అనిల్‌కుమార్, తిలక్‌నగర్

✓ నల్లాల నుంచి నీటి సరఫరాను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. –రోహిత్, జలమండలి మేనేజరు

'నూతన సభ్యులు నిబంధనలు పాటించాలి'


సభ్యత్వాన్ని అందిస్తున్న దుర్గాప్రసాద్‌రెడ్డి

అంబర్‌పేట: అంబర్‌పేట దేవస్థాన సేవా సమితిలో నూతన సభ్యులుగా 620 మందికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో సమితి అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటుచేసి వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్య సలహాదారు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న సమితి నియమ, నిబంధనల మేరకు సభ్యులంతా నడుచుకోవాలని కోరారు. సమితి ఛైర్మన్ జ్ఞానేశ్వర్‌గౌడ్, ఫైనాన్స్ కమిటీ కన్వీనర్ గిరిధర్‌గౌడ్, బొడ్రాయి పునర్నిర్మాణ కమిటీ కన్వీనర్ చింతల శ్రీనివాస్ ముదిరాజ్ కొత్త సభ్యులకు దిశానిర్దేశం చేశారు. కమిటీ వైస్ ఛైర్మన్ లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి బిందిరాజ్‌గౌడ్, కార్యదర్శి చెంగల్ సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శి కిషోర్, కోశాధికారి గడ్డం శ్రీధర్‌గౌడ్, హనుమాన్ దేవాలయ పునర్నిర్మాణ కమిటీ కన్వీనర్ రాఘవేందర్‌రెడ్డి, సభ్యులు పాండు, అజయ్, కోటం అనిల్ పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు


కార్యక్రమంలో మాట్లాడుతున్న రియాజ్

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అందించిన సేవలు చిరకాలం నిలిచిపోతాయని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ రియాజ్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో జరిగిన.. ఉప గ్రంథపాలకుడు గాడిచెర్ల మదన్‌మోహన్ పదవీవిరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఉద్యోగులకు బదిలీలు, పదవీవిరమణ సహజమేనని, విధుల నిర్వహణలో నిస్వార్థంగా అందించిన సేవలతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు. నగర గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జి కదిరవన్, కార్యదర్శి పద్మజ, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చాగంటి అయోధ్య, కార్యదర్శి మహేందర్, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆర్పీఐ బలోపేతమే లక్ష్యం


అభివాదం చేస్తున్న ఆంజనేయులు, చొక్కారావు, శివనాగేశ్వర్‌రావు, ప్రభుదాస్, దీప, పుష్పలత

బాగ్‌లింగంపల్లి: తెలంగాణ రాష్ట్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ)ను బలోపేతం చేయడంపై దృష్టిసారించినట్లు ఆర్పీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శివనాగేశ్వర్‌రావు తెలిపారు. ఇందుకోసం జిల్లాలవారీగా సభ్యత్వ నమోదు ప్రక్రియను త్వరలో చేపడతామన్నారు. నగరంతోపాటు శివార్లలోని జలవనరుల పరిధిలో నివసించే పేదలకు పునరావాసం కల్పించకుండా.. వారి ఇళ్లను కూల్చివేయొద్దని హైడ్రా అధికారులను కోరారు. సోమవారం సుందరయ్య కళానిలయంలో ఆర్పీఐ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. హైడ్రా వైఖరితో చెరువులు, మూసీ పరీవాహక ప్రాంతాల్లోని పేదలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. వాటి చెంత అక్రమంగా నిర్మించిన ప్రముఖుల ఇళ్ల కూల్చివేతపై మాత్రం దృష్టిసారించడం లేదని.. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి పది నెలలు అవుతున్నా.. 'ఆరు గ్యారంటీ'లను పూర్తిస్థాయిలో అమలుచేయడం లేదని ఆరోపించారు. ఆర్పీఐ రాష్ట్ర కార్యదర్శులు చొక్కారావు, ఆంజనేయులు, జాతీయ కార్యవర్గ సభ్యుడు ప్రభుదాస్, దక్షిణ భారత్ విభాగం సభ్యురాలు పుష్పలత పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే


బాధితులతో మాట్లాడుతున్న కాలేరు వెంకటేష్

గోల్నాక, న్యూస్‌టుడే: 'హైడ్రా'కు వ్యతిరేకంగా అక్టోబరు 1న తులసీనగర్ లంకలో పర్యటించనున్న భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. బాధితులు, భారాస శ్రేణులు కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయాలన్నారు. సోమవారం తులసీనగర్ లంకలో పర్యటించిన ఆయన.. మూసీ పరిధిలో నివసించే ప్రజలతో మాట్లాడారు. అక్రమ నిర్మాణాల కూల్చివేత పేరిట బుల్‌డోజర్లను తీసుకొచ్చి భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. బాధితులకు భారాస అండగా ఉంటుందని హామీనిచ్చారు.

ధ్రువపత్రాల ప్రదానం

నల్లకుంట: చదువుతో పాటు నైపుణ్యాల పెంపుపైనా విద్యార్థులు దృష్టి సారించాలని.. తద్వారా ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. రంజిత్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్, ఓరియన్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీల ఆధ్వర్యంలో నల్లకుంటలోని శిక్షణ సంస్థలో జరిగిన కార్యక్రమంలో ఉచిత కంప్యూటర్ శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్నవారికి ధ్రువపత్రాలను ప్రదానం చేశాక ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆయా సంస్థల సీఈవోలు రంజిత్‌కౌర్, రజిబ్ సింఘా పాల్గొన్నారు.

జలమండలి ఉద్యోగుల వైద్య బీమా పరిమితి పెంచండి

బాగ్‌లింగంపల్లి: జలమండలి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలోభాగంగా వైద్య బీమా కింద ప్రస్తుతం రూ.3 లక్షలు చెల్లిస్తున్నారని.. సంబంధిత మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలని వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో సమావేశం జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించాలని జలమండలి ఎండీని కోరామన్నారు. తమ విజ్ఞప్తిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. సమావేశంలో యూనియన్ సలహాదారులు మహ్మద్ షకీల్, టీవీ లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించండి: సీఐటీయూ


మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

గాంధీనగర్: ఒప్పంద, పొరుగుసేవల విధానంలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరుతూ సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంబంధిత ఉద్యోగులకు కనీస వేతనంగా రూ.26,000 ఇవ్వాలని కోరారు. 1979 వలస కార్మిక చట్టాన్ని పటిష్టంగా అమలుచేయడంతోపాటు దాని ప్రకారం అన్ని సౌకర్యాలూ కల్పించాలని కోరారు. నేతలు ఎం.సాయిబాబు, భూపాల్, రమ, మల్లికార్జున్, ఈశ్వర్‌రావు, చంద్రశేఖర్, వీఎస్ రావు, రాములు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలి: ఇఫ్టూ


ధర్నాచౌక్‌లో ప్రసంగిస్తున్న వెంకటేశ్వరరావు

రాంనగర్, న్యూస్‌టుడే: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం.. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ-ఇఫ్టూ) జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు ఆరోపించారు. సోమవారం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసంఘటితరంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాటిని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని రేవంత్‌రెడ్డి సర్కార్‌కు విజ్ఞప్తి చేశారు. ఒప్పంద, పొరుగుసేవల విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రదీప్, రాష్ట్ర అధ్యక్షురాలు అనూరాధ, ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

'లడ్డూ కల్తీ'పై వీహెచ్‌పీ నిరసన ప్రదర్శన


హాజరైన హిందూత్వ సంస్థల ప్రతినిధులు

కాచిగూడ: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. సోమవారం కాచిగూడ చౌరస్తాలో జరిగిన కార్యక్రమానికి.. వీహెచ్‌పీ ప్రాంత ధర్మ ప్రసార ప్రముఖ్ వెంకటేశ్వర్‌రావు జాదవ్, శ్రీరామ్ సుధాకర్, భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ తదితరులు హాజరై మాట్లాడారు. పీఠాధిపతులు, స్వామీజీలతో ధార్మిక పరిషత్‌ను వెంటనే ఏర్పాటుచేసి దేవాలయ వ్యవస్థను పరిరక్షించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు. నేతలు అజయ్‌యాదవ్, అంకిత్, అభిషేక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ దుర్మరణం

కాచిగూడ: రైలు ఢీకొని మహిళ మృతిచెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ చిన్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... మహిళ(50) ఉప్పుగూడ స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం-2 వద్ద పట్టాలు దాటుతుండగా జైపూర్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం ఆమెను స్థానికంగా నివసించే షేక్ యూసుఫ్ భార్య ఫాతిమా బేగంగా గుర్తించారు.

వరద నిల్వకుండా చర్యలు చేపట్టండి

గాంధీనగర్: హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీ వద్ద వరదనీరు నిల్వకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని బల్దియా అధికారులను గాంధీనగర్ కార్పొరేటర్ పావని కోరారు. అశోక్‌నగర్ వీధి నం.1 అవెన్యూ అపార్ట్‌మెంట్ సమీపంలో రిటర్నింగ్ వాల్ వద్ద వరద నిలుస్తోందని ఆమెకు స్థానికులు ఫిర్యాదు చేశారు. సోమవారం ఇరిగేషన్ శాఖ ఏఈ శ్యామ్‌సుందర్, జీహెచ్‌ఎంసీ ఏఈ అబ్దుల్‌సలామ్‌లతో కలిసి సంబంధిత ప్రాంతాన్ని సందర్శించి సమస్యను పరిశీలించాక కార్పొరేటర్ మాట్లాడారు. వరదనీరు నాలాలోకి సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భాజపా సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

రంగస్థల పురస్కారాల ప్రదానం


అవార్డులను అందజేస్తున్న జస్టిస్ భవానీప్రసాద్, ఓలేటి పార్వతీశం

గాంధీనగర్: సాంస్కృతిక సంస్థ అభినందన, త్యాగరాయగానసభల సంయుక్తాధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అభినందన-అక్కినేని రంగస్థల పురస్కారాలను నటులు సుబ్బరాయశర్మ, మల్లాది భాస్కర్, లంకా లక్ష్మీనారాయణలకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ భవానీప్రసాద్ ముఖ్యఅతిథిగా ప్రదానం చేసి సన్మానించారు. తొలుత మల్లాది భాస్కర్ బృందం ప్రదర్శించిన 'హాస్యగుళికలు' కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుంది. సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, నిర్వహణ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి భవాని, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


స్థానికులతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించాలన్న స్థానికుల విజ్ఞప్తి మేరకు.. సోమవారం దుర్గానగర్‌లో చేపట్టిన పనులను పర్యవేక్షించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యలను తన దృష్టికి తెస్తే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మణ్, భాస్కర్, నేతలు లక్ష్మి, శంకర్, సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

భర్త మోసగించాడంటూ ఆందోళన

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: తన భర్త మరో మహిళను వివాహం చేసుకుని అన్యాయం చేశారని ఆరోపిస్తూ.. ఓ వివాహిత కుటుంబ సభ్యులతో కలిసి అతని ఇంటి ముందు బైఠాయించిన ఘటన ఏపీలోని శృంగవరపుకోట మండలం పోతనాపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన పరమేశ్వరి, కుటుంబ సభ్యులు, మహిళా సంఘ నాయకురాలితో కలిసి భర్త పూడి సుధాకర్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుధాకర్ హైదరాబాద్ సీసీఎస్‌లో హోం గార్డుగా పని చేయగా, తాను పక్కనే ఉన్న ప్రైవేటు ఆసుపత్రిలోని సెక్యూరిటీలో పనిచేశానన్నారు. ఇద్దరం ప్రేమించుకుని 2014లో పెద్దల సమక్షంలో యాదగిరిగుట్ట ఆలయంలో పెళ్లి చేసుకున్నామని చెప్పారు. తమకు అయిదేళ్ల పాప కూడా ఉందన్నారు. ఏడాదికిందట తండ్రి చనిపోయాడని అబద్ధం చెప్పి స్వగ్రామానికి వచ్చి విశాఖకు చెందిన వేరే మహిళను వివాహం చేసుకున్నారని ఆరోపించారు. ఆమెతో హైదరాబాద్‌లోనే వేరే ఇంట్లో కాపురం పెట్టారని చెప్పారు. నాలుగు నెలల కిందట ఫోను చేస్తే అతని భార్య మాట్లాడడంతో అసలు విషయం బయటపడిందన్నారు. ఈ ఏడాది జూన్ 12న ముషీరాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో అతన్ని ఉద్యోగం నుంచి తీసేశారని చెప్పారు. అప్పటి నుంచి స్వగ్రామంలోనే ఉంటున్నారన్నారు. దీంతో చేసేది లేక న్యాయం కోసం ఇక్కడికి వచ్చామని ఆమె తెలిపారు. సుధాకర్ కుటుంబ సభ్యులెవరూ ఇంట్లో లేరన్నారు.

క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిత


విద్యార్థికి జ్ఞాపిక అందిస్తున్న లక్ష్మీనారాయణ

బాగ్‌లింగంపల్లి: క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ముషీరాబాద్ విద్యామండల పరిధిలో ఇటీవల జరిగిన ఖోఖో, కబడ్డీ పోటీల్లో సత్తాచాటిన అంబేడ్కర్ హైస్కూల్ విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం కార్పొరేటర్ సుప్రియగౌడ్‌తో కలిసి విజేతలకు జ్ఞాపికలు అందజేసి మాట్లాడారు. డిప్యూటీ డీఈవో చిరంజీవి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్స్ స్కూల్స్(ఐవోఎస్) జయలక్ష్మీభారతి, మోడల్ స్కూల్ హెచ్‌ఎం జ్యోతిశ్రీ, ముషీరాబాద్ మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీలత, వ్యాయామ ఉపాధ్యాయులు పులి కిషోర్‌కుమార్, శ్రీనివాసమూర్తి, సలాఉద్దీన్, విమల పాల్గొన్నారు. అంబేడ్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సరోజవివేక్.. విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు.


ప్రయాణికురాలి సెల్‌ఫోన్లు, బంగారం చోరీ

కాచిగూడ, న్యూస్‌టుడే: ప్రయాణికురాలి సెల్‌ఫోన్లు, బంగారం, నగదుతో కూడిన చేతిబ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. నాగ్‌పుర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగిని రాఖీ ఫణికర్ ఆదివారం ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో నగరానికి వస్తున్నారు. రైలు విహిర్గావ్ స్టేషన్ వద్ద ఉండగా.. 3 సెల్‌ఫోన్లు, 6 గ్రాముల బంగారం, రూ. 5 వేల నగదు ఉన్న చేతిబ్యాగు చోరీకి గురైంది. సోమవారం బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి వార్ధా రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

గోల్నాకలో కూరగాయల ధరలు

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: (సోమవారం నాటివి... కిలోకు రూపాయల్లో) టమాట-40, ఆలుగడ్డ-45, వంకాయ-40, బెండ-60, దొండ-40, దోసకాయ-40, కాకర-60, బీర-60, సొర-25, క్యాబేజీ-40, క్యాప్సికం-60, బీన్స్-70, చిక్కుడు-60, క్యారెట్-45, బీట్‌రూట్-45, ఉల్లిగడ్డ-50, పచ్చిమిర్చి-45, వెల్లుల్లి-360, అల్లం-80.

బతుకమ్మ ముందస్తు సంబురాలు



బతుకమ్మ సంబురాలను ముందస్తుగానే ఎన్‌సీసీ చౌరస్తాలోని ది మదర్స్ ఇంటిగ్రల్ స్కూల్ ఆవరణలో సోమవారం నిర్వహించారు. కరస్పాండెంట్ సువర్చలరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో.. ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు శైలజ, అనిత, ప్రతిమలతోపాటు సంప్రదాయ దుస్తుల్లో హాజరైన చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం వారంతా కలిసి బతుకమ్మలను పేర్చాక.. వాటి చుట్టూ ఆడిపాడారు.

–న్యూస్‌టుడే, విద్యానగర్

మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులు, రద్దీ ప్రాంతాల్లో మహిళా ప్రయాణికులే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలు, చోరీ వస్తువులను కొనుగోలు చేసిన ఇద్దరిని టాస్క్‌ఫోర్స్, గోపాలపురం పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు వారి నుంచి 20 చరవాణులు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన సిరిగిరి కవిత(37) పండ్లు విక్రయిస్తుంది. మేడ్చల్‌కు చెందిన ఆమె మరిది వాంకుడోత్ ప్రసాద్(28) ఆటోడ్రైవర్. వచ్చే ఆదాయం చాలక ఇద్దరూ కలిసి చోరీల బాటపట్టారు. ద్విచక్ర వాహనంపై వచ్చి రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సుల్లో, రద్దీ ప్రదేశాల్లో మహిళల బ్యాగుల్లోని చరవాణులు దొంగిలించి వెళ్లిపోతుంటారు. వాటిని కాచిగూడకు చెందిన మహ్మద్ రఫీయుద్దీన్(30), మహ్మద్ ఇస్మాయిల్(26)కు విక్రయిస్తున్నారు. చోరీలపై ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టి ముమ్మరం చేశారు. నిందితులు రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం అంగీకరించారు. వీరు గోపాలపురం, ఉప్పల్, కామారెడ్డి, ఓయూ, గౌరారం, సిద్దిపేట, పేట్‌బషీరాబాద్, రామాయంపేట, మేడ్చల్ పోలీసుస్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడ్డారు. గతంలోనూ 13 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరి నుంచి చోరీ సొత్తు కొనుగోలు చేసిన మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చంపుతాడనే భయంతోనే.. పాత నేరస్థుడి హత్య

పోలీసుల అదుపులో నిందితుడు!

రాంనగర్, న్యూస్‌టుడే: లోయర్ ట్యాంక్‌బండ్ గోశాల వద్ద దారుణ హత్యకు గురైన వ్యక్తిని పాత నేరస్థుడిగా పోలీసులు గుర్తించారు. వారితోపాటు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్ డివిజన్ భరత్‌నగర్ ఫకీర్‌వాడకు చెందిన మహ్మద్ బషీర్(30) తండ్రి చిన్నతనంలోనే చనిపోవడంతో కొద్దిరోజులు మాంసం దుకాణంలో పనిచేశాడు. పదేళ్లుగా మద్యం, గంజాయికి బానిసగా మారి చోరీలకు ఉపక్రమించాడు. కుమారుడి ప్రవర్తన నచ్చకపోవడంతో.. అతడి తల్లి గౌరిబీ ఏడాది క్రితం తూంకుంటలోని కౌకూర్‌కు వెళ్లి ఒంటరిగా నివసిస్తోంది. అప్పటి నుంచి బషీర్ జులాయిగా తిరుగుతూ మద్యం తాగి స్థానికంగా కాలిబాటలపైనే నిద్రిస్తున్నాడు. ఈ క్రమంలో అదేబస్తీకి చెందిన ఫయాముద్దీన్(30)తో పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల క్రితం వారిద్దరికి గొడవ జరగగా.. స్నేహితుడిని చంపేస్తానంటూ బషీర్ బెదిరించాడు. తన ప్రాణానికి ముప్పు ఉంటుందని భయపడిన ఫయాముద్దీన్.. శనివారం రాత్రి బషీర్‌కు మద్యం తాగించి బ్లేడ్‌తో గొంతుకోసి హత్య చేశాక పారిపోయాడు. ఆదివారం రాత్రి స్థానికంగా ఉన్న ఓ వైన్స్ దుకాణంలోని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు.. బషీర్‌తో పాటు ఫయాముద్దీన్ మద్యం కొనుగోలు చేస్తూ కన్పించాడు. నిందితుడిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ప్రగతి పనులు పూర్తిచేయండి

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తిచేయడంతోపాటు ప్రజా సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ ఎండీ వాజిద్‌హుస్సేన్ కోరారు. ఈ మేరకు సోమవారం 'ప్రజావాణి'లో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం భోలక్‌పూర్‌లో ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో పలుచోట్ల రోడ్లు, వరదనీటి మ్యాన్‌హోళ్లు అధ్వానంగా మారాయని, వీధిదీపాలు వెలగడంలేదని, చెట్లకొమ్మలు విద్యుత్తు తీగలకు అడ్డుగా వస్తున్నాయని చెప్పారు. ఆయా సమస్యలను సత్వరం పరిష్కరించాలని జడ్సీని కోరినట్లు వివరించారు. నేతలు మహ్మద్ రహీముద్దీన్, ఖాజా మోయినుద్దీన్, చాంద్, షేక్ మక్దూమ్, యూసుఫ్ పాల్గొన్నారు.

ఉప్పల్

• ఉప్పల్ • మేడ్చల్

వయోవృద్ధులకు రక్షణ ఇలా..



క్యారమ్స్ ఆడుతున్న సీనియర్ సిటిజన్లు

కాప్రా, న్యూస్‌టుడే: వయోవృద్ధుల రక్షణ, సంక్షేమానికి చట్టాన్ని రూపొందించారు.

❖ 1956 చట్టం ప్రకారం రక్తసంబంధీకులు వృద్ధులను తప్పనిసరిగా పోషించాలి.

❖ 1999 నేషనల్ పాలసీ ఆన్ ఓల్డర్ పర్సన్స్ (ఎన్‌పీఓపి) చట్టం ప్రకారం కొడుకులు, కూతుర్లు, మనవలు, మనవరాళ్లు, రక్త సంబంధీకులు పోషించాలి.

❖ 2007లో ప్రవేశపెట్టిన వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టంలో 33 సెక్షన్లతో నియమావళిని రూపొందించారు.

❖ 2007 చట్టాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2011లో అమల్లోకి తీసుకొచ్చింది.

చట్టపరంగా కల్పించిన హక్కులు

❖ వయోవృద్ధులైన తల్లిదండ్రుల పోషణ, రక్షణ, సంక్షేమం వారి సంతానం స్వీకరించాలి.

❖ పిల్లలు పోషణ బాధ్యతలు తీసుకోకుంటే తల్లిదండ్రులు వారిపై ఆర్డీవో, కలెక్టర్, అప్పిలేట్ కమిటీలకు ఫిర్యాదు చేయొచ్చు.

❖ వయోవృద్ధుల ఫిర్యాదులను 60 రోజుల్లో అధికారులు తప్పని సరిగా పరిష్కరించాలి.

❖ తల్లిదండ్రులను పోషించని పక్షంలో వారసులు రూ.10,000 నుంచి ఆపై నిర్ధారించిన భృతిని చెల్లించాల్సి ఉంటుంది.

❖ ట్రిబ్యునల్ తీర్పులను ఖాతరు చేయని వారసులు, బంధువులకు జరిమానాలు, జైలుశిక్షలను విధిస్తారు.

❖ వారసులు పోషణ బాధ్యతలు స్వీకరించకపోతే తల్లిదండ్రులు వారికి రాసిచ్చిన స్థిరాస్తులను తిరిగి స్వాధీనం చేసుకునే హక్కు ఉంది.

❖ జిల్లా స్థాయిలో ఆస్పత్రుల్లో వృద్ధులకు ప్రత్యేక వార్డులు, క్యూలైన్లు, వసతులను విధిగా ఏర్పాటు చేయాలి.

❖ దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన వారికి ప్రభుత్వం ఉచితంగా వైద్య పరీక్షలు, వైద్య సేవలను అందించాలి.

❖ వృద్ధుల ప్రాణ, ఆస్తి రక్షణకు పోలీసులు, ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

❖ అనాధలు, రోడ్లపై ఉండే వృద్ధులను పోలీసు, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ కార్యాలయం సిబ్బంది వృద్ధాశ్రమాల్లో చేర్పించాలి.

కార్పొరేషన్ ఏర్పాటు అవసరం



– డాక్టర్ గెల్లి నాగేశ్వరావు, తెలంగాణ వయోవృద్ధుల సంక్షేమ సంఘం, ఉపాధ్యక్షుడు, జీహెచ్ఎంసీ ఆసరా సెంట్రల్ కమిటీ సభ్యులు

❖ రాష్ట్రంలో 16 శాతానికి పైగా వృద్ధులున్నారు.

❖ సంక్షేమానికి ప్రత్యేక 'వయోవృద్ధుల కార్పొరేషన్' ఏర్పాటు చేయాలి. ఏటా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగాలి.

❖ వయో వృద్ధులు పోషణ, సంరక్షణ 2007 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.

❖ దేశం విడిచి వెళ్లిన ఎన్ఆర్ఐల తల్లిదండ్రులకు 'మల్టీ డిసిప్లెనరీ డేకేర్ సెంటర్లు' ఏర్పాటు చేయాలి.

ఈ కన్నీళ్లకు జవాబేదీ..?



'తల్లీదండ్రి మీద దయలేని పుత్రుండు..పుట్టనేమి వాడు గిట్టనేమి.. పుట్టలోనా చెదలు పుట్టవా గిట్టవా.. విశ్వదాభిరామ వినుర వేమ..'

వేమన శతకకారుని మాటలు నిజమవుతున్నాయి.. తల్లిదండ్రులపై ప్రేమలేని కుమారులు పెరిగిపోతున్నారు.

కన్నవారిపై కాఠిన్యమా...!

ఓ తండ్రి ఇంట్లోంచి వెళ్లి పోతూ..

'అలసిపోయాను.. ముసలివాన్ని.. దయచేసి నన్ను అర్థం చేసుకో.. దుస్తులు వేసుకోవడం కష్టం.. కసురుకోకు. అన్నం తింటున్నప్పుడు చప్పుడు కాకుండా తినలేను.. హేళన చేయకు.. నీ చిన్నతనంలో నువ్వు కూడా అంతే.. ముసలి కంపు కొడుతున్నానని అసహ్యంగా చూడకు.. దగ్గరగా తీసుకుని కూర్చో.. చిన్నప్పుడు నువ్వు ఎలా ఉన్నా నేను అలాగే దగ్గరగా తీసుకునేవాన్ని.. నువ్విలా తీసుకుంటే హాయిగా నవ్వుతూ నీ ఒడిలో చనిపోతానురా.. కన్నా..'

- ఉప్పల్ డిపో ప్రాంతానికి చెందిన ఓ తండ్రి ఇంట్లోంచి వెళ్లిపోతూ రాసుకున్న డైరీ చివరి పేజీలోని ఆవేదన ఇది

'గతంలో నాచారం పారిశ్రామిక వాడలో రోడ్డు పక్కన చలితో వణకుతున్న వృద్ధురాలిని పెట్రోలింగ్ పోలీసులు అక్కున చేర్చుకున్నారు. ఆకలితో అలమటిస్తుండగా అన్నం తినిపించి, దుస్తులు వేశారు. ఆమెను ఆశ్రమానికి తరలించారు. అప్పటి పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు. ఘట్‌కేసర్,న్యూస్‌టుడే



మతిస్థిమితం లేని వృద్ధురాలికి దుస్తులు వేస్తున్న నాచారం పోలీసులు

ఆదర్శంగా నిలిచారు..

హబ్సిగూడ, న్యూస్‌టుడే: రామంతాపూర్‌లోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌ను 2004లో ఏర్పాటు చేశారు. 400మంది వయోవృద్ధులు ఉన్నారు. ప్రతిరోజు యోగాక్షేమాలు తెలుసుకుంటాం..ఒకరికి ఒకరం తోడుగా ఉంటాం. సామాజిక సేవలో ముందుంటారని సంస్థ అధ్యక్షుడు కపర్దేశ్వర్ తెలిపారు.

చేసిన సామాజిక సేవలు..

● రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్లలో ప్రైవేటు ఆసుపత్రుల సహకారంతో 100కుగా ఉచిత వైద్యశిబిరాల ఏర్పాటు.. ● దాతల సహకారంతో 150మందికి నేత్ర శస్త్రచికిత్స ● 600మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ● 500మంది పేదలకు దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేశార



మొక్కలను నాటుతున్న సభ్యులు

అమ్మ లాలన.. నాన్న పాలన

☛ వయోవృద్ధుల అమ్మఒడి.. మార్గదర్శి

☛ ఎన్నో రికార్డులు వీరి సొంతం...

☛ ఏఎస్‌రావునగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్

ఏఎస్‌రావునగర్, కాప్రా, న్యూస్‌టుడే: కాప్రా సర్కిల్‌లోని ఏఎస్‌రావునగర్‌లో 2001లో ఏఎస్‌రావు నగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను స్థాపించారు.

● ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో అతి పెద్ద వయోవృద్ధుల సంక్షేమ సంస్థగా గుర్తింపు పొందింది.

● 23 ఏళ్లుగా వృద్ధులకు విశిష్ట సేవలను అందిస్తోంది.

● సొంత భవనం ఉంది. వృద్ధులకు ప్రత్యేక డేకేర్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు.

● ప్రత్యేక కేర్ టేకర్‌ను జీహెచ్ఎంసీ నియమించింది.

● ఇక్కడి సభ్యులుగా ఉన్న వారి జీవన ప్రమాణం ఐదేళ్లకుపైగా పెరిగినట్లు నిపుణులు నిర్ధారించారు.

● సొసైటీ అధ్యక్షుడిగా ఆర్.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి పెనుగొండ రామమ్మోహన్ రావులు వ్యవహరిస్తున్నారు.



ఇదీ ప్రస్థానం

● ఏర్పాటు: 2001
● మొత్తం సభ్యులు : 1,000 మంది
● 80 ఏళ్లు దాటిన వారు : 120 మంది

సంక్షేమ కార్యక్రమాలు ఇలా...



వృద్ధులకు బీపీ చెకప్

● ప్రత్యేక గ్రంధాలయాన్ని ఏర్పాటు చేశారు. దిన, వార పత్రికలు, గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి.

● ప్రతి నెల వైద్య శిబిరం, పరీక్షలు నిర్వహిస్తారు.

● ప్రతి 15 రోజులకు అందరికీ బీపీ పరీక్ష చేస్తారు.

● రోజు క్యారమ్, చదరంగం వంటి ఆడిస్తారు.

● జన్మదిన వేడుకలను నిర్వహించి, సత్కరిస్తారు.

● లాఫింగ్ క్లబ్, ఛలోక్తులు, హాస్యవల్లరి, నృత్యాలతో సందడి చేస్తారు.

● 80 ఏళ్లు దాటిన వారి ఇళ్లకు వెళ్లి యోగాక్షేమాలు తెలుసుకుంటారు.

● ఇక్కడ **'మల్టీ డిసిప్లెనరీ కేంద్రం' ఏర్పాటు చేయనున్నారు.**

● కొత్తగా ఫిజియో సెంటర్ మంజూరు అయింది.

విధి నిర్వహణలో రాజ్యభాష వినియోగం



పత్రాలను ఇస్తున్న డీఐజీ

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో హిందీని అధికంగా వినియోగించాలని రంగారెడ్డి జిల్లా సీఆర్‌పీఎఫ్ గ్రూప్ కేంద్రం డీఐజీ అనిల్ మింజ్ అన్నారు. సోమవారం జవహర్‌నగర్‌లోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ కేంద్రంలో హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్‌లో విధుల్లో ఉన్న పలువురు గెజిటెడ్ అధికారులు, 99 ఆర్‌ఏఎఫ్ బెటాలియన్ ఉద్యోగులు, సీఆర్‌పీఎఫ్ కార్యాలయ ఉద్యోగులకు హిందీ భాషా దినోత్సవం సందర్భంగా పలు పోటీలను నిర్వహించారు. ఉత్తములుగా నిలిచిన వారికి ప్రశంసా పత్రాలను ఇచ్చారు.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఛైర్మన్ ప్రీతమ్

ఏఎస్ రావునగర్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎస్సీ ఛైర్మన్ ప్రీతం సూచించారు. సోమవారం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసి ప్రత్యేక వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ డా. బి. ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోపించిన పారిశుద్ధ్యం



పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని పోచారం మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా.. కొందరి నిర్లక్ష్యంతో ఆచరణలో మాత్రం అమలు కావడంలేదు. వరంగల్ ప్రధాన రహదారి నుంచి మున్సిపల్ కార్యాలయం వెళ్లే మార్గంలో ఎస్టీ వసతి గృహం(అద్దె భవనం)లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోజువారీగా వచ్చే నీరు రోడ్డు పక్కన గుంతలో నిల్వ ఉంటోంది. దోమలు పెరుగుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు. –పోచారం(ఘట్‌కేసర్)న్యూస్‌టుడే

సమస్యలకు సత్వరం పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే:మేడ్చల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులు 63 ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియకు విన్నవించారు.. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం సత్వరం చూపించాలని అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యం: సుధీర్‌బాబు



రక్షణ కిట్లను పంపిణీ చేస్తున్న సీపీ

కాప్రా, న్యూస్‌టుడే: రద్దీ రహదారులపై నిరంతరాయంగా విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాచకొండ కమిషనర్ జి.సుధీర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం రాచకొండ కమిషనరేట్‌లో ట్రాఫిక్ సిబ్బందితో సమావేశమయ్యారు. 730 మంది సిబ్బందికి వివిధ రకాల సామగ్రిని ఇచ్చారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ఏఎస్‌రావునగర్: మహిళా హక్కులకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. కమలానగర్ లో సోమవారం ఐద్వా మేడ్చల్ జిల్లా 3వ మహాసభ జరిగింది. ఈ సమావేశానికి ఆమె హాజరై మహిళలు విద్య, వైద్య రాజకీయ, శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందుకు రావాలన్నారు.

రైతుల ప్రయోజనమే ప్రాధాన్యం

శామీర్‌పేట, న్యూస్‌టుడే: రైతుల ప్రయోజనానికి పాలకవర్గం కృషి చేస్తుందని డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ రామిడి మధుకర్ రెడ్డి అన్నారు. సోమవారం శామీర్ పేట వ్యవసాయదారుల సేవా సహకార సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో కూరగాయలు, పండ్లు కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్రస్థాయిలోనే మొట్ట మొదటిసారిగా ఏర్పాటు చేశామన్నారు.

కాలనీవాసుల ఆందోళన

నాచారం, న్యూస్‌టుడే: నాచారంలోని దుర్గానగర్‌లో ఐలా చేపట్టనున్న వరదనాలా డ్రైనేజీ పనులను నిలిపివేయాలని సోమవారం కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. లోతట్టు కాలనీలోకి..వరదనీటి డ్రైనేజీ ఏర్పాటుతో మరింత ప్రమాదం పొంచి ఉందన్నారు. ఐలా కమిషనర్ ప్రభాకర్ కాలనీవాసులతో మాట్లాడారు.

ఐలాలో 100సీసీ కెమెరాలతో గస్తీ

నాచారం, న్యూస్‌టుడే: నాచారం పారిశ్రామికవాడలో ఐలా భాగస్వామ్యంతో పదిహేను రోజుల్లో 100సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ రుద్వీర్‌కుమార్ తెలిపారు. సోమవారం ఇండస్ట్రియల్ అసోసియేషన్ హాల్‌లో ఐలా ఛైర్మన్ మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన పోలీసు, విద్యుత్తు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

బొంతు కమలమ్మకు నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా, న్యూస్‌టుడే: చర్లపల్లి డివిజన్‌లోని రెడ్డికాలనీలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాతృమూర్తి కమలమ్మ పార్థివదేహానికి అంతిమ సంస్కారం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, ఎంపీలు సిరిసిల్ల రాజయ్య, రవిచంద్ర, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి పలువురు నివాళి అర్పించారు.

బోల్తా కొట్టిన కారు

ఒకరి మృతి. ఇద్దరికి గాయాలు

శామీర్‌పేట: వర్షంలో దారి కనిపించక అవుటర్ రింగ్ రోడ్డుపై వెళ్తున్న కారు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో అందులోని మహిళ దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అవుటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్-7కు అతిసమీపంలో సోమవారం ఈ ఘటన జరిగింది. ఎస్సై హారిక కథనం ప్రకారం.. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామానికి చెందిన బండం మనోహర్‌రెడ్డి తన తల్లి పుష్పలత(48), సోదరి రశ్మిత, కోడలు రియాన్షిలతో కలిసి కారులో అవుటర్ రింగ్ రోడ్డుపై నిజాంపేటకు వెళ్తున్నారు. శామీర్‌పేట ఎగ్జిట్7కు రాగానే వర్షం అధికం కావటంతో దారి కనిపించక డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో కారు బోల్తా పడింది. ఆ వాహనంలోని పుష్పలత సంఘటన స్థలంలోనే చనిపోయారు.మరో ఇద్దరికి గాయాలయ్యాయి,

మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులు, రద్దీ ప్రాంతాల్లో మహిళా ప్రయాణికులే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలు, చోరీ వస్తువులను కొనుగోలు చేసిన ఇద్దరిని టాస్క్‌ఫోర్స్, గోపాలపురం పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు వారి నుంచి 20 చరవాణులు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన సిరిగిరి కవిత(37) పండ్లు విక్రయిస్తుంది. మేడ్చల్‌కు చెందిన ఆమె మరిది వాంకుడోత్ ప్రసాద్(28) ఆటోడ్రైవర్. వచ్చే ఆదాయం చాలక ఇద్దరూ కలిసి చోరీల బాటపట్టారు. ద్విచక్ర వాహనంపై వచ్చి రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సుల్లో, రద్దీ ప్రదేశాల్లో మహిళల బ్యాగుల్లోని చరవాణులు దొంగిలించి వెళ్లిపోతుంటారు. వాటిని కాచిగూడకు చెందిన మహ్మద్ రఫీయుద్దీన్(30), మహ్మద్ ఇస్మాయిల్(26)కు విక్రయిస్తున్నారు.

'ప్రజావాణి'కి 155 ఫిర్యాదులు

ఈనాడు, హైదరాబాద్: జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 155 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ ఆమ్రపాలి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర కార్యాలయంలో చేపట్టిన కార్యక్రమంలో ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్న ఆమె.. ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు తీసుకున్నారు. కేంద్ర కార్యాలయానికి 118 ఫిర్యాదులొచ్చాయని.. జోనల్ కార్యాలయాల్లో 37 అర్జీలను ప్రజలు అందజేశారన్నారు. వాటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు.

డివైడర్‌ను ఢీ కొట్టి: వ్యక్తి మృతి

మేడ్చల్, న్యూస్‌టుడే: డివైడర్‌ను ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన మజ్జి శ్రీకాంత్(29), మున్నూరు నరేష్‌లు తమ ద్విచక్రవాహనంపై సోమవారం తెల్లవారుజామున తూప్రాన్ వెళ్తున్నారు. అత్వెల్లి మజీద్ సమీపంలో మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు విభాగినిని ఢీ కొట్టింది. శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. నరేష్‌కు గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు.

రైలు ఎక్కుతుండగా జారిపడి తీవ్ర గాయాలు

మేడ్చల్, న్యూస్‌టుడే: రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడిన ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి ఈసంఘటన గుండ్లపోచంపల్లి రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడు(60) సోమవారం రాత్రి 9గంటల సమయంలో నగరానికి వెళ్తున్న రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు రైలు కిందపడిపోయాడు.కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

న్యూస్‌టుడే: బోడుప్పల్,నాగారం, నాచారం

? చెంగిచర్ల కబేళా కాలుష్యం ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. –ఏర్పుల కుమార్, చెంగిచర్ల

✓ చెంగిచర్ల కాలుష్యంపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. తగిన చర్యలు తీసుకుంటాం. –రామలింగం, కమిషనర్, బీఎంసీ.

? నాచారంలోని హనుమాన్‌నగర్ సామాజిక భవనం సమీపంలో రెండు మ్యాన్‌హోళ్లకు మూతలు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. –సుజాత, నాచారం

✓ సిబ్బందిని పంపి మ్యాన్‌హోళ్లకు మూతలు ఏర్పాటు చేస్తాం. –వేణుగోపాల్, జలమండలి మేనేజర్, నాచారం

?దమ్మాయిగూడలోని సిద్ధార్థ కాలనీ రెండు వైపులా బస్ స్టాపుల్లో తోపుడు బండ్లు, వ్యాపారుల ప్రకటనల బోర్డులు పెట్టడంతో ఇబ్బందికరంగా ఉంది. - మహేశ్వర్‌రెడ్డి, సిద్ధార్థ కాలనీ

✓ సిబ్బందిని పంపించి వాటిని తొలగిస్తాం. – ప్రభు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, దమ్మాయిగూడ

అవినీతి నిర్మూలనతోనే అభివృద్ధి

ఉప్పల్, న్యూస్‌టుడే:అవినీతి నిర్మూలనతోనే దేశాభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అవినీతి, పక్షపాతం, బంధుప్రీతి రహితంగా కార్యాచరణ కొనసాగించడంతోనే సమగ్రాభివృద్ధిని సాధించవచ్చన్నారు. ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాచారంలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) భాగస్వామ్యంతో సోమవారం విద్యార్థులకు అవినీతి అంశంపై వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, బీఈఎల్ డీజీఎం ఉమామహేశ్వరరావు,'హత్ బెక్కం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విధుల్లో చేరిన ఇంజినీరులు

కాప్రా, న్యూస్‌టుడే: కాప్రా సర్కిల్ కొత్త ఈఈగా నాగేందర్, డీఈగా బాలకృష్ణ, ఏఈగా సూరజ్‌లు సోమవారం విధుల్లో చేరారు.

శ్మశానవాటికల అభివృద్ధికి వినతి

కాప్రా: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని సోమవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. నియోజవర్గంలో శ్మశానవాటిక సుందరీకరణ, వసతులు, రోడ్లు, డ్రైనేజీను అభివృద్ధి పరచాలని వినతి పత్రాన్ని ఇచ్చారు.

మురుగు కాలవ పనులు షురూ

నాగారం, న్యూస్‌టుడ: మురుగు కాలువ, సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం దమ్మాయిగూడ ఛైర్మన్ వసుపతి ప్రణీత, కౌన్సిలర్ కొత్త సురేఖలు భూమిపూజ చేశారు. లక్ష్మనగర్ కాలనీలో రూ.8 లక్షలతో మురుగు కాలువ, సీసీ రోడ్డు నిర్మిస్తామన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

మేడ్చల్: ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మేడ్చల్ పట్టణంలోని కేఎల్లార్ ఫేస్ 1,2,3, శ్రీకాలనీ, కిస్టాపూర్‌లో విదుత్తు సరఫరా ఉండదు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

హబ్సిగూడ: రామంతాపూర్ భగాయత్‌కాలనీలలో కనీస సౌకర్యాలు లేవని, వాటిని పరిష్కరించాలని కార్పొరేటర్ బండారు శ్రీవాణి గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. సోమవారం పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు.

హైడ్రాకు ఫిర్యాదు చేసిన మత్స్యకార సంఘం

బోడుప్పల్, న్యూస్‌టుడే: బోడుప్పల్ నగర పాలక సంస్థ అల్మాస్‌కుంటలో 25 గుంటల శ్మశాన వాటిక స్థలంలో సౌకర్యాల కల్పనకు రూ. 50 లక్షలు కేటాయిస్తూ తీర్మానం చేసిందని బోడుప్పల్ మత్స్యకార సంఘం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు.

దేవేందర్‌నగర్ శాఖ సీపీఎం కార్యదర్శిగా భీష్మాచారి

ఉప్పల్:ఉప్పల్ డివిజన్‌లోని దేవేందర్‌నగర్ శాఖ సీపీఎం కార్యదర్శిగా జి.భీష్మాచారి ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన మహాసభలో భీష్మాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టుగా పార్టీ ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె.వెంకన్న తెలిపారు. పౌరహక్కులపై అవగాహన

పౌర హక్కుల దినోత్సవం

కాప్రా, న్యూస్‌టుడే: కాప్రాలోని గాంధీనగర్ సామాజిక భవనంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కాప్రా డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణరావు, ఎస్ఐ వెంకన్నలు పౌరహక్కులు, విద్యా, వికాశం, సంక్షేమం, నేరాలు, వ్యసనాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, చట్టాలు, శిక్షలు తదితర అంశాలపై పౌరులకు అవగాహన కల్పించారు.

రోడ్లను తెరిపించాలని ఫిర్యాదు

మేడ్చల్ రూరల్: అత్వెల్లిలో రహదారులను మూసివేయడంతో 20 కి పైగా కాలనీలు, విద్యాసంస్థలకు రాకపోకలు తీవ్ర అంతరాయం కలుగుతుందని రాఘవేంద్ర నగర్ కాలనీవాసులు సోమవారం కలెక్టర్ కార్యాలయంతో పాటు మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్, న్యూస్‌టుడే:రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు భారీగా పెరిగాయన్నారు. సోమవారం ఉప్పల్ డివిజన్‌లోని ఉప్పల్‌హిల్స్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో పరమేశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు.

రెండు రోజుల్లో.. పూర్తి చేస్తాం...



భాస్కర ఎన్‌క్లేవ్‌లో తవ్విన రోడ్డు

నాగారం, న్యూస్‌టుడే : దమ్మాయిగూడ 12వ వార్డు భాస్కర ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డును రెండు రోజుల్లో వేస్తామని డీఈఈ చిరంజీవులు పేర్కొన్నారు. వర్షాలతో పనులు ఆలస్యం అయ్యాయని తెలిపారు. వరద కాలువ నిర్మాణం చేయాలని భాస్కర ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరుతున్నార న్నారు. అదనపు పనులకు అనుమతులు తీసుకోవాలని సూచించారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం

ఏఎస్‌రావునగర్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఆచార్య కోయ వెంకటేశ్వర్‌రావు సూచించారు. సోమవారం జన విజ్ఞాన వేదిక కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను గీతం జూనియర్ కళాశాలలో నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి పిట్టల నాగరాజు, మేడ్చల్ జిల్లా కోశాధికారి జెన్ని తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే విద్యార్థులకు మంచి భవిష్యత్తు



మాట్లాడుతున్న అనురాగ్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్

ఘట్‌కేసర్,న్యూస్‌టుడే: పోటీ ప్రపంచంలో కష్టపడి చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అనురాగ్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.ఉట్ల బాలాజీ పేర్కొన్నారు. సోమవారం విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్ని ప్రసంగించారు. విశ్వవిద్యాలయం డీన్ ముత్తారెడ్డి, కో ఆర్డినేటర్ జి.శేఖర్‌రెడ్డి, డా.విష్ణు మాట్లాడారు.

స్వచ్ఛ బోడుప్పల్‌కు ప్రయత్నిస్తాం..



ప్లకార్డులతో మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు

బోడుప్పల్, న్యూస్‌టుడే: బోడుప్పల్‌ను స్వచ్ఛ నగరంగా మార్చేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తామని నగర మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి, కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు, విద్యార్థులతో కలిసి బోడుప్పల్ నగర ప్రధాన వీధుల్లో ప్లకార్డులు చూపుతూ ప్రదర్శన నిర్వహించారు. సిబ్బందికి తడి,పొడి, హానికారక చెత్తను వేర్వేరుగా అందించాలన్నారు.

మున్సిపల్ కమిషనర్ పదవీవిరమణ

నాగారం: వివిధ హోదాల్లో 34ఏళ్ల పాటు పదవుల్లో కొనసాగిన నాగారం కమిషనర్ రాజేంద్ర కుమార్ సోమవారం పదవీ విరమణ చేశారు. ఛైర్మన్ కౌకుట్ల చంద్రా రెడ్డి, వైస్ ఛైర్మన్ బండారు మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, కార్యాలయ అధికారులు సత్కరించారు.

కారు డ్రైవర్ నిర్లక్ష్యం.. ద్విచక్రవాహనదారుడి దుర్మరణం

మేడ్చల్, న్యూస్‌టుడే: కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ ద్విచక్రవాహనదారుడు లారీ చక్రాల కింద పడి దుర్మరణం చెందాడు. మేడ్చల్ పోలీసుల వివరాల ప్రకారం..నగరంలోని లింగంపల్లికి చెందిన వెంకట్‌రెడ్డి(53) తన ద్విచక్రవాహనంపై రఘువర్ధన్, మరో వ్యక్తితో కలిసి సోమవారం రాత్రి మేడ్చల్ వెళ్లారు. పెట్రోలు పంపు ఎదురుగా నిలిపిన కారు డ్రైవర్ డోరు తెరిచాడు. అది వెంకట్‌రెడ్డి తగలడంతో కుడివైపు కిందపడిపోయారు. వెనక అతివేగంగా వచ్చిన లారీ ఆయన మీది నుంచి వెళ్లిపోయింది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు

ఉపముఖ్యమంత్రి ఇంట్లో చోరీ నిందితుల కోసం ప్రత్యేక బృందం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇంట్లో చోరీ ఘటనలో నిందితుల కోసం బంజారాహిల్స్ పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ రోడ్ 14లోని బీఎన్ రెడ్డి కాలనీలో ప్లాట్ నం.40 భట్టి వ్యక్తిగత నివాసం ఉంది. కాపలదారుగా ఉన్న రోషన్ మండల్.. ఇంట్లో అల్మారాలోని రూ.80వేలు, వెండి సామగ్రి దోచుకుని వెళ్లినట్లు భట్టి పీఏ భాస్కరశర్మ గురువారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రోషన్ మండల్, అతని స్నేహితుడు ఉదయ్ కుమార్‌ను ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో అక్కడి పోలీసులు అనుమానంతో పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.50 లక్షల నగదు, 100 గ్రాముల బంగారు బిస్కెట్, కొంత విదేశీ కరెన్సీ, వెండి పాత్రలు, ఆభరణాలను స్వాధీనం చేసుకుని వారిని కోర్టులో హాజరుపర్చారు. నిందితులను నగరానికి తీసుకొచ్చేందుకు బంజారాహిల్స్ పోలీసులు పశ్చిమ బెంగాల్ వెళ్లారు.

పిల్లలూ.. భోజనం బాగుందా?: కలెక్టర్



ఈనాడు, హైదరాబాద్: పిల్లలూ భోజనం బాగుందా? ఇక్కడి పరిసరాలు బాగున్నాయా? అంటూ రంగారెడ్డి కలెక్టర్ ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులను ప్రశ్నించారు. సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న ఆయన సోమవారం రాత్రి ఇబ్రహీంపట్నానికి వచ్చారు. గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పదోతరగతి పిల్లలతో మాట్లాడి.. ప్రతి ఒక్కరూ డిస్టింక్షన్‌లో పాసవ్వాలని సూచించారు. అక్కడే బసచేశారు.

మలి వయసా.. ఆరోగ్యంపైనే ధ్యాస



వీరంతా 60-70 ఏళ్ల మధ్య వయసున్న తల్లులు. నిత్యం ఉదయం 6 గంటలకల్లా వచ్చి ఇందిరాపార్కులో యోగా, ఇతర వ్యాయామాలు చేస్తుంటారు. అందుకే ఆరోగ్యంగా ఉన్నామంటున్నారు

కొత్త ఠాణాలు సరే..
సిబ్బంది ఏరీ..?



◆ మౌలిక వసతులు కరవు

◆ కేసులు పెరగడంతో రెట్టింపు పనిఒత్తిడి

◆ నగర ఠాణాల్లో ఏటా 20 వేలకు పైగా ఎఫ్ఐఆర్‌లు..2 లక్షల వరకు పెట్టీ కేసులు నమోదవుతున్నాయి.

◆ నగరంలోని 60 ఠాణాలకు అదనంగా 11 కొత్త పోలీస్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చాయి.

◆ ఏడు జోన్లలో మహిళా ఠాణాలు ఏర్పాటు చేశారు. సెల్ స్నాచింగ్‌లు, దోపిడీలు, ఇంటి చోరీలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల రవాణాపై నిత్యం 700కుపైగా ఫిర్యాదులు అందుతున్నాయి.

ఈనాడు, హైదరాబాద్: నగర పోలీసు కమిషనరేట్‌లో విధి నిర్వహణలో ఉండగానే కళ్లు తిరిగి పడిపోయిన కానిస్టేబుల్. ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి తరలిస్తుండగా కిందపడ్డారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌స్ట్రోక్‌తో మరణించినట్లు నిర్ధారించారు. బోనాల వేడుకల్లో బందోబస్తులో ఉన్న ఏసీపీ కూడా ఇదే సమస్యతో ఆసుపత్రిపాలయ్యారు. ఇద్దరు ఎస్సైలకు పోస్టింగ్‌లు ఇచ్చినా ఆ ఠాణాలో చేయడం మా వల్ల కాదంటూ సెలవుపై వెళ్లిపోయారు. 'మెగా సిటీ పోలీసింగ్'లో ఠాణాలు పెరిగినా సిబ్బంది పెరగలేదు.



సర్దుబాటుతో సరి..

పాత ఠాణాల్లో పనిచేస్తున్న ఎస్సైలు, కానిస్టేబుళ్లను కొత్త స్టేషన్లకు సర్దుబాటు చేశారు. ఇప్పటికీ కొన్ని ఠాణాల్లో మౌలిక సౌకర్యాలు పూర్తిగా లేవు. ఓ కొత్త ఠాణాలో ఏడాదిలో నలుగురు ఇన్‌స్పెక్టర్లు మారారు. మరో కొత్త ఠాణాకు నలుగురు ఎస్సైలు అవసరమంటే ఇద్దరితో సరిపెట్టారు. ఒక్క వాహనంతోనే ప్యాట్రోలింగ్ చేయాల్సి వస్తోందని, ఉన్నతాధికారుల వీసీకి మరో ఠాణాకు వెళ్లాల్సి వస్తోందంటున్నారు.

దర్యాప్తులపై ప్రభావం

పని ఒత్తిడి ప్రభావం కేసుల దర్యాప్తుపై పడుతోందని ఓ ఏసీపీ వివరించారు. కొన్నిసార్లు దర్యాప్తునకు సాక్ష్యాధారాలు సేకరించడంలో అధికారులు విఫలమై కోర్టుల్లో చీవాట్లు పడాల్సి వస్తోందని ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సిబ్బందిపై పనిభారం తగ్గించాలని కేసుల దర్యాప్తు, బందోబస్తు విధులను విభజించి వేర్వేరుగా సిబ్బందిని కేటాయించాలని గతంలో ప్రతిపాదన తెచ్చినా సిబ్బంది కొరతతో వాయిదా వేశారు.

అశ్లీలం చూస్తే కటకటాలే..!

◆ సాంకేతిక ఆధారాలతో నిందితుల ఆచూకీ కనిపెడుతున్న పోలీసులు

◆ హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు వరకు 520 పోక్సో కేసులు నమోదయ్యాయి. పోక్సో కేసుల్లో అరెస్టయ్యే నిందితుల్లో ఎక్కువ మందిపై అశ్లీల వీడియోల ప్రభావం ఉన్నట్లు వెల్లడవుతోంది.

◆ ఈ తరహా కేసుల్లో అభియోగాలు నిరూపితమైతే ఐదేళ్ల వరకూ శిక్ష పడే అవకాశముంది.

◆ అశ్లీల వీడియోలకు బానిసగా మారిన ఓ వ్యక్తి అందులో ఉన్నట్లుగా చేయాలని తన 13 ఏళ్ల కూతురిపై కన్నేశాడు. అతడి చేష్టలను బాలిక తిరస్కరించడం.. ఇంకా ఎవరికైనా చెబుతుందనే ఉద్దేశంతో బండరాయితో కొట్టి ఊపిరాడకుండా చేసి దారుణంగా హతమార్చాడు. సరిగా చదువుకోవడం లేదని మందలించినందుకు ఇంటి నుంచి వెళ్లిపోయిందని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసి అడ్డంగా దొరికిపోయాడు.



ఈనాడు, హైదరాబాద్: చిన్నారులతో చిత్రీకరించిన అశ్లీల వీడియోలు డౌన్‌లోడ్ చేసి చూసినా.. వ్యాప్తి చేసినా ఇక నుంచి కటకటాలు లెక్కించేందుకు సిద్ధంగా ఉండాల్సిందే. ఇది సుప్రీంకోర్టు తీర్పు. ఫోన్, కంప్యూటర్‌లో గుట్టుగా చూస్తే ఎవరూ గుర్తించలేరనుకోవద్దు. పోలీసులు సాంకేతిక ఆధారాలతో కనిపెడుతున్నారు. వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఇతరులకు పంపిస్తున్నట్లు వెలుగుచూస్తుండడంతో నియంత్రణపై రాచకొండ పోలీసులు దృష్టి సారించారు.

అమెరికా సమాచారంతో ఇక్కడ అరెస్టు

ఇక్కడి పోలీసులే కాదు.. విదేశీ దర్యాప్తు సంస్థలు కూడా మన దేశంలో చైల్డ్ పోర్నోగ్రఫీ వ్యాప్తి చేస్తున్న వారిపై దృష్టిసారిస్తున్నాయి. అమెరికాలోని హోంల్యాండ్ సెక్యూరిటీ ఇన్వెస్టిగేషన్స్ (హెచ్ఎస్ఐ), నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్స్ (ఎన్‌సీఎంఈసీ) తదితర సంస్థలు ఐపీ అడ్రస్‌లను కేంద్ర హోంశాఖకు అందిస్తున్నాయి. అలా వచ్చిన సమాచారంతో గత ఏడాది ఒక యువకుడిని రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు.

కఠినంగా వ్యవహరిస్తున్నాం

'చిన్నారులపై లైంగిక దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. చిన్నారుల అశ్లీల దృశ్యాలు చూసినా సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు పంపినా పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం ఐదేళ్ల జైలు శిక్ష పడుతుంది. చిన్నారులను మానవ మృగాల నుంచి కాపాడుకుని నేరరహిత సమాజంలో భాగస్వాములవుదాం' – సుధీర్‌బాబు, రాచకొండ పోలీస్ కమిషనర్

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు.. ధ్రువపత్రాలతో రండి

ఈనాడు, హైదరాబాద్ : డీఎస్సీ-2024కు 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులు వారి అసలు ధ్రువపత్రాలు, గెజిటెడ్ అధికారి సంతకంతో కూడిన రెండు సెట్ల నకలు పత్రాలతో తమవద్దకు రావాలని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల విద్యాశాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 1 నుంచి 5వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ధ్రువ పత్రాలను అధికారులు పరిశీలించనున్నారు. ఆయా జిల్లాల అభ్యర్థులు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్ నుంచి ఒక ఫారంను డౌన్‌లోడ్ చేసుకుని నింపి ధ్రువపత్రాలతో పాటు తీసుకురావాలని సూచించారు.

▪ **హైదరాబాద్ జిల్లా అభ్యర్థులు:** స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు గవర్నమెంట్ మోడల్ ఆలియా స్కూల్, ఎల్బీస్టేడియం ఎదురుగా, బషీర్‌బాగ్

ఎస్‌జీటీ అభ్యర్థులు.. మహబూబియా బాలికల ఉన్నత పాఠశాల, లేపాక్షి ఎదురుగా, బషీర్‌బాగ్

▪ **రంగారెడ్డి జిల్లా అభ్యర్థులు.. :** బహదూర్‌గూడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఎల్బీనగర్ మెట్రోరైల్ స్టేషన్ వద్ద.

▪ **మేడ్చల్ జిల్లా అభ్యర్థులు..:** జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలురు), మల్కాజిగిరి చౌరస్తా సమీపంలో.

హరికిరణ్‌కు ప్రథమ స్థానం



మిద్దే హరికిరణ్

దమ్మపేట, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని మొద్దులగూడేనికి చెందిన మిద్దే హరికిరణ్ ఫిజికల్ సైన్స్ ఆంగ్ల విభాగంలో డీఎస్సీలో హైదరాబాద్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. హరికిరణ్ తొలుత దమ్మపేట మండలంలో విద్యా వాలంటీర్‌గా పని చేశారు. అనంతరం 2019 నుంచి కొడంగల్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుత డీఎస్సీలో 77.83 మార్కులతో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రథమ ర్యాంకు పొందారు. హరికిరణ్ తండ్రి సాధారణ రైతు. తల్లి చెన్నమ్మ గృహిణి. హరికిరణ్‌ను మండలానికి చెందిన పలువురు అభినందించారు.

ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యువకుడి అరెస్ట్



నరేశ్‌గౌడ్

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యువకుడిని కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం చరికొండ గ్రామానికి చెందిన సిద్దమోని నరేశ్‌గౌడ్ హస్తినాపురం డీఆర్‌డీఎల్ కాలనీలో ఉంటున్నాడు. ఇంటీరియర్ డిజైనర్. అంతర్జాలంలో రేవంత్‌రెడ్డిపై చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను గమనించిన భారాస నాయకుడు, కంచన్‌బాగ్‌కు చెందిన న్యాయవాది అహ్మద్ అస్లం ఉల్లా షరీఫ్ ఫిర్యాదుతో నరేశ్‌గౌడ్‌ను అరెస్ట్ చేశారు. భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఠాణాకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు.

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు సత్వరం చెల్లించాలి



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో వేముల రామకృష్ణ, తదితరులు

రాంనగర్, న్యూస్‌టుడే: విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంటు బకాయిలను వారం రోజుల్లోగా చెల్లించాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, రాష్ట్ర బీసీ ఫ్రంట్ ఛైర్మన్ గొరిగె మల్లేశ్ యాదవ్‌ల ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్కు సమీపంలోని ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వం చొరవ చూపకుంటే మంత్రులు, ఎమ్మెల్యేలను బయట తిరగనీయకుండా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.





ప్రమాదకరం ఈ ప్రయాణం

ఆటో ట్రాలీలో కూరగాయలను పరిమితికి మించి వేసి వాటిపై ప్రమాదకరంగా కూర్చుని వెళ్తున్న చిరు వ్యాపారులు ట్యాంక్‌బండ్‌పై కనిపించారు. మరోవైపు అసెంబ్లీ వద్ద సరకు రవాణా వాహనంలో తాళ్లను పట్టుకుని మహిళలు వెళ్తున్నారిలా..

మహిళ గొంతు కోసి హత్య



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆర్ఎంపీ వైద్యుడి భార్యను గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి హతమార్చారు. జూబ్లీహిల్స్ పోలీసుల వివరాల ప్రకారం.. యూసఫ్‌గూడ నవోదయ కాలనీ ప్లాట్ 36లోని రెండో అంతస్తులో ఆర్ఎంపీ వైద్యుడు లక్ష్మీనారాయణ కుటుంబంతో నివసిస్తున్నాడు. భార్య **సుధారాణి(44)**, ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం సాయంత్రం పిల్లలిద్దరూ ట్యూషన్‌కి, లక్ష్మీనారాయణ ఎల్లారెడ్డిగూడలోని క్లినిక్‌కి వెళ్లాడు. ట్యూషన్ నుంచి పిల్లలిద్దరూ ఇంటికి వచ్చి తలుపు తీసి చూడగా తల్లి రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గమనించి తండ్రికి చెప్పగా లక్ష్మీనారాయణ ఇంటికి వచ్చి 100 ద్వారా పోలీసులకు సమాచారాన్ని అందించాడు. జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రెడ్డి, ఎస్సైలు సోమశేఖర్, వినోద్ కుమార్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే సుధా రాణి మృతి చెంది ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. జరిగిన సంఘటనపై పిల్లల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

గర్భిణిపై దాడి చేసిన నిందితుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: అక్రమంగా ఇంట్లోకి చొరబడి గర్భిణినిపై దాడి చేసి గాయపర్చిన నిందితుడికి న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.18,000 జరిమానా విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్ సమీపంలోని సిఖ్‌చావని ప్రాంతానికి చెందిన సర్దార్ శైలేందర్ సింగ్(36) సేల్స్‌మెన్‌గా పనిచేస్తాడు. 2020 సెప్టెంబరు 13 సాయంత్రం అదే కాలనీలో ఆటోలో కూర్చొని మద్యం తాగుతుండగా అక్కడ ఆడుకుంటున్న పిల్లల్లో ఒకరైన అనుదీప్‌సింగ్ విసిరిన చిన్న రాయి అతడికి తగిలింది. అదేరోజు రాత్రి శైలేందర్‌సింగ్.. ఆ బాలుడి ఇంట్లోకి ప్రవేశించి అతని తల్లి నిండు గర్భిణి అయిన జగ్‌దీశ్ కౌర్(28)పై దాడి చేసి గాయపర్చాడు.

ఆర్డినెన్స్ తీసుకొచ్చి జమిలి ఎన్నికలు నిర్వహించే కుట్ర



మాట్లాడుతున్న డా. కె.నారాయణ. చిత్రంలో బాలమల్లేశ్

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: భాజపా సంకీర్ణ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా ఆర్డినెన్స్ ద్వారా జమిలి ఎన్నికలను నిర్వహించే కుట్ర చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డా. కె.నారాయణ ఆరోపించారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'వన్ నేషన్, వన్ రేషన్, వన్ ఓట్, వన్ ఎలక్షన్' పేరుతో ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. మోదీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, బిహార్ సీఎం నితీష్ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. అభివృద్ధి పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాలకు సీపీఐ అభ్యంతరం చెప్పడం లేదని, అయితే అవి అందరికీ ఉపయోగపడేలా నిర్మించాలని, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. దీనిపై ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి లేఖ రాశామని తెలిపారు. హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిందేనని, మూసీ ప్రక్షాళన సైతం చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ముందుగా పేదలకు పునరావాసం కల్పించి, తర్వాతే ఖాళీ చేయించాలని సూచించారు. వికారాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఉన్న ఫిరంగి నాలాలపై ఆక్రమణలను తొలగించాలన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ ఉన్నారు.

మధ్యంతర బెయిలుకు నృత్య దర్శకుడు జానీ పిటిషన్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: అత్యాచారం, బెదిరింపులు, పోక్సో కేసులో అరెస్టై చంచల్‌గూడ జైలులో విచారణ ఖైదీగా ఉన్న నృత్య దర్శకుడు జానీ మధ్యంతర బెయిలు కోసం సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. గత వారం ఆయన దాఖలు చేసిన రెగ్యులర్ బెయిలు పిటిషన్ సోమవారం విచారణకు రాగా, రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో కోర్టు తదుపరి విచారణను అక్టోబరు 7వ తేదీకి వాయిదా వేసింది. దిల్లీలో ఉత్తమ నృత్య దర్శకుడి అవార్డును అందుకోవాల్సి ఉన్నందున, ఐదు రోజులు మధ్యంతర బెయిలు మంజూరు చేయాలని అభ్యర్థిస్తూ పిటిషన్ వేశాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కౌంటర్ దాఖలుకు వీలుగా విచారణను న్యాయమూర్తి నేటికి వాయిదా వేశారు.

వయసు 19.. చోరీలు 23
ద్విచక్రవాహనాల నిందితుడు, అతనికి సహకరించిన నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

యాచారం, న్యూస్‌టుడే: జల్సాల కోసం ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడిన యువకుడు చివరకు పోలీసులకు చిక్కి కటకటాలు లెక్కిస్తున్నాడు. 19ఏళ్ల వయసులోనే 23 బైక్‌లను చోరీ చేశాడు. యాచారం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి వివరాలు వెల్లడించారు. ఫార్మాసిటీ పోలీసులు సెప్టెంబరు 29న మేడిపల్లిలో వాహనాల తనిఖీ చేస్తుండగా తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన హర్షవర్ధన్(19) మోటర్‌సైకిల్‌పై అనుమానంగా వెళ్లడం గమనించి ప్రశ్నించారు. బైకులు చోరీలు చేస్తున్నట్లు తేలడంతో రూ.9 లక్షలు విలువ చేసే 23 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నందివనపర్తి గ్రామ వాసి రాజు(29), మహ్మద్ అమెర్ అలీ(22), మేడిపల్లి గ్రామ నివాసి భేత జంగయ్య(32), జాల నాగరాజు(24) ద్వారా గ్రామాల రైతులకు విక్రయించినట్లు చెప్పాడు. మహబూబ్‌నగర్, అఫ్జల్‌గంజ్, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, మంచాల, యాచారం, మేడిపల్లి ఫార్మాసిటీ పోలీసు స్టేషన్‌ల పరిధిలోని బస్టాండ్లు, హోటళ్ల వద్ద పార్కు చేసిన వాటిని చోరీ చేసేవాడు. హర్షవర్ధన్‌కు సహకరించిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ నర్సింహరావు, ఎస్సై తేజంరెడ్డి పాల్గొన్నారు.

విమానాశ్రయంలో మహిళ అదృశ్యం

శంషాబాద్, న్యూస్‌టుడే: గల్ఫ్ దేశం నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలు శంషాబాద్ విమానాశ్రయంలో అదృశ్యమైంది. ఆర్జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లికి చెందిన వివాహిత సౌదీ అరేబియా వెళ్లింది. ఈనెల 25న దమ్మామ్ నుంచి స్వదేశానికి బయల్దేరినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. ఆమెను ఇంటికి తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యులు విమానాశ్రయానికి వచ్చారు. కాగా విమానాశ్రయంలో దిగిన ఆమె కనిపించకుండా పోయింది. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మూసీ ప్రక్షాళనకు
కొత్త ఎస్టీపీలు!



మూసీ ప్రక్షాళన విషయంలో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే మూసీకి ఇరువైపులా హైదరాబాద్‌లో 1595, మేడ్చల్ మల్కాజిగిరి 239, రంగారెడ్డిలో 332 నిర్మాణాలు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్లు తేల్చారు. నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్లు కేటాయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒకవైపు ఆక్రమణల తొలగింపు.. మరోవైపు మురుగునీటిని శుద్ధి చేయడం కొనసాగించాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం అమృత స్కీంలో భాగంగా ప్రభుత్వంతోపాటు గుత్తేదారు భాగస్వామ్యం కింద హైబ్రిడ్ యాన్యునిటి పద్ధతి(హామ్)లో కొత్తగా 39 ఎస్టీపీలను నిర్మించనున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు వరకు మురుగు కలిసే మూసీతోపాటు చెరువులు, కుంటల వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ నెలాఖరులోపు టెండర్లు ఆహ్వానించేందుకు జలమండలి సిద్ధమవుతోంది. మొత్తం రూ.3849.10 కోట్లతో 972 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో 39 ప్రాంతాల్లో నిర్మించనున్నారు. కేంద్రం 40శాతం, గుత్తేదారు సంస్థ, జలమండలి కలిసి 60శాతం నిధులు వెచ్చిస్తాయి. భూసేకరణ ఇబ్బంది లేకుండా చిన్న చిన్న కేంద్రాలను ప్రభుత్వ భూముల్లో ఎక్కువ నిర్మించనున్నారు. ప్రస్తుతం గ్రేటర్‌వ్యాప్తంగా ఉన్న ఎస్టీపీల ద్వారా 750 మిలియన్ లీటర్ల మురుగును శుద్ధి చేస్తున్నారు. ఇవి కాకుండా 31 ఎస్టీపీలు సిద్ధమవుతున్నాయి.

-ఈనాడు, హైదరాబాద్

మియాపూర్‌లో వివాహిత దారుణ హత్య



స్పందన

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్‌లో ఓ వివాహితను పదునైన ఆయుధంతో ఆమె ఇంట్లోనే హత్య చేసిన ఘటన సంచలనం సృష్టించింది. ఏసీపీ నరసింహారావు, సీఐ దుర్గారామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... దీప్తిశ్రీనగర్ సీబీఆర్ ఎస్టేట్ 3ఏ బ్లాక్‌లో ఉండే ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు నమ్రుత కుమార్తె బండి స్పందన (29) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇంటర్ చదువుతున్న సమయంలోనే అదే కాలనీకి చెందిన వినయ్‌కుమార్‌ను ప్రేమించింది. 2022 ఆగస్టులో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. భర్త ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్. 2023లో భర్త తనను వేధిస్తున్నాడంటూ మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదైంది. విడాకుల కేసు కోర్టులో ఉంది.

విచక్షణారహితంగా పొడిచి... సోమవారం తల్లి తాను పనిచేస్తున్న పాఠశాలలో విధులకు వెళ్లగా స్పందన ఇంట్లో ఉంది. మధ్యాహ్నం సమీపంలో నివాసం ఉంటే సోదరి వచ్చి ఇంటి తలుపు తట్టినా తీయకపోవడంతో వెళ్లిపోయింది. సాయంత్రం పాఠశాల నుంచి తిరిగి వచ్చిన తల్లి కాలింగ్ బెల్ నొక్కినా, కుమార్తె సెల్‌ఫోన్‌కు కాల్ చేసినా స్పందించకపోవడంతో స్థానికుల సాయంతో తలుపు బద్దలు కొట్టి చూడగా అప్పటికే హత్యకు గురై ఉంది. పదునైన ఆయుధంతో విచక్షణారహితంగా పొడిచినట్లు కనిపిస్తున్నా.. అక్కడ ఎటువంటి ఆయుధం లభించలేదని పోలీసులు తెలిపారు. నిందితులు తెలిసినవారా అనే కోణంలో విచారిస్తున్నామని ఏసీపీ తెలిపారు. అపార్ట్‌మెంట్‌తోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీని సేకరిస్తున్నామన్నారు.

పోలీసుల అదుపులో మెదక్ పట్టణ ఉన్నతాధికారి

లాలాపేట, న్యూస్‌టుడే: మెదక్ పట్టణంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకర్ని ఓయూ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈయన కుటుంబంతో కలిసి వారాసిగూడలో ఉంటున్నారు. మరో మహిళను పెళ్లి చేసుకోవడంపై భార్య అతన్ని నిలదీసింది. ఇరువురి మధ్య గొడవ జరగడంతో మాట్లాడుకుందామని చెప్పి భార్యను బయటకు తీసుకెళ్లాడు. ఆందోళనకు గురైన ఆమె బంధువులు 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఓయూ పోలీసులు వారిని తార్నాకలో అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రాత పూర్వక ఫిర్యాదు ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

జల్సాలకు అలవాటుపడి.. చోరీలకు తెగబడి



వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ

సనత్‌నగర్, న్యూస్‌టుడే: జల్సాలకు అలవాటుపడి ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న ఇద్దరు పాత నేరస్థులతో పాటు ఓ బాలుడిని సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 9 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఏసీపీ హనుమంతరావు, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, నాగిరెడ్డితో కలిసి బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ ఠాణాలో వివరాలు వెల్లడించారు. ఎర్రగడ్డలో ఆదివారం తనిఖీలు చేస్తుండగా కూకట్‌పల్లి నుంచి వస్తున్న ముగ్గురు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వెంబడించి పట్టుకొని విచారించగా నేరం అంగీకరించారు. నిందితుల్లో మూసాపేట ప్రగతినగర్‌కు చెందిన ఎం.శివశంకర్(20), జనతానగర్‌కు చెందిన గోవింద(19)తోపాటు ఓ బాలుడు(17) ఉన్నారు. జగద్గిరిగుట్ట, గోల్కొండ, కూకట్‌పల్లి పోలీసు స్టేషన్లలో శివశంకర్‌పై ఆరు, గోవిందపై 4 కేసులున్నాయి. వీరు జైలుకు వెళ్లొచ్చినా పద్ధతి మార్చుకోలేదు. సనత్‌నగర్, బోరబండ, బాలానగర్, కూకట్‌పల్లి, చందానగర్, కేపీహెచ్‌బీ, మియాపూర్ పోలీసు స్టేషన్ల పరిధిలో మొత్తం 9 వాహనాలను చోరీ చేశారు. శివశంకర్ నుంచి 4, గోవింద నుంచి 4, బాలుడి నుంచి ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు, బాలుడిని జువైనల్ హోంకు తరలించారు.

దీర్ఘకాలిక సెలవులో నిజాంపేట కమిషనర్



సౌజన్య

నిజాంపేట, న్యూస్‌టుడే: నిజాంపేట నగర పాలక సంస్థ కమిషనర్ దేవులపల్లి సౌజన్య దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. జీహెచ్ఎంసీలో ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేసిన ఆమెను నెల క్రితమే ఇక్కడికి బదిలీ చేశారు. ఆగస్టు 30న బాధ్యతలు స్వీకరించిన ఆమె నెల రోజులకే దీర్ఘకాలిక సెలవు పెట్టడం చర్చనీయాంశమైంది. దీనికితోడు అధికార పార్టీకి చెందిన ఓ బడా నాయకుడు తాను చెప్పిందే జరగాలని పలుమార్లు ఒత్తిడి తేవడంతోనే ఆమె సెలవుపై వెళ్లడానికి కారణమని తెలుస్తోంది.

కలెక్టరేట్ వద్ద మూసీ నిర్వాసితుల నిరసన

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను కూల్చే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మూసీ నిర్వాసితుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని అధికం చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో బాధితులతో కలిసి సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున నిరసన ప్రదర్శించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారికి వినతిపత్రం సమర్పించారు. సొంత ఊరిలో పొలాలు అమ్ముకొని, బంగారం విక్రయించి, రుణాలు పొంది ఇళ్లను కట్టుకున్నామని, వీటిని కూలిస్తే జీవనోపాధి కోల్పోవడంతోపాటు అప్పులపాలవుతామని.. తమ జీవితాలు ఆగమ్యగోచరంగా మారతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్లక్ష్యంతోనే ప్రమాదం.. పరిహారం చెల్లించాల్సిందే

ఈనాడు, హైదరాబాద్: బస్సు బాడీ నిర్మాణం సందర్భంగా జరిగిన ప్రమాదంలో మంటలు చెలరేగి గాయపడిన డ్రైవరు ఎ.పద్మయ్య, ప్రమాద నష్టంపై వాహన యజమాని కె.తిరుపతిరెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. హైదరాబాద్‌కు చెందిన వీరి పిటిషన్‌ను విచారించిన కమిషన్. గాయపడిన డ్రైవరుకు అయిన వైద్య ఖర్చులకు 1.07 లక్షలు, మానసిక వేదనకు గురైనందుకు పరిహారంగా రూ.5 లక్షలు, ఏడాదిపాటు కోల్పోయిన ఆదాయం రూ.2.5 లక్షలు, కోర్టు ఖర్చుల కింద రూ.10 వేలు చెల్లించాలని ఆదేశించింది. జిల్లా కమిషన్ తీర్పును సవాలు చేస్తూ ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీలు దాఖలు చేసింది. దీనిపై ఇన్‌ఛార్జి అధ్యక్షురాలు మీనా రామనాథం, సభ్యులు వి.వి.శేషుబాబుతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. బస్సు బాడీ నిర్మాణంలో భాగంగా దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, అయితే ఆ ప్రాంతంలోకి నిర్వాహకులు ఇతరులను అనుమతించకూడదన్నారు. డ్రైవరును అనుమతించడంతో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో గాయపడ్డారని, అందువల్ల పరిహారం చెల్లించాల్సిందేనని తీర్పు వెలువరించింది. అయితే వైద్య ఖర్చులకు అయిన రూ.1.06 లక్షలు, పరిహారంగా రూ.లక్ష, ఏడాదిపాటు కోల్పోయిన ఆదాయం రూ.1.80 లక్షలు, కోర్టు ఖర్చుల కింద రూ.10 వేలు, ప్రమాదం జరిగిన తేదీ నుంచి 8 శాతం వడ్డీతో డ్రైవరుకు చెల్లించాలని ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఆదేశించింది.

చికెన్ ధరలు		
ఫాంరేటు 110-00		డ్రెస్డ్ 191-00
రిటైల్ 132-00		స్కిన్‌లెస్ 218-00

అక్కపై తమ్ముడి లైంగిక దాడి

ఉప్పల్, న్యూస్‌టుడే: తల్లి కాలం చేసింది. తండ్రి మద్యానికి బానిసయ్యాడు. దీంతో అన్నీ తానై తమ్ముడిని ఇంటర్ చదివిస్తోంది ఓ యువతి. తల్లిలేని లోటును తీరుస్తూ తండ్రి బాధ్యతలను సైతం తానే భరిస్తూ కుటుంబ భారాన్ని మోస్తోంది. సభ్య సమాజం తల దించుకునేలా తల్లిలాంటి అక్క మీదనే సొంత తమ్ముడు కన్నేశాడు. ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో అక్క మీద తమ్ముడు లైంగికదాడి చేసిన ఘటన ఆలస్యంగా ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్ పరిసరాల్లో ఉండే ఓ కాలనీకి చెందిన ఓ యువతి(19) ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. యువతి తమ్ముడు(17) ఇంటర్ చదువుతున్నాడు. గత నెల 27న(సెప్టెంబరు) ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న యువతిపై ఆమె తమ్ముడు లైంగిక దాడి చేశాడు. యువతి తండ్రికి చెప్పినా పట్టనట్టుగా వ్యవహరించాడు. దీంతో ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బీఎస్ఎన్ఎల్ 'సర్వత్ర' పేరుతో ఎఫ్‌టీటీహెచ్ సేవలు



బెలూన్ ఎగుర వేస్తున్న జి.రత్నకుమార్, చంద్రశేఖర్ తదితరులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మూడు రోజుల్లో రాష్ట్రంలో ఎఫ్‌టీటీహెచ్ రోమింగ్ వైఫై సేవలను 'సర్వత్ర' పేరుతో ప్రారంభించనుందని సంస్థ తెలంగాణ సీజీఎం జి.రత్నకుమార్ తెలిపారు. బీఎస్ఎన్ఎల్ రజతోత్సవాలను సోమవారం సాయంత్రం లక్డీకాపూల్‌లోని టెలిఫోన్ భవన్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ల్యాండ్‌లైన్ కాన్సెప్ట్‌తో వచ్చే ఎఫ్‌టీటీహెచ్ సేవలను పొందిన వినియోగదారుడు రోమింగ్ సదుపాయంతో అదే సేవలను మరోచోట యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో వినియోగించుకోవచ్చన్నారు. బీఎస్ఎన్ఎల్ హైదరాబాద్ పీజీఎం ఎం.చంద్రశేఖర్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.





బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవానికి సోమవారం విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కళాకారుల జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అష్టలక్ష్మి రంగోళి, నాగాలాండ్ కోయిర్ నృత్యం సందర్శకులను మంత్రముగ్ధులను చేసింది. –న్యూస్‌టుడే, బొల్లారం

ఎగ్జిబిషన్ మైదానంలో గర్బా, దాండియా 6 నుంచి



గోడ పత్రాలను ఆవిష్కరించిన గోవింద్‌రాఠీ, నిరంజన్, సురేందర్ రెడ్డి, చిత్రంలో డి.మోహన్, రంగారెడ్డి, గిరిధారిలాల్ డాగా

గోషామహల్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అక్టోబరు 6 నుంచి 10వ తేదీ వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం పెండాల్‌లో గర్బా, దాండియా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రామాయాణ్ మేళా చీఫ్ కన్వీనరు గోవింద్‌రాఠీ తెలిపారు. సోమవారం ఎగ్జిబిషన్ సొసైటీ కార్యాలయంలో గోడ పత్రాలు ఆవిష్కరించారు. గోవింద్‌రాఠీ మాట్లాడుతూ.. అయిదు రోజుల పాటు రాత్రి 8 గంటల నుంచి 12 వరకు జరిగే ఈ కార్యక్రమంలో ముంబయి నుంచి ప్రత్యేక కళాకారుల బృందం విచ్చేస్తున్నట్లు తెలిపారు. విజేతలకు దసరా రోజున బహుమతులు అందజేస్తామన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి. మోహన్, ఎకనామిక్ కమిటీ కార్యదర్శి జీవీ రంగారెడ్డి, ఉత్సవ నిర్వాహకులు గిరిధారిలాల్ డాగా, మనోజ్ జైస్వాల్, సుమిత్‌రాఠీ పాల్గొన్నారు.


గుర్రం జాషువా యాదిలో...



మాట్లాడుతున్న ఇనాక్. చిత్రంలో భవానీ ప్రసాద్, కళా జనార్దనమూర్తి తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జాషువా రచనలు సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. సోమవారం త్యాగరాయ గానసభ నిర్వాహకులతో 'గుర్రం జాషువా యాది..' లో శీర్షికతో గుండవరపు హనుమంతరావు హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాషువా రాసిన కవితల్లో ప్రధానంగా దళితుల ఆవేదన ప్రతిధ్వనిస్తుందన్నారు. ఆయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు జల్లి విద్యాధరరావు, కొయి కోటేశ్వరరావు, సుధాకర్, భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమించడంలో ఆవిష్కరణలు కీలకం



పుస్తకావిష్కరణలో అతిథులు

దుండిగల్, న్యూస్‌టుడే: సవాళ్లను అధిగమించడంలో ఆవిష్కరణలు కీలకమని దన్‌బాద్ ఐఐటీ డైరెక్టర్ సుకుమార్ మిశ్రా అన్నారు. మహీంద్రా వర్సిటీలో సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలపై నిర్వహించిన ద్వితీయ అంతర్జాతీయ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే అభివృద్ధి రేపటి భవిష్యత్తుకు దారి చూపుతుందన్నారు.

నగరంలో ఈనాడు

● గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఉ. 11గంటలకు కేంద్రీయ విశ్వవిద్యాలయం 24వ స్నాతకోత్సవం.. ముఖ్యఅతిథి టి.జి. సీతారాం ● ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని హయత్ గచ్చిబౌలిలో ఉ. 11గంటలకు 'తెలంగాణ మహిళా ఔత్సాహిక పారిశ్రామిక సదస్సు' ముఖ్య అతిథి నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం. ●రవీంద్ర భారతిలో ఉ. 9గంటలకు అంతర్జాతీయ వయోధిక దినోత్సవం. ముఖ్య అతిథి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి సీతక్క ● తార్నాకలోని మర్రి కృష్ణ హాల్‌లో ఉదయం 9.30గంటలకు అంతర్జాతీయ వయోధికుల దినోత్సవం. ● సికింద్రాబాద్‌లోని పాత కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిలో ఉదయం 9.30గంటలకు తొలి టెలిమెడిసిన్ కేంద్రం ప్రారంభం.

పరాన్నజీవుల కణాంతరాలపై పరిశోధన



● అంటువ్యాధుల నియంత్రణకు 'ఐ- పెరల్'

● బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్ జీవశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ నితీష్ గుప్తా

వ్యాధుల నియంత్రణకు పరిశోధనలు నిర్వహిస్తున్నా.. కొత్త మందులను తయారు చేస్తున్నా.. గ్రామాల్లో జ్వరం.. జలుబు.. దగ్గు వంటి సాధారణ జబ్బులు తొందరగా తగ్గడం లేదు. అంటురోగాలు వ్యాప్తి చేసే ఈగలు, దోమలు, అపరిశుభ్రత కారణంగా రోగాలు పెరుగుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు అంటురోగాలు వ్యాప్తిచేసే పరాన్నజీవుల కణాంతరాలపై పరిశోధనలు పెరుగుతున్నా" యని బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్ జీవశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ నితీష్ గుప్తా అన్నారు. బయోసైన్సెస్ రంగంలో వస్తున్న మార్పులు.. పరిశోధనలపై 'ఈనాడు'తో తో మాట్లాడారు.

? వైద్యరంగంలో అధునాతన చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తున్నా... గ్రామీణ ప్రాంతాల్లో జబ్బులు ఎందుకు తగ్గడం లేదు?

● గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా వైద్య సేవలు పూర్తిగా అందుబాటులోకి రాకపోవడం వల్లే జబ్బులు తగ్గడం లేదు. పారిశుద్ధ్యలోపం కారణంగా జంతువులు, కీటకాల నుంచి మనుషులకు జబ్బులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. మలేరియా, డెంగీ జ్వరాలు పెరిగేందుకు కారణాలివే. వైద్యసేవల కన్నా ముందుగా అక్కడ ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి.

? పరాన్నజీవుల కణాంతరాల పరిశోధన ఏ మేరకు ఫలితాలు ఇవ్వొచ్చు?

● పరాన్నజీవులు, దోమల ద్వారా చిన్నారులు, వృద్ధులు, మహిళలకు వస్తున్న జబ్బులను నియంత్రించేందుకు గణనీయ ప్రభావం చూపనుంది. వ్యాధికారక క్రిములు, జబ్బులను తగ్గించే మందులపై ఏకకణజీవుల తిరుగుబాటుపై పరిశోధనలు నిర్వహిస్తున్నాం.

? డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఈ తరహా ప్రయోగశాలలు నెలకొల్పితే విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందా?

● డిగ్రీ కళాశాలలు, వర్సిటీల్లో ఐ-పెరల్ స్థాయిలో కాకపోయినా లైఫ్ సైన్సెస్‌లో వస్తున్న మార్పులు, భవిష్యత్ పరిశోధనలపై అవగాహన పెంచుకునేందుకు ప్రయోగశాలలుండాలి. భవిష్యత్తులో పరిశోధనలతో పాటు వాణిజ్యపరంగా అవకాశాలు పెరగనున్నాయి.

? పరాన్నజీవుల కణాంతర పరిశోధనలతో యువత, కార్పొరేట్ సంస్థలకు ఏకకాలంలో ప్రయోజనాలు లభిస్తాయా?

● పరాన్నజీవుల కణాంతర పరిశోధనలు నైతిక ప్రమాణాలతో కూడిన ఒక ప్రత్యేక లక్ష్యం. లైఫ్ సైన్సెస్‌పై ఆసక్తి, అభిరుచి ఉన్న యువ పరిశోధకులు ఈ ప్రయోగశాలల్లో చేరవచ్చు. వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా వారు అంకుర సంస్థలను స్థాపించేందుకు అవకాశాలున్నాయి.

? ప్రపంచ బయోసైన్స్ పరిశోధనల్లో ఐ-పెరల్ ప్రాధాన్యం ఏమిటి?

● అంతర్జాతీయ స్థాయిలో వినూత్న పరిశోధనల నిర్వహణ. విదేశీ విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం, కొత్త శాస్త్రీయ ప్రమాణాలను పరిచయం చేయడం, యాంటీ మైక్రోబియాల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) ప్రభావాన్ని కృత్రిమ మేధతో కూడిన పరిశోధనల ద్వారా తగ్గించడం, తక్కువ ఖర్చుతో పరిశోధనలు నిర్వహించడం ద్వారా ఐ-పెరల్ ప్రాముఖ్యత పెరిగేలా కార్యాచరణ రూపొందించాం.

ఈనాడు, హైదరాబాద్

దివ్యాంగులు.. సమస్యల సాధనకు అడుగులు



సరకు రవాణా ఆటోలో ఉన్న వీరంతా దివ్యాంగులు.. సమస్యల గురించి అధికారులకు విన్నవించేందుకు సోమవారం కొంగర కలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. కర్రల సాయంతో నడవగలిగిన వారు కలెక్టరేట్‌లోకి వెళ్లగా.. ఆటో దిగలేని వారు అందులోనే వేచి ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా సంక్షేమ అధికారిని కలిసి సమస్యలు విన్నవించారు.

మరిచిపోలేని గురువు.. మరపురాని వీడ్కోలు



మనోరమ దంపతులకు విద్యార్థుల స్వాగతం

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల(ఓల్డ్) బయోసైన్స్ ఉపాధ్యాయిని సీతాఫల్ మనోరమ ఉద్యోగ విరమణ పొందారు. 31 ఏళ్ల పాటు బోధనా వృత్తిలో ఉన్న ఆమె ఎంతోమంది విద్యార్థుల అభిమానాన్ని పొందారు. సోమవారం ఆమె ఉద్యోగ విరమణ పొందుతున్నారని తెలిసి 2009 నుంచి 2024 వరకు ఆమె వద్ద చదువుకున్న విద్యార్థులు అలాయిబలాయి జట్టుగా ఏర్పడి ఆదివారం పాఠశాలలో ఘనంగా వీడ్కోలు పలికారు. సనత్‌నగర్ బస్టాండ్ నుంచి మేళతాళాలు, కోలాట నృత్యాలతో పూల వర్షం కురిపిస్తూ ఆరులో మేటరు దంపతులను ఊరేగింపుగా పాఠశాల వరకు స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ప్రత్యేక రథంలో దంపతుల వెంట నడుస్తూ వీడ్కోలు పలకడం గమనార్హం.

క్యాన్సర్‌పై అవగాహన.. 'పింక్' సిటీగా భాగ్యనగరం



ఈనాడు, హైదరాబాద్: కిమ్స్-ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘురాం ఆధ్వర్యంలో సోమవారం 'పెయింట్ ది సిటీ పింక్ క్యాంపెయిన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అక్టోబరు నెల ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన దినం పురస్కరించుకొని భాగ్యనగరంలోని చారిత్రక కట్టడాలు, ఇతర ప్రముఖ భవనాలను గులాబీ రంగు అలుముకున్నాయి. చార్మినార్, బుద్ధ విగ్రహం, జీహెచ్ఎంసీ, దుర్గంచెరువు కేబుల్ వంతెన, కిమ్స్ ఉష పత్రి ఇలా పలు కట్టడాలు గులాబీ రంగు విద్యుత్తు దీపాలతో తీర్చిదిద్దారు.

అమీన్‌పూర్‌లో కళాశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: అమీన్‌పూర్ పట్టణ పరిధిలో ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో చదువుతున్న అమ్మాయిలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఆకతాయిలు ముసుగులు వేసుకుని వచ్చి అమ్మాయిలను కొడుతున్నారని వారు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఒక అమ్మాయికి దెబ్బలు తగిలి వసతి గృహంలో విశ్రాంతి తీసుకొంటోందని వివరించారు. దసరా సెలవులు ప్రకటించి పిల్లలను ఇంటికి పంపించాలని కోరారు. యాజమాన్యం అంగీకరించడంతో విద్యార్థినులను ఇళ్లకు తీసుకెళ్లారు.

యువ పరిశోధకుల అంకుర సంస్థకు టీస్పార్క్ నిధులు



ప్రభాకర్



నరేంద్రకుమార్

లాలాపేట, నెల్లికుదురు - న్యూస్‌టుడే: మిరప పంటను ఆశిస్తున్న నల్లతామర తెగులు నివారణకు పరిశోధనలు చేసి సేంద్రియ ఆధారిత మందులు తయారుచేసిన యువ పరిశోధకులను తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ అందించే రూ. 5 లక్షల టీ-స్పార్క్ గ్రాంట్ వరించింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి యువకుడు గాజుల ప్రభాకర్, డోర్నకల్ యువకుడు నరేంద్రకుమార్ . ఓయూలో ఎంఎస్సీ పీహెచ్‌డీ పూర్తిచేసి శ్రీజీపీఎవెన్ లైఫ్ సైన్సెస్ అనే స్టార్టప్ సంస్థను స్థాపించారు. పంటలపై ఆశించే పురుగు, తెగుళ్ల నివారణకు పరిశోధనలు చేస్తున్నారు. హైదరాబాద్ ఐకేపీ నాలెడ్జ్ పార్క్ సహాయంతో త్రిప్ క్లియర్ అనే సేంద్రియ ఆధారిత పురుగు మందు రూపొందించారు. టీ-స్పార్క్ వారు పలుమార్లు పరిశీలించి గ్రాంట్‌కు తమ సంస్థను ఎంపిక చేశారని ప్రభాకర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

సొంతూళ్లకు వెళ్తున్నారా.. దొంగలతో జాగ్రత్త

ఈనాడు, హైదరాబాద్



దసరా పండుగ సెలవులు మొదలవుతున్నాయి. ఇంటిల్లిపాదీ నగరం నుంచి సొంతూళ్లకు ప్రయాణమవుతుంటారు. దొంగలు మాత్రం ఇలాంటి సమయం కోసమే కాచుకుని కూర్చుంటారు. తాళం వేసిన ఇళ్లు కనిపిస్తే గుల్ల చేస్తారు. ఏటా దసరా, సంక్రాంతి సమయాల్లోనే చోరీలు అధికంగా నమోదవుతుంటాయి. ఈ నేపథ్యంలోనే సైబరాబాద్ పోలీసులు దొంగతనాల నివారణకు పలు జాగ్రత్తలు సూచిస్తున్నారు. కచ్చితంగా పాటిస్తే చోరీలు తగ్గుతాయని పేర్కొంటున్నారు. సూచనలివీ..

● ఊరెళ్లినప్పుడు విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదు ఇంట్లో ఉంచొద్దు. వెంట తీసుకెళ్లడం లేదా బ్యాంకు లాకర్లలో భద్రపరచడం చేయాలి. ఇంట్లో అయితే రహస్య ప్రదేశంలో దాచాలి. ● ఇంటికి సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్ లేదా సెంట్రల్ లాక్ సిస్టమ్ అమర్చుకోవాలి. ఇంట్లో లేనప్పుడు పాలప్యాకెట్లు, పత్రికలు తలుపు ముందు జమవ్వకుండా చూడాలి. ఇంటి బయట, లోపల కొన్ని లైట్లు ఆన్‌లో ఉంచాలి.

● వాహనాలను కచ్చితంగా ఇంటి ఆవరణలో పార్కింగ్ చేయాలి. ద్విచక్ర వాహనాల చక్రాలకు ప్రత్యేక తాళం వేయాలి. ● బీరువా, లాకర్ తాళాలు రహస్య ప్రదేశంలో దాచాలి. ఇంట్లో సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్ ద్వారా పర్యవేక్షిస్తూ ఉండాలి.

● ఊరు, విహార యాత్రలకు వెళ్లే విషయం సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దు.

● కాలనీ సంఘాలు, అపార్టుమెంట్లలో కచ్చితంగా భద్రతా సిబ్బందిని నియమించుకోవాలి.

● కాలనీల్లో స్వచ్ఛంద కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. ఎప్పటికప్పుడు పోలీసులకు అందుబాటులో ఉంటూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులకు సమాచారమివ్వాలి.

● చోరీలకు ముందు దొంగలు కచ్చితంగా రెక్కీ చేస్తుంటారు. పగటిపూట వేర్వేరు కారణాలతో వచ్చి కాలనీల్లో రెక్కీ చేసి రాత్రి దొంగిలిస్తుంటారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారమివ్వాలి.

● కాలనీల్లో దొంగతనాలు అరికట్టేందుకు డయల్ 100 లేదా స్థానిక పోలీసుస్టేషన్ నెంబరుకు సమాచారం ఇవ్వాలి.

'సంపన్నులకే రూ.లక్షల కోట్ల బడ్జెట్'



కోల్సే పాటిల్



ప్రదర్శనగా వెళ్తున్న విద్యార్థులు

లాలాపేట, న్యూస్‌టుడే: దేశంలో రూ.లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రజలకు కాకుండా సంపన్నులకే పంచుతున్నారని ముంబై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కోల్సే పాటిల్ అన్నారు. ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) స్వర్ణోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. పాలకులు అవినీతి, కుల, మతాలతో దేశాన్ని ధ్వంసం చేశారని తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ దేశంలో సామాన్య ప్రజానీకానికి విద్య అందకుండా చేస్తున్నారన్నారు. అనంతరం 'సమరశీల స్ఫూర్తి పీడీఎస్‌యూ' అనే పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ(ఎం.ఎల్) రాష్ట్ర కార్యదర్శి రంగారావు, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, పిడిఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ పాల్గొన్నారు.



సంప్రదాయ వస్త్ర ధారణతో ఫ్యాషన్ షో

వేడుకగా మిస్ అండ్ మిసెస్ పోటీలు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: సంప్రదాయ వస్త్ర ధారణతో మిస్ అండ్ మిసెస్ ఇండియా ఐకానిక్ దివా 2024 పోటీలు సోమవారం రాత్రి సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో సందడిగా సాగాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ షో ఆకట్టుకుంది.

మూసీ నిర్వాసితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న రాజేందర్‌పటేల్‌గౌడ్

గోల్నాక, న్యూస్‌టుడే: మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ కోరారు. నగరానికి సమీపంలోనే పునరావాసాన్ని కల్పించి ఉపాధికి ఇబ్బంది లేకుండా చూడాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. సోమవారం నింబోలిఅడ్డాలో సమావేశంలో.. నల్లెల్ల కిషోర్, భూషణ్ భాస్కర్, డా.ప్రశాంత్ నిమ్‌కర్, ప్రదీప్‌గౌడ్, అనిల్‌లతో కలిసి మాట్లాడారు.

శరన్నవరాత్రి వేడుకలకు పెద్దమ్మతల్లి ఆలయం ముస్తాబు



ఎల్ఈడీ తెరపై అమ్మవారు

నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి అలంకరణ.. చీరలు

తేది	అలంకారం	చీర రంగు
03	బాలత్రిపుర సుందరీదేవి	పసుపు
04	గజలక్ష్మీదేవి	గులాబి
05	అన్నపూర్ణాదేవి	క్రీమ్
06	గాయత్రిదేవి	ఆరెంజ్
07	లలితాదేవి	కనకాంబరం
08	రాజరాజేశ్వరదేవి	ఆకుపచ్చ
09	సరస్వతిదేవి	తెలుపు
10	దుర్గాదేవి	ఎరుపు
11	మహిషాసుర మర్ధినీదేవి	ముదురు ఎరుపు
12	పెద్దమ్మతల్లి	గంధం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి దేవాలయం ముస్తాబు అవుతుంది. ఈ నెల 3 నుంచి 12వ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి వివరించారు.

ఆదాయంలో 7వ స్థానం: పెద్దమ్మతల్లి దేవాలయం నికర ఆదాయంలో ఏడో స్థానంలో ఉంది. మూడేళ్ల కిందట నికర ఆదాయం ఏడాదికి రూ. 7.50 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.13 కోట్లకు చేరింది. నెలకు ఆలయ ఆదాయం రూ. 50-60లక్షలు వస్తోంది. మంగళ, శుక్ర, శనివారాల్లో రోజుకు 600 మందికి మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నారు.

వారస్ చెస్ టోర్నీ రేపు

ఈనాడు, హైదరాబాద్: వారస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న ఓపెన్ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నీ ప్రైజ్‌మనీ రూ.లక్ష. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే అంతర్జాతీయ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామని నిర్వాహకులు వెల్లడించారు. సమాచారం కోసం 73968 47937లో సంప్రదించాలి. లేదా వారస్‌చెస్ అకాడమీ వెబ్‌సైట్లో పేర్లు నమోదు చేసుకోవాలి.

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



నాగోలు, న్యూస్‌టుడే: సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రేషన్ రిజిస్టర్ పోర్టల్‌ను ఉపయోగించి చోరీకి గురైన 90 సెల్‌ఫోన్ల ఆచూకీని ఎల్బీనగర్ క్రైమ్ పోలీసులు కనిపెట్టారు. ఆయా ఫోన్లను సోమవారం ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలో సంబంధిత యజమానులకు అందజేశారు. ఈసందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ.. నగరంలో చోరీకి గురైన ఫోన్లు కేరళ, తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌లో వినియోగిస్తున్నట్లు గుర్తించి, నగరానికి తెప్పించామన్నారు. ఆయా సెల్‌ఫోన్ల ఆచూకీని కనిపెట్టేందుకు తమ టెక్నికల్ విభాగం ఎంతో కృషి చేసిందన్నారు. ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, డీఎస్సై నరేందర్ పాల్గొన్నారు.

పేద యువతుల వివాహాలకు ప్రభుత్వం భరోసా

సైదాబాద్, న్యూస్‌టుడే: మలక్‌పేట నియోజకవర్గంలోని నిరుపేద యువతుల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. మజ్లిస్ కృషి వల్ల అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. చార్మినార్ పంజేషాలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ పరిధిలోని ఆయా డివిజన్లకు చెందిన 20 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

సంక్షిప్త సమాచారం

సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి

ఎల్బీనగర్: ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో డీసీ తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఉ.10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు అధికారులు పాల్గొన్నారు. ఒక దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు.

కార్మికులకు చెత్త సేకరణ రిక్షాలు

నాగోలు, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులకు చెత్త సేకరించే రిక్షాలను పంపిణీ చేశారు. కొత్తపేట డివిజన్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉప కమిషనర్ సుజాత, కార్పొరేటర్ పవన్‌కుమార్, డీఈ చందన, బుచ్చయ్య పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

అక్బర్‌బాగ్: ఆస్తిపన్ను వసూళ్లపై మలక్‌పేట అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. భవనాలపై అదనపు పైఅంతస్తులు నిర్మించిన యజమానులకు నోటీసులు అందజేస్తున్నారు. సర్కిల్‌లో 12,317 అదనపు అంతస్తులు గుర్తించినట్లు ఉపకమిషనర్ జయంత్ తెలిపారు. 4,774 ఇళ్లకు నోటీసులు జారీ చేశామని, మిగతావారికి త్వరలో అందజేస్తామని తెలిపారు.

సహకార సంఘం సర్వసభ్య సమావేశం

హయత్‌నగర్: తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సంఘం ఛైర్మన్ చామ కృష్ణారెడ్డి సూచించారు. హయత్‌నగర్‌లో సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం సీఈవో మల్లికార్జున్ 2023-2024వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించగా, సభ్యులు ఆమోదించారు.

మలక్‌పేట టీపీఎస్ సునీత బదిలీ

సైదాబాద్: బల్దియా మలక్‌పేట సర్కిల్ పట్టణ ప్రణాళిక సూపర్‌వైజర్ (టీపీఎస్)గా విధులు నిర్వహిస్తున్న సునీత బదిలీ అయ్యారు. ఖైరతాబాద్ సర్కిల్ కార్యాలయానికి ఆమె బదిలీ కాగా, అక్కడి నుంచి నర్సింగ్‌ను ఇక్కడ నియమించినట్లు అధికారులు తెలిపారు.

మెట్రోను హయత్‌నగర్‌కు విస్తరించాలి

ఎల్బీనగర్: నాగోల్ నుంచి ఎల్బీనగర్‌కు మెట్రోను విస్తరించడంతో పాటు హయత్‌నగర్ వరకు పొడిగించాలని ఎల్బీనగర్ భారాస నేతలు కోరారు. మామిడి రామచందర్ ఆధ్వర్యంలో సోమవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేతలు రవి, కృష్ణ, శ్రీకాంత్, ప్రవీణ్, సాంబయ్య పాల్గొన్నారు.

నాలా నిర్మాణ పనుల పరిశీలన

ఎల్బీనగర్: ప్రజలకు ఇబ్బందులు లేకుండా బాక్స్‌నాలా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. సహారా ఎస్టేట్స్ వెనక, ఆటోనగర్ రోడ్డు నుంచి చేపట్టిన బాక్స్ నాలా నిర్మాణ పనులను సోమవారం ఆయన హిమపురి కాలనీ ఫేజ్-2 వద్ద పరిశీలించారు. ఏఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, సయ్యద్ జానీ, గఫర్, అక్తర్ పాల్గొన్నారు.

కేవైసీ నమోదుకు మరో అవకాశం

డిసెంబరు 31 వరకు గడువు పొడిగింపు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: పేదలకు అందాల్సిన చౌకధరల దుకాణాల బియ్యం అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు.. అనర్హులకు బియ్యం అందకుండా చూసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడూ తగిన చర్యలు చేపడుతున్నాయి. అందులో భాగంగానే రేషన్ కార్డులకు 'ఈ-కేవైసీ' (ఎలక్ట్రానిక్-నో యువర్ కస్టమర్)ని తప్పనిసరి చేసింది. రేషన్ లబ్ధిదారులంతా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం గతంలోనే పలుమార్లు తుది గడువులు పెట్టింది. అయినా ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో నేటికీ 40 శాతం మంది ఈ ప్రక్రియకు దూరంగా ఉన్నారు. అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో తాజాగా ప్రభుత్వం మరోమారు గడువు పొడిగించింది. ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గడువు పెంచింది. డిసెంబరు నెలాఖరు తర్వాత మరో అవకాశం ఉండదని, లబ్ధిదారులంతా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది.



కారణాలనేకం..

లబ్ధిదారులు నిర్లక్ష్యం వీడి, ప్రతి ఒక్కరూ ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని పౌర సరఫరాలశాఖ అధికారులు సూచిస్తున్నారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో నేటికీ 2,79,530 మంది పూర్తి చేయాల్సి ఉంది. అంటే దాదాపు 40 శాతం పూర్తి కావాలి. అధికారులు ఇందుకు అనేక కారణాలు చూపుతున్నారు. చాలా మంది లబ్ధిదారులు ఇతర ప్రాంతాల్లో ఉండటం, వలసలు వెళ్లడం, సరైన అవగాహన లేకపోవడం వంటి కారణాలతో ముందుకు రావడం లేదంటున్నారు. వృద్ధులు, నడవలేని వారు, దివ్యాంగులు.. రేషన్ దుకాణాల వద్దకు వచ్చి ఈ-కేవైసీ పూర్తి చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు సైతం ఈ విషయంలో ప్రజలకు సరైన అవగాహన కల్పించడం లేదని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో..

మొత్తం రేషన్ దుకాణాలు	218
రేషన్ కార్డులు	2,082,56
లబ్ధిదారుల సంఖ్య	6,83,581
ఈ-కేవైసీ పూర్తయినవారు	4,04,051
పూర్తిచేయాల్సినవారు	2,79,530

నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు..

– పుల్లయ్య, అసిస్టెంట్ పౌరసరఫరాల అధికారి, సరూర్‌నగర్ సర్కిల్

రేషన్ లబ్ధిదారుల ఈ-కేవైసీ పూర్తికి సెప్టెంబరు 30 వరకు ఉన్న గడువును ప్రభుత్వం ఈ ఏడాది చివరి వరకు పొడిగించింది. ప్రతి ఒక్క లబ్ధిదారుడు తమ పరిధిలోని రేషన్ దుకాణాల డీలర్లను సంప్రదించి.. తాజా వివరాలను నమోదు చేయించుకోవాలి. ఆధార్‌కు సంబంధించిన సమస్యలుంటే ముందే పరిష్కరించుకోవాలి. ఈ సారి గడువు ముగిశాక.. మరో అవకాశం ఉండకపోవచ్చు. నిర్లక్ష్యం చేస్తే బియ్యం, ఇతర ప్రభుత్వ పథకాల అర్హత విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఎల్బీనగర్: 76759 19030
మలక్‌పేట: 80085 73284
హయత్‌నగర్: 98336 64897
కర్మన్‌ఘాట్: 94400 32872
బండ్లగూడ: 96034 78579
మూసారాంబాగ్: 79933 00559

న్యూస్‌టుడే, కర్మన్‌ఘాట్, మూసారాంబాగ్

? వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీ ఫేజ్-1లోని చిన్న పార్కు వద్ద ఏర్పాటు చేసిన వీధి దీపం చాలా రోజులుగా వెలగడం లేదు. మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలి. **– అలేఖ్య, ఎఫ్‌సీఐ కాలనీ ఫేజ్–1**

✓ సమస్య మా కమిటీ దృష్టికి రాలేదు. పరిశీలించాలని జీహెచ్ఎంసీ విద్యుత్తు విభాగం సహాయకుడికి సూచించాం. ఒకటి, రెండు రోజుల్లో మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.
– రాంరెడ్డి, అధ్యక్షుడు, ఎఫ్‌సీఐ కాలనీ

? మూసారాంబాగ్ లక్ష్మీనగర్ కాలనీ మార్గంలో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆకతాయిలు అక్కడే తిష్ఠ వేస్తుండటంతో సమస్యలు తప్పడం లేదు. **– రాములు**

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే వీధి దీపాలకు మరమ్మతులు చేపడతాం. **– రాజు, ఏఈ, వీధిదీపాల విభాగం, జీహెచ్ఎంసీ**

? గడ్డిఅన్నారం బస్తీలో నిత్యం రహదారులపై మురుగు పారుతోంది. రాకపోకల సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు.
– శివరాంరెడ్డి, హోటల్ యజమాని

✓ స్థానికంగా పరిశీలించి, పరిష్కార చర్యలు చేపడతాం.
– వెంకటేశ్వర్లు, ఏఈ, జలమండలి

సమన్వయం కుదిరింది.. ప్రతిపాదనలే తరువాయి.!

హయత్‌నగర్, న్యూస్‌టుడే: వేలాదిమంది రాకపోకలు సాగించే కుమ్మరికుంట కట్ట సమస్య తీరనుంది. గుంతలతో కూడిన మట్టి రోడ్డుకు మోక్షం కలుగనుంది. మూడేళ్లుగా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తూ వాహనదారుల అవస్థలు పడుతున్నారు. 'ఈనాడు' వరుస కథనాలు, ప్రజాప్రతినిధుల చొరవతో త్వరలో కట్టపై రిటర్నింగ్ వాల్‌తో సహా సీసీ రోడ్డు వేయనున్నారు.



కుమ్మరికుంట కట్ట ప్రస్తుత పరిస్థితి

'ఈనాడు' కథనాలతో.. : విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి సాహెబ్ నగర్‌కు వెళ్లే మార్గంలోని కుమ్మరికుంట కట్ట రోడ్డు కీలకమైంది. ప్రధాన రోడ్డు నుంచి 2.5.కి.మీ దూరంలోని సాహెబ్ నగర్‌కు వెళ్లే ఈ మార్గం మీదుగా బీ.ఎన్.రెడ్డి, వనస్థలిపురం వెళ్లొచ్చు. మట్టి కట్ట మీదుగా ఎన్నో కాలనీలకు చెందిన వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో గతంలో తారు రోడ్డు ఉండేది. రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు కట్ట కోతకు గురైంది. కట్ట పరిస్థితిని వివరిస్తూ 'ఈనాడు'లో ప్రచురించిన వరుస కథనాలతో అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. అయితే కట్టను విస్తరించలేదు. రోడ్డు విషయంలో నీటి పారుదల, జీహెచ్ఎంసీ అధికారుల మధ్య సమన్వయలోపం నెలకొనడంతో పనులు ముందుకు సాగలేదు. కట్టపై రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. 'ఈనాడు' కథనాలు, ప్రజాప్రతినిధుల చొరవతో నీటిపారుదల, జీహెచ్ఎంసీ అధికారుల మధ్య ఎట్టకేలకు సమన్వయం కుదిరింది. రహదారి నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం..: నవజీవన్‌రెడ్డి, కార్పొరేటర్, హయత్‌నగర్

కుమ్మరికుంట కట్టపై సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి జీహెచ్ఎంసీ, నీటిపారుదల అధికారుల మధ్య సమన్వయం కుదిరింది. కట్టపై సీసీ, తారు రోడ్డు వేసేందుకు వీలుగా నీటిపారుదల శాఖ అధికారుల నుంచి ఎన్‌ఓసీ తీసుకొని జీహెచ్ఎంసీ అధికారులకు అందజేశాం. రిటర్నింగ్ వాల్ సహా సీసీ రోడ్డు నిర్మాణానికి ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తాం.

స్వచ్ఛత.. ప్రతి ఒక్కరి బాధ్యత



హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీలో కార్పొరేటర్ సుజాతానాయక్, అధికారులు

కర్మన్‌ఘాట్, హయత్‌నగర్, బండ్లగూడ, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని పలువురు అభిప్రాయపడ్డారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ సుజాతానాయక్, ఎల్బీనగర్ సర్కిల్ ఏఎంహెచ్‌వో నాగేశ్ తదితరులు పాల్గొన్నారు. పలు హోటళ్లను పరిశీలించి స్వచ్ఛతను పరిశీలించారు. కాలనీ అధ్యక్షుడు గోదల శ్రీనివాస్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జవాన్ శంకర్ పాల్గొన్నారు.

● హయత్‌నగర్ కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం అధికారి చంద్రకాంత్, వ్యవసాయ పరిశోధన సంస్థ అధికారులు విజయ్‌కుమార్, గౌతమ్ వీర్ చౌహాన్, శ్రీకృష్ణ, దిలీప్ పాల్గొన్నారు.

● బండ్లగూడ జీఎస్ఐ సంస్థ కేంద్రం ఆధ్వర్యంలో మన్సూరాబాద్ రోడ్డులోని మహవీర్ వనస్థలి పార్కు నిర్వహించిన కార్యక్రమంలో ఉప కమిషనర్ యాదయ్య, జీఎస్ఐ సంస్థ అదనపు డైరెక్టర్ జనరల్ ఎస్.డి.పట్నాయక్, కార్పొరేటర్లు చింతల అరుణాయాదవ్, కొప్పుల నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహవీర్ వనస్థలి పార్కు వద్ద..

ప్రత్యంగిరా దేవి శరన్నవరాత్రులు 3 నుంచి



కుర్తాళం పీఠంలో కరపత్రాల ఆవిష్కరణలో మునిపల్లె శ్రీనివాస్, భక్తులు

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆర్కేపురంలోని కుర్తాళం పీఠానికి చెందిన ప్రత్యంగిరా దేవి శరన్నవరాత్రులు అక్టోబరు 3వ తేదీ నుంచి 12 వరకు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. దీనికి సంబంధించిన సోమవారం ఆలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరాత్రులలో ప్రతి రోజు ఉదయం 6.30కి విశేష అభిషేకం, ఉ.10.30కి మహిళలతో కుంకుమార్చన సేవ, సా.6గంటలకు అమ్మవారి ప్రత్యేక అలంకరణ దర్శనం, లలితా, విష్ణు సహస్రనామ పారాయణం, భక్తి సంగీతం, రా.8 గంటలకు మహా నక్షత్ర హారతి సేవ.. తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అక్టోబరు 12న శనివారం సాయంత్రం 6-00 గంటలకు శమీపూజ జరుగుతుందని తెలిపారు. విఠల్‌శర్మ, అరుణ, హేమంత్ శర్మ, రామశర్మ, అశ్వంత్, సంతోషి, హేమ, పద్మలక్ష్మి, పూర్ణిమ పాల్గొన్నారు.

అప్పులబాధతో ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య

సైదాబాద్, న్యూస్‌టుడే: షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి నష్టపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మలక్‌పేట ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై సంజీవరెడ్డి కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బరంపూర్‌కు చెందిన మౌనీశ్‌రెడ్డి(32)-శ్రుతి దంపతులు రెండేళ్లుగా ముసారాంబాగ్ శాలివాహననగర్‌లో ఉంటున్నారు. ఇరువురు ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారు. కొన్నాళ్ల క్రితం ఉద్యోగం మానేసిన మౌనీశ్‌రెడ్డి.. షేర్ మార్కెట్‌పై దృష్టి పెట్టాడు. పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టగా, నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయి. శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాదుల రిలే దీక్షలు ప్రారంభం



రిలే దీక్షలో న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: న్యాయవాదుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని తెలంగాణ న్యాయవాదుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కోర్టుల ఎదుట సోమవారం ప్రారంభమైన రిలే దీక్షల్లో ఆయన మాట్లాడారు. టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల స్థానాల్లో క్యాడర్ పీపీలను నియమించొద్దని, క్రిమినల్ కేసుల దర్యాప్తులో భాగంగా బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(పాత సీఆర్‌పీసీ 41ఎ) ప్రకారం పోలీసులకు ఇచ్చిన విస్తృత అధికారాలను సవరించాలని, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ మాట్లాడుతూ.. డిమాండ్లను సాధించుకునే వరకు దీక్షలు ఆపే ప్రసక్తే లేదన్నారు. మొదటి రోజు దీక్షలో అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, శశికాంత్ మడుపు, రాధాకృష్ణ, మీనాక్షి, అశోక్ తదితరులు కూర్చున్నారు. పలువురు న్యాయవాదులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

ఎల్బీనగర్: రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర బీసీ న్యాయవాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జూపల్లి కృష్ణ కోరారు. రంగారెడ్డి జిల్లా కోర్టు ఎదుట నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు.

స్నేహితుడి కారు ఢీకొని యువకుడి మృతి

హయత్‌నగర్: స్నేహితుడి కారు ఢీకొని ఓయువకుడు దుర్మరణం పాలైన ఘటన హయత్‌నగర్ పోలీసు ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట మైత్రీసిరిపురంలో పందుగల కుమార్ (30), భార్య, ఇద్దరు కుమారులతో కలిసి ఉంటున్నారు. ఆదివారం రాత్రి కుంట్లూరులో స్నేహితులంతా కలిసి దావత్ చేసుకున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో కుమార్, అతని స్నేహితుడు వెంకటేశ్ ఇద్దరు కలిసి కారులో ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వెంకటేశ్ వేగంగా కారును రివర్స్ తీయడంతో.. పక్కనే ఉన్న కుమార్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో కుమార్ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

నాంపల్లి: ఆరుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో బయలుదేరిన కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. అందులో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. సోమవారం తెల్లవారుజామున నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్ వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన సాయితేజ(24), సందీప్, మాధురి, సాయికిషన్, సాయిసింధు.. గచ్చిబౌలిలోని జెన్‌ప్యాక్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. ఎప్పటిలాగే సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు కంపెనీ క్యాబ్‌లో బయలుదేరారు. కారు మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్ వంతెన ప్రవేశమార్గం వద్ద ఫ్లైఓవర్ పైకి ఎక్కిన వెంటనే డ్రైవర్ ముందున్న ఓ బైక్‌ను ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించాడు. కారు అదుపుతప్పి ఫ్లైఓవర్‌కు ఎడమవైపు ఉన్న గోడను ఢీకొంది. సాయితేజ అక్కడికక్కడే మృతి చెందగా, సందీప్‌కి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీ

నాగోలు: నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలి మెడలోని గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించిన ఘటన చైతన్యపురి ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అల్కాపురి రోడ్డు నంబరు-8లో నివసించే దేశిరాజు లక్ష్మీసుజాత(65) సోమవారం సాయంత్రం రోడ్డు నంబరు-6లో నడుచుకుంటూ వెళ్తుంది. అదే సమయంలో ఓ ఎలక్ట్రిక్ బైక్‌పై ముఖానికి మాస్కు వేసుకుని హెల్మెట్ ధరించి వచ్చిన దుండగుడు.. ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెలతాడును తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రహదారులపై పారిస్తున్నారు!

● కాలనీల్లో నిత్యం తాగునీటి వృథా

బండ్లగూడ, న్యూస్‌టుడే: పలు కాలనీల్లో విలువైన తాగునీటిని వృథా చేస్తున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇళ్ల ముందు స్థలాలను శుభ్రం చేస్తూ, రహదారులపై వరద పారిస్తున్నాయి. కొత్తగా వేసిన రోడ్లు.. ఈ వరద కారణంగా దెబ్బతింటున్నాయి. వేగంగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయాలపాలవుతున్నారు. నిత్యం రహదారులు పారుతున్న నీరు కారణంగా, కాలనీల్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. నాగోల్ డివిజన్ ఇంద్రప్రస్థ కాలనీ, మధురానగర్, అజయ్ నగర్, బృందావన్ కాలనీల్లో ఈ సమస్య నెలకొంది. చాలా కాలనీల్లో ఇళ్లల్లో సంపులు, ఇంటిపై ట్యాంకు నిండి.. ఆ నీరు సైతం రోడ్లపైనే పారుతోంది. నాగోల్ నుంచి బండ్లగూడ శివారు వరకు ఉన్న రేడియల్ రోడ్డులోని దుకాణదారులు నిత్యం పైపులతో దుకాణం ముందు శుభ్రం చేస్తుండటంతో.. రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది.



గోపాలకృష్ణపురం కాలనీలో కారు కడుగుతూ..

అవగాహన అవసరం..

2021 నుంచి అర్హత కలిగిన వారికి నెలకు 20 వేల లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గతంలో నెలనెలా బిల్లులు వస్తున్నప్పుడు నీటిని పొదుపుగా వాడేవారు. ప్రస్తుతం ఉచితం కావడంతో ఇష్టారాజ్యంగా వినియోగిస్తున్నట్లు పలువురు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నిత్యం ఇళ్లు, ఇంటి ముందు స్థలాన్ని పైపులు పెట్టి శుభ్రం చేస్తున్నారు. ఇలా ఒకరిని చూసి, మరొకరు అదే పని చేస్తుండటంతో.. వీధుల్లో నీరు వరదలా పారుతోంది. ఇలా నీటిని వృథా చేస్తే, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. కానీ పట్టించుకోవడం లేదు. బీటీ రోడ్లు ధ్వంసం అవుతున్నా అధికారులు స్పందించడం లేదు. భవిష్యత్తులో తాగునీటి కష్టాలు రాకుండా ఉండాలంటే, నీటిని పొదుపుగా వాడుకోవాలి. ఈ విషయంలో స్థానికులకు అధికారులు అవగాహన కల్పించాలి.

ఎల్బీనగర్ పరిధిలో..

మొత్తం నీటి కనెక్షన్లు:	59,125
గృహావసరాలవి..:	57,503
వాణిజ్య అవసరాలవి..:	4,563
ఉచిత నీటి కనెక్షన్లు:	30,161
సరఫరా అయ్యే నీరు:	14 ఎంజీడీలు



రేడియల్ రోడ్డులో దుకాణాల ముందు శుభ్రం చేస్తూ..

వృథా చేస్తే చర్యలు..:

– శ్రీనివాస్‌రెడ్డి, జీఎం, జలమండలి

తాగు నీటిని వృథా చేస్తే కఠిన చర్యలు తప్పవు. జలమండలి సరఫరా చేస్తున్న నీటిని వృథా చేసినట్లు మా దృష్టికి వస్తే, నల్లా కనెక్షన్ సీజ్ చేస్తాం. జరిమానాల విధింపు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం పరిధిలో ఉంటుంది. నీటి వృథాను అరికట్టేందుకు కాలనీ సంక్షేమ సంఘాల బాధ్యులు.. ఆయా కాలనీల్లో అవగాహన కల్పించాలి. అప్పటికీ వినకపోతే మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



వనస్థలిపురం, న్యూస్‌టుడే: పేదలు ఆసుపత్రి ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధు యాస్కీ గౌడ్ సూచించారు. వనస్థలిపురం డివిజన్ టీవీ కాలనీకి చెందిన ఎం.శ్రీనివాసులు అనారోగ్య సమస్యలతో ఇటీవల ఆసుపత్రిలో చేరారు. ఆర్థిక సమస్యల నేపథ్యంలో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును సోమవారం తన కార్యాలయంలో మధుయాస్కీ.. బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

కుటుంబం ఆత్మహత్యాయత్నం.. స్థానికుల సాయంతో కాపాడిన పోలీసులు

నాగోలు, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ కుటుంబాన్ని స్థానికుల సహాయంతో పోలీసులు కాపాడారు. సరూర్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం... కర్నూలుకు చెందిన దంపతులకు ముగ్గురు కుమారులు. పదేళ్లక్రితం నగరానికి వచ్చి కోదండరాంనగర్‌లో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. పెద్ద కుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. రెండో కుమారుడు దుకాణం చూస్తుండగా, చిన్నకుమారుడు బీటెక్ పూర్తిచేశారు. కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో కుటుంబమంతా ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో పురుగుల మందు తాగారు. కొంతసేపటికి తండ్రి, పక్కింట్లో ఉండే వ్యక్తిని ఫోను చేసి కాపాడాలని కోరారు. అతడు పోలీసులకు సమాచారం ఇవ్వగా, సరూర్‌నగర్ పోలీసులు 5 నిముషాల్లో ఘటనాస్థలానికి చేరుకున్నారు. స్పృహలో ఉన్న చిన్నకుమారుడి సాయంతో తాళం చెవులు తీసుకొని.. తలుపులు తెరిచారు. వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్సై మారయ్యలు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హిందీ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



వెంకట రాంనర్సింహ రెడ్డిని సత్కరిస్తున్న గైబువల్లి, చంద్రకాంత్ తదితరులు

గన్‌ఫౌండ్రి: దేశ ప్రజలను ఐక్యంగా ఉంచేందుకు దోహదపడుతున్న హిందీ భాష అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పలువురు వక్తలు కోరారు. ఈ మేరకు అబిడ్స్ స్టేషన్ రోడ్‌లో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొ.ఎస్.చంద్రదేవ్ భగవంత్ రావు కవాడే, ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి, హైకోర్టు న్యాయవాది జె. వెంకట రాంనర్సింహ రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా హిందీ భాషాభివృద్ధికి పాటుపడుతున్న పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికార భాష అధికారి దేవకాంత్, మిలింద్ ప్రకాశన్ పబ్లిషర్స్ అధినేత శృతికాంత్ భారతి పాల్గొన్నారు.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

విశ్వహిందూ పరిషత్ నిరసన



చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: తిరుమల లడ్డు ప్రసాదంలో జరిగిన అపవిత్రం పట్ల వ్యతిరేకిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆర్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం లాల్‌దర్వాజా మోడ్ వద్ద ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి కాశీ విశ్వనాథ పీఠం పీఠాధిపతి స్వామి దుర్గానంద పాల్గొని మాట్లాడారు. దేవాదాయ, ధర్మాదాయశాఖను రద్దు చేసి హిందూ సనాతన బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. హిందూ సనాతన బోర్డులో పీఠాధిపతులు, మఠాధిపతులు, ధార్మిక సంస్థలకు చెందిన వారిని సభ్యులుగా నియమించాలన్నారు. వీహెచ్‌పీ కేంద్రీయ మందిర్ పరిషత్ అధ్యక్షుడు రామరాజు, ఆర్యనగర్ జిల్లా అధ్యక్షుడు విశాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందిస్తాం

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: పేద రోగులకు కార్పొరేటుకు దీటుగా నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాకేశ్ సహాయ్ అన్నారు. ఆసుపత్రిలోని సూపర్ స్పెషాలిటీ, స్పెషాలిటీ విభాగాల్లోని నిపుణులైన వైద్యులు కాలేయ, మూత్రపిండాల మార్పిడి, చర్మనిధి కేంద్రం ద్వారా ప్రమాదవశాత్తూ కాలిన క్షతగాత్రులకు చర్మ మార్పిడి వంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో కురుస్తున్న వర్షాల వల్ల ఓపీలతో పాటు ఇన్‌పేషెంట్ల తాకిడి ఉస్మానియాకు అధికమైందని వివరించారు. రోగుల రద్దీకి అనుగుణంగా ఉస్మానియాకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

'కబ్జా నుంచి ఆలయాన్ని కాపాడండి'

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: కబ్జాకు గురైన దేవదాయ శాఖకు చెందిన ఆలయాన్ని కాపాడాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సేన ప్రతినిధులతో కలిసి సోమవారం బొగ్గులకుంటలోని తన కార్యాలయంలో దేవదాయ శాఖ అదనపు కమిషనర్ జ్యోతి, సహాయ కమిషనర్ బాలాజీలను కలిసి వినతి పత్రం అందజేశారు. బేగంబజార్ జోషివాడలో దేవాదాయ శాఖకు చెందిన సుమారు 2వేల గజాల్లో ఉన్న గోస్వామి మఠంను ఓ వ్యక్తి కబ్జా చేసి సొంతానికి వాడుకుంటూన్నాడని, భక్తులను అనుమతించడం లేదని పేర్కొన్నారు. ఇటీవల అధికారులు తక్షణమే స్పందించి కబ్జాదారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

స్వచ్ఛత నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: నగరంలో కల్తీ ఆహార పదార్థాలు మనుషుల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయని, కల్తీని నివారించేందుకు స్వచ్ఛత నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వినయ్‌కిషోర్ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యాపారాల్లో లాభాల కోసం ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు.

మహాకుంభాభిషేక మహోత్సవానికి రంగం సిద్ధం

1008 కలశాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం

కేశవగిరి, న్యూస్‌టుడే: పాతబస్తీ చాంద్రాయణగుట్టపై కొలువుదీరిన భ్రమరాంబదేవి సమేత చెన్నమల్లికార్జునస్వామి దేవస్థానం అపూర్వ ఘట్టానికి వేదిక కానుంది. 8 వందల ఏళ్లనాటి చరిత్ర ఉన్న ఆలయాన్ని అన్ని విధాలుగా ఆధునికీకరించి మహోన్నతమైన ఉత్సవాలు చేపడుతున్నారు. కొండపైన దేవస్థానం ఆవరణలో శ్రీ రుద్రయాగ సహిత సహస్ర చండీయాగ పూర్వక.. 'మహాకుంభాభిషేక మహోత్సవం' అక్టోబరు 3 నుంచి 12 వ తేదీ విజయదశమి వరకు పదిరోజుల పాటు కొనసాగనుంది.



గుహలోపల కొలువుదీరిన భ్రమరాంబదేవి అమ్మవారు

శిఖర పునర్నిర్మాణం.. నూతన కట్టడాల నిలయం

దేవస్థానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచే క్రమంలో ఆలయ నిర్వాహకులు కోటి అనిల్‌కుమార్, హరీశ్‌కుమార్, దాతలు, భక్తుల సహకారాలతో మొదట అమ్మవారి శిఖర పునర్నిర్మాణం గతంలో చేపట్టారు. ప్రస్తుతం స్వామివారి శిఖరాన్ని అధునాతనంగా పునర్నిర్మించారు. చిన్నదిగా ఉన్న అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నూతన భవంతిని నిర్మించి విస్తరించారు. దానిపైన ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఆలయంపైన కట్టడాలు తుదిమెరుగులు దిద్దుకుని రంగులద్దుకుంటున్నాయి.

దేవతామూర్తుల ప్రతిష్ఠాపనలు

మహోత్సవాలలో భాగంగా ఆలయంలో చెన్నమల్లికార్జున స్వామి వద్ద నూతన 'బ్రహ్మ సూత్ర శివలింగం' ప్రతిష్ఠించనున్నారు. ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తి, కాలభైరవ నూతన విగ్రహాలకు రంగం సిద్ధం చేశామన్నారు. ధ్వజస్తంభ ప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఆలయంలో చెన్న మల్లికార్జునస్వామివార్లు



ప్రతిష్ఠించనున్న బ్రహ్మ సూత్ర శివలింగం

సహస్ర కలశాలతో అమ్మవారికి..

1008 కలశాలను స్థాపించి భక్తులందరితో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయా కలశాల పవిత్ర జలంతో అమ్మవారికి 'మహాకుంభాభిషేకం' చేపడతామని ప్రధాన అర్చకులు చెప్పారు. 2న మహాగణపతి పూజతో, అగ్నిప్రతిష్ఠాపనతో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 3న కలశస్థాపనలు, అభిషేకం, గణపతిహోమం, సుబ్రహ్మణ్యహోమం, రుద్ర హోమం ఉంటాయన్నారు. 4న నుంచి 11వ తేదీ వరకు ఇవే కార్యక్రమాలు కొనసాగుతాయని, భక్తులు మూడు పుటలా జరిగే చండీహోమాల్లో పాల్గొనవచ్చన్నారు. 12 విజయదశమి రోజుల చండీహోమం, పూర్ణాహుతి దేవాలయ కుంభాభిషేకం, గ్రామోత్సవం, శమీపూజ, పండిత సన్మానం ఉంటాయని వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

ఆసిఫ్‌నగర్, ఉస్మానియా ఆసుపత్రి, కంచన్‌బాగ్, ఐఏఎస్ సదన్, న్యూస్‌టుడే:

? లంగర్‌హౌస్ ప్రధాన రహదారిలో తాగునీటి పైపులైన్‌కు తరచుగా లీకేజీలు ఏర్పడుతున్నాయి. ట్యాంకర్ల కొద్దీ మంచినీరు వృథా అవుతోంది.
– శివకుమార్, స్థానికుడు

✓ ప్రధాన పైపులైన్ నుంచి మిలటరీ ప్రాంతానికి నీటి సరఫరా జరుగుతోంది. ఆచీతూచీ మరమ్మతులు చేపడుతున్నాం. సోమవారం పనులు పూర్తి చేశాం. ఇక మీదట లీకేజీలు ఉండవు. – **రమేష్, జలమండలి మేనేజరు, లంగర్‌హౌస్ సెక్షన్.**

? ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలోని జీవన్‌ధార, జీవన ఉపస్రవంతి తదితర జనరిక్ మెడికల్ షాపుల్లో నిర్ణీత ధర కంటే అధిక ధరలకు మందులు విక్రయిస్తున్నారు.– **సుప్రియ, జుమ్మెరాత్‌బజార్**

✓ ఎమ్మార్పీ ధరలకు అధికంగా మందులను విక్రయించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. – **శ్రీనివాస్, సీఆర్ఎం, ఎంజీబీఎస్**

? కంచన్‌బాగ్ డీఆర్డీఎల్ ఎదుట మద్యం దుకాణం వద్ద వాహనాలు ఇష్టానుసారంగా నిలిపి ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. – **వెంకటేశ్వర్లు, రియాసత్‌నగర్**

✓ అక్రమ పార్కింగ్ ఉంటే చర్యలు తీసుకుంటాం.
– **శ్రీనునాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, చాంద్రాయణగుట్ట**

? కృష్ణానగర్ కాలనీలోని యూనిక్ గ్రామర్ స్కూలు వెనుక వీధిలోచిన్నపాటి వర్షం పడినా నీళ్లు నిలుస్తున్నాయి.
–పద్మ, కృష్ణానగర్ కాలనీ

✓ పరిశీలించి పనులు చేపడతాం.
–శైలజ, సంతోష్ నగర్ సర్కిల్ ఉప కమిషనర్

భవనం పనులు సత్వరమే పూర్తి చేయాలని వినతి



బేగంబజార్, న్యూస్‌టుడే: చుడీబజార్‌లోని చరిత్రాత్మక డా.రామ్‌మనోహర్ లోహియా సామాజిక భవనం నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేయాలని మాదిగ బంధుమిత్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.సుమన్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ సర్కిల్-14 డీఎంసీని కలిసి వినతిపత్రం సమర్పించారు. చుడీబజార్, జుమ్మెరాత్‌బజార్, పురానాపూల్, దేవీనగర్, అంబేడ్కర్‌నగర్, ఉప్పలమ్మ దేవాలయం, తదితర ప్రాంతాల్లోని మురికివాడలకు చెందిన బస్తీవాసులు శుభ కార్యాలు, పండుగలకు ఈ భవనం ఎంతో ఉపయోగంగా ఉంటుందని వివరించారు.

పండుగల తేదీల్లో అయోమయం నివారించేందుకు నిర్ణయం

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: హిందువుల పండుగలకు సంబంధించి ఒక్కో సిద్ధాంతి ఒక్కో తిథి, తేదీల వివరాలు ప్రకటిస్తున్నారని, దీనివల్ల తీవ్ర అయోమయం నెలకొంటుందని యాదగిరిగుట్ట దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి సంపత్‌కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి తెలిపారు. ఈ మేరకు హైదర్‌గూడ న్యూస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీ వైష్ణవ ఆగమ సాంప్రదాయ సేవా సమితి అధ్యక్షుడు యాదగిరి స్వామి, ప్రతినిధులు వెంకట కిషోర్, శ్రీధర్ స్వామి, వేణు స్వామి, ఆచార్య ఆత్రేయ తదితరులతో కలిసి మాట్లాడారు. సిద్ధాంతుల అభిప్రాయాలను పరిగణన తీసుకొని విశ్వావసు (2025-26) సంవత్సరలో జరగబోయే సాంప్రదాయ, సాధారణ, విశేష పండుగ తేదీలపై నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు.

పేదల ఇళ్ల కోసం సుప్రీం కోర్టుకు వెళ్లడానికైనా సిద్ధం: కేటీఆర్



కేశవగిరి, న్యూస్‌టుడే: మూసీ పరివాహక ప్రాంతంలోని పేదల ఇళ్లను కూల్చివేయకుండా ఎంతటి పోరాటమైన సాగించడానికి భారాస వెనుకాడదని, న్యాయం కోసం సుప్రీం కోర్టుకు వెళ్లడానికి సిద్ధమేనని కేటీఆర్ పేర్కొన్నారు. బాధితులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ బెదిరింపులకు భయపకుండా కలికట్టుగా తమ నివాసాలను కూల్చివేత నుంచి కాపాడుకోవడానికి ముందుకు రావాలన్నారు. ఒక్క ఫోను చేస్తే.. పదిహేను నిమిషాల వ్యవధిలో భారాస వచ్చి బుల్డోజర్లను అడ్డుకుంటారన్నారు. సోమవారం సాయంత్రం బహదూర్‌పురలోని కిషన్‌బాగ్ మహమూద్‌నగర్ మూసీ పరివాహక ప్రాంతాల నివాసాలను ఆయన సందర్శించారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గులాబీ కాంతులతో



వీక్షకులను ఆకట్టుకున్న చార్మినార్..

చార్మినార్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ రొమ్ము క్యాన్సర్ అవగాహనలో భాగంగా క్యాన్సర్ నివారణ స్ఫూర్తిని కల్పించే పింక్ రిబ్బన్ కార్యక్రమలో భాగంగా సోమవారం రాత్రి చార్మినార్‌కు గులాబీ కాంతుల శోభ సంతరించుకుంది.

సబ్ ప్లాన్ నిధుల దుర్వినియోగంపై కమిటీని నియమించండి



మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కమిటీని నియమించడం కాదని, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధుల దుర్వినియోగంపై కమిటీ వేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. దళితులను రాజ్యాధికారానికి దూరం చేసేందుకే రాజకీయ పార్టీలు వర్గీకరణను తెరపైకి తీసుకువచ్చి అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని దుయ్యబట్టారు. ఉపప్రణాళిక నిధులకు సంబంధించి ఇప్పటివరకు రూ.2 లక్షల కోట్ల రూపాయల దుర్వినియోగం జరిగిందని విమర్శించారు. నవంబరు నెలాఖరులో వర్గీకరణకు వ్యతిరేకంగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమితి జాతీయ అధ్యక్షుడు డా.వీఎల్ రాజు, మహిళా అధ్యక్షురాలు రోజాలీల, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి



ఫిర్యాదులు ఆలకిస్తున్న జడ్సీ టి.వెంకన్న

కేశవగిరి, న్యూస్‌టుడే: ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న అన్నారు. చాంద్రాయణగుట్ట సర్కిల్ ఫూల్‌బాగ్‌లోని బల్దియా కార్యాలయంలో సోమవారం అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బస్తీ, కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. సంబంధిత అధికారులతో చర్చించి వాటిని పరిష్కరిస్తామన్నారు. వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డా.శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డా. అశోక్‌కుమార్, ఏఎంసీ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించే వారికి గుర్తింపు

కేశవగిరి, న్యూస్‌టుడే: అంకితభావంతో విధులు నిర్వహించే వారికి ఎక్కడైనా ఉత్తమ గుర్తింపు లభిస్తుందని టి.వెంకన్న అన్నారు. పదవీ విరమణ చేసిన సందర్భంగా చాంద్రాయణగుట్ట సర్కిల్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ) పి.మోహన్‌రెడ్డితోపాటు ఆయన సతీమణిని చార్మినార్ కార్యాలయంలో సోమవారం జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఏఎంసీగా ఆయన అందించిన విశిష్ట సేవలు అందరికీ ఆదర్శం కావాలన్నారు. మోహన్‌రెడ్డి విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కొనసాగాలని అధికారులు ఆకాంక్షించారు.

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు కదిరవన్, వెంకటాచారి సంబంధిత అధికారులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన 181 మంది దరఖాస్తులు అందచేశారు. ఆర్డీఓ దశరథ్ సింగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

మరో యువకుడి పరిస్థితి విషమం

నాంపల్లి, న్యూస్‌టుడే: ఆరుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో బయలుదేరిన కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. అందులో ఒకరు దుర్మరణం చెందగా, మరోకరి పరిస్థితి విషమంగా ఉంది. నలుగురు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. సోమవారం తెల్లవారుజామున నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్ వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... నగరానికి చెందిన సాయితేజ(24), సందీప్, మాధురి, సాయికిషన్, సాయిసింధు గచ్చిబౌళిలోని జెన్‌ప్యాక్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. ఉద్యోగులు ఎప్పటిలాగే సోమవారం తెల్లవారుజామున 4గంటలకు కంపెనీ క్యాబ్‌లో హయత్‌నగర్ నుంచి బయలుదేరారు. వారు ప్రయాణిస్తోన్న కారు లక్డీకాపూల్ మీదుగా మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్ వంతెన ప్రవేశ మార్గం వద్ద ఫ్లైఓవర్ పైకి ఎక్కిన వెంటనే డ్రైవర్ సాయివంశీ ముందున్న ఓ బైక్‌ను ఓవర్‌టేక్ చేసి వేగంగా దూసుకువెళ్లేందుకు ప్రయత్నించాడు.. కానీ కారు వేగాన్ని అదుపుచేయలేక ఫ్లైఓవర్‌కు ఎడమవైపు ఉన్న సిమెంటు గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయితేజ అక్కడికక్కడే మృతి చెందగా సందీప్‌కి పరిస్థితి విషమంగా ఉంది. సాయితేజ మృతదేహానికి ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టమ్ అనంతరం కుటుంబీకులకు అప్పగించామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడుల పేరిట రూ.9.56 లక్షల టోకరా

నారాయణగూడ, న్యూస్‌టుడే: ట్రేడింగ్‌లో డబ్బులు పెట్టి మోసపోయిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి బంగారం షేర్ ట్రేడింగ్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటన వచ్చింది. అందులో లింక్‌పై క్లిక్ చేయడమే ఆలస్యం ఆయన ఫోన్ నంబరు వాట్సాప్ గ్రూప్‌తో అనుసంధానమైంది. ఈ షేర్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అనతికాలంలోనే కోటీశ్వరులు అవుతారని నమ్మించాడు. ఓ లింక్‌ను పంపించి అందులో ఉద్యోగి పేరిట ప్రత్యేక ఖాతాను తెరిపించాడు ఆగంతుకుడు. బాధితుడు ఫోన్ నంబరుతో పాటు బ్యాంకు ఖాతా వివరాలు పొందుపరిచాడు. రూ.9.56 లక్షలు పెట్టుబడి పెట్టిన తర్వాత లాభాలు వచ్చాయని యాప్‌లో కనిపిస్తున్నా.. ఉపసంహరించుకునే అవకాశాన్ని మాత్రం ఇవ్వలేదు. మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బహిరంగ ప్రదేశంలో గంజాయి తాగుతున్న ఇద్దరికి జైలు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: బహిరంగ ప్రదేశాల్లో గంజాయి తాగుతున్న ఇద్దరికి న్యాయస్థానం జరిమానాతో పాటు జైలుశిక్ష విధించింది. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు కథనం ప్రకారం.. నాంపల్లి ముర్గీ మార్కెట్‌కు చెందిన గణేష్(25), మల్లేపల్లి నివాసి బి.దినేష్(20) ఆదివారం రాత్రి నాంపల్లి దక్కన్ ఆచార్ ఘర్ వద్ద న్యూసెన్స్ చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. కానిస్టేబుల్ రహమత్ అక్కడి చేరుకొని అనుమానాస్పదంగా కనిపించిన వీరిని ప్రశ్నించగా, గంజాయి మత్తులో పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. దీంతో నిందితులను అరెస్టు చేసిన పోలీసులు సోమవారం ఉదయం నాంపల్లిలోని 2వ ప్రత్యేక జుడీషియల్ మెజిస్ట్రేట్ ఎదుట నిందితులను హాజరు పరిచారు. గణేష్, దినేష్‌లకు మూడు రోజుల జైలు, రూ.2600 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.స్వామి తీర్పు చెప్పారు.

మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

కేశవగిరి, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతి పత్రాలు లేకున్నా మత్తు ఇంజక్షన్లను తొందరగా కండలు పెంచాలనే మోజులో ఉన్న యువతకు విక్రయిస్తున్న ముఠాలోని ఇద్దరిని పోలీసులు అరెస్టు చేయగా మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. ఈ సంఘటన పాతబస్తీ బండ్లగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ వివరాల ప్రకారం.. బండ్లగూడ నైస్ హోటల్ సమీపంలో రాత్రి యువకులు నిషేధిత ఇంజక్షన్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లారు. ఎలక్ట్రానిక్ వ్యాపారం చేసే మహ్మద్ నవాజ్, రియల్‌ఎస్టేట్‌తో పాటు మత్తు ఇంజక్షన్ల డీలర్ మహ్మద్ అబ్దుల్ వలీ అలియాస్ కఫీల్‌గా గుర్తించారు. వారి వద్ద ఉన్న 18 మెఫెన్‌టర్మైన్ సల్ఫేట్ (టెర్మిన్) 30 ఎంజీ ఇంజక్షన్ల బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. నూరీనగర్‌కు చెందిన అహ్మద్ నహదీ, మతీన్ ఆన్‌లైన్‌లో ఆర్డరు చేసి ఇంజక్షన్లు తెప్పిస్తున్నారని పేర్కొన్నారు. వాటిని యువతకు అధిక ధరలకు అమ్ముతున్నట్లు చెప్పారు. ఇద్దరు నిందితులను రిమాండుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

బాటిల్ వాషింగ్ ప్లాంట్ అమ్ముతామని రూ.25 లక్షలు స్వాహా

నారాయణగూడ, న్యూస్‌టుడే: బాటిల్ వాషింగ్ ప్లాంట్ యంత్రాన్ని అమ్ముతామని నమ్మించి రూ.25 లక్షలు దోచేశారంటూ ఓ బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కార్వాన్‌కు చెందిన ముహమ్మద్ ఫైసల్‌ఖాన్ సెప్టెంబరు 1న బాటిల్ వాషింగ్ ప్లాంట్ యంత్రాన్ని కొనుగోలు చేయాలని ఆన్‌లైన్‌లో వెతుకుతుండగా ఓ నంబరు నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. ఆ యంత్రాల తయారీ కంపెనీ ప్రతినిధినంటూ పరిచయం చేసుకొని బేరమాడాడు. చివరకు రూ.25 లక్షలకు ఒప్పందం కుదిరింది. కాకపోతే ముందుగా డబ్బులు ఇస్తేనే యంత్రాన్ని పంపిస్తామన్నాడు. దానికి బాధితుడు నగదు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశారు. ఆతర్వాత అవతలి వ్యక్తి స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉత్పత్తులు, ప్రకటన దుర్వినియోగం.. కేసు

నారాయణగూడ, న్యూస్‌టుడే: తమ ఉత్పత్తులు, బ్రాండ్, ప్రకటనలను దుర్వినియోగం చేస్తూ.. ప్రజలను మోసం చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలంటూ పునర్జీవిని ఇండియా ప్రైవేటు లిమిటెడ్ బిజినెస్ ఆపరేషన్ మేనేజర్ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తమ కంపెనీ వెబ్‌సైట్‌లోని సమాచారం, బ్రాండ్, ఉత్పత్తులను 'రోబోటిక్‌ఫావుసెట్' వెబ్‌సైట్‌తో పాటు సామాజిక మాధ్యమాల్లో వాటిని ప్రచారం చేస్తున్నారు. ఇది మోసపూరితమైన వెబ్‌సైట్ అని తెలియని ప్రజల నుంచి ఫోన్ నంబరు, క్రెడిట్ కార్డు, యూపీఐ ఐడీలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారు. దీనిపై తమకు అనేక ఫిర్యాదు అందాయని సంస్థ ప్రతినిధి పోలీసులకు వచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలు మోసపోకుండా ఈ మోసాన్ని ఆపాలని పోలీసులను కోరారు.

ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: లలితాబాగ్‌లోని లలితాంబ దేవాలయ నూతన పాలక మండలి సభ్యులు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆలయ ఛైర్మన్‌గా పి.రాహుల్, ధర్మకర్తలుగా ఎన్.వెంకటేశ్ యాదవ్, టి.అనిల్‌సింగ్, పి.కిరణ్‌కుమార్, లక్ష్మీబాయిలను నియమిస్తూ ఇటీవల దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆలయ పాలకమండలి ఛైర్మన్ రాహుల్‌తో పాటు ధర్మకర్తలతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణచందర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఆలయ ఛైర్మన్ తెలిపారు.

మహనీయుడు పొట్టి శ్రీరాములు

బేగంబజార్, న్యూస్‌టుడే: దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం నిరంతరం పరితపించి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ప్రజాఏక్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం గౌలిగూడ మహరాజ్‌గంజ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పేరు మార్పును తెలంగాణ సర్కారు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ప్రజాస్వామిక వాదులు, భాషాభిమానుల నిర్ణయాన్ని ప్రభుత్వం గౌరవించాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని మేధావులు, కవులు, కళాకారులతో చర్చించి, భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తామని ఆయన తెలియజేశారు.

రోగుల సంరక్షణకు అధిక ప్రాధాన్యత

అబిడ్స్: ఎంతో నమ్మకం, విశ్వాసంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యంతో పాటు సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఉదయ్ ఓమ్నీ ఆసుపత్రి వ్యవస్థాపకడు డా.వేద్ ప్రకాశ్ అన్నారు. అబిడ్స్ చిరాగ్ అలీ లేన్‌లోని ఆసుపత్రి స్వర్ణోత్సవ వేడుకలను సోమవారం 350 మంది విశిష్ట అతిథుల సమక్షంలో నిర్వహించారు. ఆసుపత్రి డైరెక్టర్ రాఘవదత్ మాట్లాడుతూ.. ఇన్నొవేషన్, మెడికల్ ఎక్సలెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అధునాతన వైద్యాన్ని అందిస్తూ రోగుల ఆరోగ్యం మెరుగుపడేలా కృషి చేస్తున్నామని తెలిపారు. చీఫ్ జాయింట్ స్పెషలిస్టు డా.ఉదయ్ మాట్లాడుతూ.. ఆర్థోపెడిక్ కేర్‌లో, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీల్లో ట్రయల్ బ్లేజర్‌గా ముందుందన్నారు.

సినారె స్ఫూర్తితో సాహిత్యం వైపు అడుగులు



డా.చెన్నకేశవరెడ్డినీ సత్కరించిన ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ జుర్రు చెన్నయ్య తదితరులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: మహాకవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి.నారాయణ రెడ్డి స్ఫూర్తితో తెలుగు భాషా సాహిత్యాల వైపు అడుగులు వేశానని ప్రముఖ సాహితీ వేత్త డా.జి.చెన్నకేశవరెడ్డి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న పరిణత వాణి ప్రసంగపరంపరలో ఆయన సోమవారం పరిషత్తు ప్రాంగణంలోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఆయన ప్రసంగించారు. ఏడో తరగతిలో హిందీలో కవిత, పీయూసీలో తెలుగు కవిత రాశానని తెలిపారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ విద్యార్థులకు అవసరమైన అంశాలు పాఠ్య ప్రణాళికలో తక్కువగా ఉంటున్నాయని అన్నారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా.జుర్రు చెన్నయ్య, ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యుడు డాక్టర్ ఏ సిల్మా నాయక్ సాహితీ వేత్తలు, కవులు అమ్మంగి వేణుగోపాల్, టి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణ ప్రాంగణం.. నరకప్రాయం



నిత్యం వందల సంఖ్యలో బస్సులు.. వేలల్లో ప్రయాణికుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే కోఠి ఉమెన్స్ కళాశాల బస్టాప్ ఆవరణలోని రోడ్డు పూర్తిగా గోతుల మయంగా, అధ్వానంగా మారింది. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోని మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సుల్తాన్‌బజార్

గ్రామ పంచాయతీ కారోబార్‌ల సమస్యలు పరిష్కరించాలి



బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలలో పని చేసే సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ కారోబార్, సిబ్బంది అసోసియేషన్ కాంగ్రెస్ పార్టీకి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. సంఘం నేతలు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

బిల్లాదాఖల భూమిపై లావాదేవీలు రద్దు చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న కొండకల్ గ్రామస్థులు

శంకర్‌పల్లి(చేవెళ్ల): శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలోని సర్వే నం.555లో ఉన్న బిల్లాదాఖల భూములపై అక్రమంగా జరిగిన లావాదేవీలను రద్దు చేయాలని కొండకల్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ భూములపై కోర్టులో కేసుండగానే సుమారు 115 ఎకరాలు చేతులు మారడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 78 ఎకరాల భూమిపై పట్టాలను సంబంధం లేని వారికి ఇచ్చారని వివరించారు. వాస్తవ సాగుదారులకు పట్టాలివ్వకుండా కొందరు బినామీల పేర్లపై పట్టాలివ్వడంతో స్థానిక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీనిపై సమగ్ర విచారణజరిపించాలని వారు డిమాండ్ చేశారు.

‘హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం ఉండొద్దు’



తితిదే లడ్డూ వివాదంలో న్యాయ విచారణ జరిపించాలంటూ ప్లకార్డులతో ప్రదర్శన

కాటేదాన్, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం ఉండరాదని, తిరుపతి లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని వీహెచ్‌పీ నగర ఉపాధ్యక్షుడు స్వామి దుర్గానంద పూరి, బజరంగ్‌దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముకేష్ యాదవ్, మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం ఆరాంఘర్ చౌరాస్తాలో వీహెచ్‌పీ చేపట్టిన కార్యక్రమంలో వారు ప్రసంగించారు. తిరుమల దేవస్థానంలో అన్యమత ఉద్యోగులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన దేవాలయ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం



ప్రధానోపాధ్యాయుడికి చెక్కు అందజేస్తున్న నరేందర్

మణికొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మణికొండ మున్సిపల్ ఛైర్మన్ కస్తూరి నరేందర్ కోరారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా మణికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి చేయూత అందించేందుకు గీతాంజలి వేదిక స్కూల్ ఎండీ జయకిరణ్ ముందుకు వచ్చారు. ఇందుకు సంబంధించిన రూ.లక్ష చెక్కును ఆయనతో కలిసి కస్తూరి నరేందర్ సోమవారం ప్రధానోపాధ్యాయుడు మంగ్యానాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సమస్య తీరాలంటే ఉపకేంద్రం అనివార్యం

అత్తాపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారుల ప్రయత్నం

● స్థలం కేటాయించాలని విన్నపాలు

అత్తాపూర్, న్యూస్‌టుడే: అత్తాపూర్ పరిధిలో విద్యుత్ సమస్యలు పరిష్కారం కావాలంటే కొత్తగా ఉపకేంద్రం (సబ్‌స్టేషన్) ఏర్పాటు అనివార్యంగా మారింది. విద్యుత్ సరఫరాకు సంబంధించి సమస్యలు అధికం అవుతుండటంతో కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. హైదర్‌గూడలో విద్యుత్ ఉపకేంద్రం ఉన్నప్పటికీ గత పదేళ్లలో దాని పరిధిలోని ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందాయి. దీంతో విద్యుత్ కనెక్షన్లు సైతం పెరిగాయి. పెరిగిన డిమాండ్‌కు అనుకూలంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయలేకపోతున్నారు. మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం అధికారులు ఆర్నెల్లుగా ప్రయత్నిస్తున్నారు.

ఎమ్మెల్యేకు అధికారుల వినతి పత్రం

అత్తాపూర్‌లో మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని విద్యుత్ అధికారులు ఇప్పటికే రెవెన్యూ అధికారులకు లేఖ రాశారు. వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. సిరిమల్లెకాలనీ, వెంకటేశ్వరాకాలనీ తదితర చోట్ల పార్కు స్థలాల్లో 600 గజాలు కేటాయించాలని ఇటీవల జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు సైతం విన్నవించారు. కాలనీవాసులతో చర్చించి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సహకరించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు కూడా ఇటీవల వినతి పత్రం అందజేశారు. సమస్య తీవ్రతను సైతం వివరించారు. సహకరిస్తానని వారికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో చర్చించనున్నట్లు తెలిపారు.

సబ్‌స్టేషన్ ఏర్పడినప్పుడు కనెక్షన్లు	4వేలు
ప్రస్తుతం ఉన్న కనెక్షన్లు	25వేలు
సబ్‌స్టేషన్ ఏర్పడినప్పుడు ఫీడర్ల లోడ్	175 యూనిట్లు
ఫీడర్లపై ప్రస్తుత విద్యుత్ లోడ్	600 యూనిట్లు
సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కావాల్సిన స్థలం	600 గజాలు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఏడీఈ వెంకటేష్‌గౌడ్, ఏఈ సత్యనారాయణగౌడ్ (పాత చిత్రం)

వేసవిలో సమస్య మరింత తీవ్రం

హైదర్‌గూడ, సిరిమల్లెకాలనీ, కేశవ్‌నగర్, రాధకృష్ణనగర్, లక్ష్మీనగర్, కాంతారెడ్డి, అత్తాపూర్ తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం విద్యుత్ సరఫరాపై అనేక ఫిర్యాదులున్నాయి. ఏదైనా సమస్య ఏర్పడితే పరిష్కరించడానికి అధికారులు చాలా సమయం తీసుకుంటున్నారు. సబ్‌స్టేషన్ పరిధి పెద్దదిగా ఉన్న కారణంగానే సమస్య ఎక్కడున్నది గుర్తించడం కష్టంగా మారుతోందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడినప్పుడు, గాలులు వీచినప్పుడు విద్యుత్ తీగల్లో తరచూ సమస్యలు ఏర్పడి సరఫరా నిలిచిపోతుంది. ఇక వేసవిలో డిమాండ్ భారీగా పెరుగుతోంది. అప్పుడు విద్యుత్ సరఫరాలో మరిన్ని ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. సాధ్యమైనంత త్వరగా స్థలం కేటాయిస్తే సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలం కేటాయించేలా చూడాలని వారు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్:	8008573330
శంకర్‌పల్లి :	8008573266
షాద్‌నగర్:	8008573907
శంషాబాద్:	9963096353

శంషాబాద్, చేవెళ్ల, న్యూస్‌టుడే:

? శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండ- నాగారం ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారింది. అడుగుకుపైగా లోతు గోతులుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. –దామోదర్‌నాయుడు, నాగారం

✓ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరిస్తున్నాం. పెద్దగోల్కొండ-నాగారం రహదారి మరమ్మతుల కోసం నిధులు మంజూరు అయ్యాయి. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం. –విజయ్, సహాయ ఇంజినీర్–ఆర్‌అండ్‌బీ

? కేజీబీవీ పాఠశాలకు అర్ధరాత్రి కరెంటు సరఫరా నిలిచిపోతోంది. మరుసటి రోజు వరకు సరఫరా పునరుద్ధరించకపోవడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇలా రెండు వారాల వ్యవధిలో నాలుగు సార్లు జరిగింది. –శ్వేత, కేజీబీవీ ప్రిన్సిపల్, చేవెళ్ల

✓ సమస్య ఎక్కడ ఉందో గుర్తించి రెండుమూడు రోజుల్లో పరిష్కరిస్తాం. –స్వామి, విద్యుత్‌శాఖ ఏడీఈ

గండిపేట ఎంఈవోగా విజయకుమార్



నార్సింగి: గండిపేట మండల విద్యాశాఖ అధికారిగా నార్సింగి జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్ (అదనపు బాధ్యతలు) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం ఆయన ఎంఈవోగా బాధ్యతలు చేపట్టారు. మండల నోడల్ అధికారిగా రెండేళ్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన ఇటీవల జిల్లాస్థాయి ఉత్తమ నోడల్ అధికారిగా అవార్డు అందుకున్నారు.

ఎస్టీఎఫ్ చేవెళ్ల నూతన కార్యవర్గం ఎన్నిక

చేవెళ్ల: స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ చేవెళ్ల మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జనార్దన్‌చారి, గోపాల్ తెలిపారు. మండల శాఖ గౌరవాధ్యక్షుడిగా కుమార్, అధ్యక్షుడిగా జి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా ఆంజనేయులు, సి.శ్రీనివాస్, కోశాధికారిగా గురురాజశేఖర్, మహిళా అధ్యక్షురాలిగా అనసూయను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రాంచంద్రయ్య, లక్ష్మీనారాయణ, రమేష్, సంతోష్, సుధాకర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

సర్కారు బడుల అభివృద్ధికి సహకరించాలి

షాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని అంతారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్ గౌడ్ అన్నారు. సోమవారం గ్రామానికి చెందిన ఈగ మహిపాల్‌రెడ్డి తన మనవరాలు జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నోటుపుస్తకాలు, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి: వీర్లపల్లి

షాద్‌నగర్, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలని మిషన్‌భగీరథ అధికారులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. షాద్‌నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం గ్రామీణ మంచినీటి సహాయకులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మిషన్‌భగీరథ అధికారులతో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పథకం నిర్వహణ, వ్యవహారాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, పథకం నిర్వహణలో ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ ఎస్సీ ఆంజనేయులు,. ఈఈ రాజేశ్వర్, డీఈ అబ్దుల్‌బారి, సందీప్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

షాద్‌నగర్ న్యూటౌన్: ఆరోగ్యం, క్రమశిక్షణను ఇచ్చే క్రీడలపై పాఠశాల స్థాయి నుంచే ఆసక్తి పెంచుకుని ఎంచుకున్న క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. షాద్‌నగర్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ తదితర క్రీడలకు తాలుకా స్థాయి క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలకు ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్‌రాథోడ్, ఎస్‌జీఎఫ్ తాలుకా కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, బాబర్‌ఖాన్, ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

★ కళాశాల స్థాయిలో విద్యార్థులు రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విరివిగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తూ అందులో యువతను కళాశాల యాజమాన్యం, సంస్థల కృషి అనిర్వచనీయమన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ్, భవశంకర్, డీవీఎన్.స్వామి, కరుణాకర్, మనోహర్ రెడ్డి, రఘు, లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణ సక్రమంగా చేస్తే సమాజంలో మంచి గుర్తింపు



శ్రీధర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ నాగపూర్ణ, అధికారులు

నార్సింగి: ఉద్యోగులు తమ విధి నిర్వహణ సక్రమంగా చేస్తే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని నార్సింగి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. నార్సింగి మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళికా విభాగం ఏసీపీగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన శ్రీధర్‌గౌడ్‌ను సోమవారం ఆమెతో పాటు అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. శ్రీధర్‌గౌడ్ నార్సింగి మున్సిపాలిటీలో దాదాపు ఐదేళ్లు పనిచేశారు. కార్యక్రమంలో కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, టీపీఎస్ మణిహారిక, డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్, మేనేజరు యోగేష్ పాల్గొన్నారు.

సామాజిక సేవతో జీవితంలో సంతృప్తి



చీరలు పంపిణీ చేస్తున్న స్వామీజీలు

కేశంపేట, న్యూస్‌టుడే: సామాజిక సేవతో మనిషికి ఎంతో సంతృప్తి కలుగుతుందని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. వృత్తి ఏదైనా ప్రవృత్తి సేవచేయడం అలవాటు చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. సోమవారం కొత్తపేటలో బీజేవైఎం మండల అధ్యక్షుడు పాలాది శ్రీనివాస్ తన సొంత ఖర్చుతో దసరా కానుకగా మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ చేపట్టారు. దీనికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. సొంత గ్రామానికి సేవలందిస్తున్న శ్రీనివాస్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను అభినందించారు. ప్రతిఒక్కరు సమాజంలోని పేదలకు ఏదో ఒక రూపంలో సేవ చేయాలని కోరారు. స్వామీజీలు దయానంద సరస్వతి, యోగేశ్వర్ మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో భాజపా నాయకులు అందె బాబయ్య, రఘురాంగౌడ్, శ్రీనివాసులు, వెంకటేశం, విఠల్ గౌడ్, ఐలయ్య, నర్సింహ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో రైతులకు లాకర్ల సౌకర్యం



పంట రుణాలు మంజూరైన రైతులకు చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కొత్తూరు: రైతుల సౌకర్యార్థం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోనూ లాకర్ల సదుపాయం కల్పించనున్నట్లు మేకగూడ పీఏసీఎస్ కార్యదర్శి వినయ్ కుమార్ తెలిపారు. సంఘం కార్యాలయంలో సోమవారం కొత్తూరు, నందిగామ మండలాల మహాజన సభను వైస్ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి రూ.2.20 కోట్ల బడ్జెట్ అంచనా వేశారు. ఈ ఏడాది నుంచి సంఘంలో తక్కువ మొత్తానికే రైతులకు లాకర్ సదుపాయం, బంగారంపై రుణాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ చల్లా సరస్వతి, భీమయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గురువులకు ఆత్మీయ వీడ్కోలు

కొందుర్గు, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలు మరువజాలమని మండల మాజీ ఉపాధ్యక్షుడు రాజేశ్ పటేల్ అన్నారు. సోమవారం బాలుర ప్రాథమిక పాఠశాల నుంచి పదోన్నతి, బదిలీలపై వెళ్తున్న రత్నమాల, లక్ష్మీదేవి, వరప్రసాద్, అప్పల రాజులకు హెచ్‌ఎం రాధకృష్ణ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గాయత్రిదేవి, పూర్వ ఎంఈవో కిష్టారెడ్డి, గోపీనాథ్, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, ప్రభులింగం తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మినా, కొనుగోలు చేసినా జరిమానా



కిషన్‌నగర్ గ్రామ కూడలిలో ఏర్పాటు చేస్తున్న తీర్మానాల ఫ్లెక్సీ

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: గ్రామంలో ఎవరైనా మద్యం అమ్మితే రూ.50 వేల జరిమానా.. కొనుగోలు చేసినా రూ.25 వేల జరిమానా... క్రయవిక్రయాలను ఎవరైనా పట్టుకుంటే రూ.10 వేల నజరానా.. అంటూ ఫరూక్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామస్థులు తీర్మానం చేశారు. గ్రామంలో కఠినంగా మద్యనిషేధం అమలు చేయాలన్న దృఢ సంకల్పంతో ఈ విధంగా నిర్ణయించారు. అంతే కాకుండా ఆ తీర్మానాలను ఫ్లెక్సీల రూపంలో గ్రామంలోని కూడళ్లల్లో ఏర్పాటు చేశారు. గ్రామంలో యువత మద్యానికి బానిస కాకుండా, కూలీలు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకే ఇలా చేస్తున్నామని కిషన్‌నగర్ గ్రామస్థులు వివరించారు.

చేవెళ్ల డివిజన్‌లో ఓటర్లు 2,07,249

తుది జాబితా ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల సంఘం

చేవెళ్ల, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా ముసాయిదా జాబితా ప్రకటించి సూచనలు, సలహాల అనంతరం తుది ఓటరు జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల వెలువరించింది. చేవెళ్ల రెవెన్యూ డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల పరిధిలో 132 గ్రామ పంచాయతీలుండగా ఇటీవల శంకర్‌పల్లి మండల పరిధిలోని మిర్జాగూడ గ్రామ పంచాయతీని గండిపేట మండలంలోని నార్సింగి మున్సిపాలిటీలో విలీనం చేయడంతో వాటి సంఖ్య 131కి తగ్గింది. మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే గ్రామాలను మినహాయించి ఇతర గ్రామాల ఓటరు జాబితాను వెలువరించారు. చేవెళ్ల డివిజన్ వ్యాప్తంగా 2,07,249 మంది ఓటర్లుండగా వారిలో పురుషులు 1,04,212, మహిళలు 1,03,031 కాగా ఇతరులు ఆరుగురున్నారు.

రిజర్వేషన్లపై రాని స్పష్టత: పంచాయతీ, ప్రాదేశిక స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లపై అయోమయం నెలకొంది. ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో గత విధానంలో రిజర్వేషన్ల ప్రక్రియను సిద్ధం చేసి ఉంచారు. గత ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న పంచాయతీ, ప్రాదేశిక స్థానాల రిజర్వేషన్లు పదేళ్లు వర్తించేలా చట్టం రూపొందించి అమలు చేసింది. దాన్ని రద్దు చేసి కొత్తగా రిజర్వేషన్ల ప్రక్రియ చేపడతారా? లేక పాత పద్ధతిని పాటించి ఎన్నికలు నిర్వహిస్తారా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. బీసీ రిజర్వేషన్ల ప్రక్రియకు సంబంధించి ఆదేశాలు వస్తే ఎన్నికల పనులు మరింత ఊపందుకుంటాయి.

డివిజన్ పరిధిలో ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
చేవెళ్ల	29,200	29,097	02	58,299
షాబాద్	24,313	23,740	01	48,054
మొయినాబాద్	30,613	29,880	02	60,495
శంకర్‌పల్లి	20,086	20,314	01	40,401



చేవెళ్ల రెవెన్యూ డివిజన్ పటం

బాహ్యవలయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

రెయిలింగ్‌ను ఢీకొట్టడంతో కారు డ్రైవింగ్ సీటు నుంచి బయటపడి వైద్యుడు మృతి



ధ్వంసమైన కారు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: బాహ్యవలయ రహదారిపై ఎగ్జిట్ నంబర్ 17 వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారు డ్రైవింగ్ చేస్తున్న వైద్యుడు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్‌కు చెందిన కంటి వైద్యుడు నిలయరెడ్డి(29) ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లడానికి సొంతకారులో డ్రైవింగ్ చేస్తూ ఆయన బయల్దేరారు. 4.30 గంటలకు రాజేంద్రనగర్ ఠాణా పరిధిలోని ఎగ్జిట్ నంబర్ 17 వద్ద అతివేగంగా ప్రయాణిస్తూ రోడ్డు పక్కన రెయిలింగ్‌ను ఢీకొనడంతో కారు గుండ్రంగా మూడు చుట్లు తిరిగింది. ఈ క్రమంలో వాహనం ముందు అద్దాల నుంచి వైద్యుడు బయటపడడంతో రెయిలింగ్‌ను ఢీకొని తీవ్రగాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది.

‘ప్రజా సంక్షేమానికి భాజపా కృషి’

జిల్లేడు చౌదరిగూడెం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం కోసం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చి అట్టడుగు స్థాయి ప్రజల వరకు చేరేలా కృషి చేస్తుందని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాల్‌చారి అన్నారు. సోమవారం పెద్ద ఎల్కిచర్లలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. దేవాలయాల్లో ప్రసాదం కల్తీ జరిగిన అంశంలో కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహులు, ఆంజనేయులు, కృష్ణయ్య,జంగయ్య, సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి వెండి మకరతోరణాల బహూకరణ



ఆర్యవైశ్య సంఘం నాయకులకు అందజేస్తున్న ఆకుల అరుణవెంకటేశం దంపతులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: షాద్‌నగర్‌లోని కన్యకాపరమేశ్వరి దేవాలయానికి పట్టణానికి చెందిన ఆకుల అరుణవెంకటేశం దంపతులు వెండి మకరతోరణాలను బహూకరించారు. తన కుమారుడు ఆకుల రాఘవేందర్ జ్ఞాపకార్థం ఆలయ అంతరాలయంలోని లక్ష్మీదేవి, వినాయక దేవాలయాలకు రూ.9 లక్షలతో వీటిని చేయించినట్లు దాత వివరించారు. పట్టణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు కల్వ యాదగిరీష్‌కు వీటిని అందించారు. కార్యక్రమంలో మురళి, వెంకటేష్, వజ్రలింగం, గోపాలకృష్ణ, చంద్రశేఖర్, రామ్మోహన్, వినోద్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలి

శంషాబాద్: పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే భవిష్యత్తు తరాల మనుగడ సాఫీగా సాగుతుందని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ పేర్కొన్నారు. అనంత కోటి వృక్షమహోత్సవంలో భాగంగా సోమవారం శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రవీణ్, సుధాకర్, ప్రకాష్, వికాస్, మహేశ్వరి, రూపాలిసింగ్, నిఖిత పాల్గొన్నారు.


ఆనందంగా గంధం మహోత్సవం



కొందుర్గు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని హజ్రత్ షాలీబాబా దర్గాలో సోమవారం గంధోత్సవం నిర్వహించారు. మౌసమ్ రషీద్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ప్రార్థనలో భారాస నాయకుడు రాజేశ్ పటేల్, నషీర్, షుకూర్ తదితరులు పాల్గొని బాబా ఆశీస్సులు పొందారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

చేవెళ్ల, షాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకైన బతుకమ్మ సంబరాలు సోమవారం షాబాద్‌లో ప్రారంభమయ్యాయి. స్థానిక సీతారామాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో మహిళలు తీరొక్కపూలతో బతుకమ్మలను అలంకరించుకుని వచ్చి వాటి చుట్టూ ఆడి పాడారు. చేవెళ్లలోని వివేకానంద ఇంటర్నేషనల్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పలు రకాల పూలతో బతుకమ్మలను పేర్చి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి కోనేరులో వాటిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ నరేష్, ప్రిన్సిపల్ ప్రియాన్షి, కె.వి లావణ్య, మౌనిక, వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల వివేకానంద పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు



షాబాద్‌లో మహిళల సంబురాలు

ఎస్‌జీఎఫ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొందుర్గు: 16వ స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) షాద్‌నగర్ జోనల్ స్థాయిలో కొందుర్గు మండల విద్యార్థులు ప్రతిభ చాటారని వ్యాయామ ఉపాధ్యాయుడు స్వాములు తెలిపారు. అండర్ 17 విభాగంలో వాలీబాల్, ఖోఖో ప్రథమ, కబడ్డీ ద్వితీయ, అండర్14 బాలికల విభాగంలో వాలీబాల్ ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారన్నారు. విద్యార్థులను ఎంఈవో గాయత్రిదేవి, పీఈటీలు బాలాజీ, వినోద్, అనిల్, గోపి, బాలమణి అభినందించారు.

పోషకాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీవో సుమతి

కొత్తూరు: ఆహారంలో పోషక విలువలపై కనీస అవగాహన కలిగి ఉండాలని నందిగామ ఎంపీడీవో సుమతి అన్నారు. నందిగామ, కొత్తూరు మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార లోపంతో చిన్నారుల్లో ఏర్పడే రక్త హీనత, ఎదుగుదల లోపించడం, అనారోగ్య సమస్యలపై అవగాన కల్పించారు. కార్యక్రమంలో నందిగామ తహసీల్దార్ రాజేశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, రేవతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలివ్వాలని ర్యాలీ



కాటేదాన్, న్యూస్‌టుడే: అన్ని రంగాల్లోని కార్మికులకు రూ.26 వేల కనీస వేతనమివ్వడంతో పాటు 12 గంటల పనివేళలను తగ్గించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికశాఖ కార్యాలయం ముట్టడిలో భాగంగా సోమవారం రాజేంద్రనగర్ మండలం భవన నిర్మాణ కార్మికులు, కాటేదాన్ క్లస్టర్ సిఐటీయూ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. దీన్ని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అలీ దేవేందర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో స్వామి, వెంకటయ్య, భాస్కర్, ముజీబ్‌ఖాన్, తోఫిక్, నరేష్, అక్రమ్, శివ, హైమావతి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’కి 155 ఫిర్యాదులు

ఈనాడు, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 155 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ ఆమ్రపాలి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర కార్యాలయంలో చేపట్టిన కార్యక్రమంలో ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్న ఆమె.. ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు తీసుకున్నారు.

వివాహిత అదృశ్యం

శంషాబాద్: మండల పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 27న రాత్రి కుటుంబ విషయంలో దంపతులు గొడవ పడ్డారు. ఉదయం ఎప్పటిలా భర్త పనులకు వెళ్లొచ్చేసరికి ఇంటి వద్ద తన భార్య కనిపించలేదు. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ దొరకలేదు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహేశ్వరం

•మహేశ్వరం • ఇబ్రహీంపట్నం • కల్వకుర్తి

రహదారి శిథిలం.. ప్రయాణం నరకం



యాచారం నుంచి మేడిపల్లి వెళ్లే రహదారి అడుగడుగునా శిథిలమైంది. అయిదు కిలో మీటర్ల మేర రోడ్డు దెబ్బతిని అధ్వానంగా మారడంతో నిత్యం నరక యాతన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, యాచారం

మురుగు.. పరుగు



ఎన్టీఆర్ నగర్ నుంచి హరిపురి కాలనీ వెళ్లే మార్గంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో మ్యాన్‌హోల్ లీకై మురుగు పొంగుతోంది. దీనికి తోడు నివాసాల నుంచి వచ్చే వ్యర్థాలతో ప్రధాన రహదారి చెరువును తలపిస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు వాపోతున్నారు.
– న్యూస్‌టుడే, ఆర్కేపురం

దసరా ఉత్సవాలకు ఆహ్వానం

ఆమనగల్లు, న్యూస్‌టుడే: ఆమనగల్లులో కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని ఆర్యవైశ్య సంఘం నాయకులు కోరారు. సోమవారం వారికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో బికుమాండ్ల రమేష్‌గుప్తా, నర్సింహగుప్తా, రామ్మోహన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మూడో బెటాలియన్‌లో క్రీడల పోటీలు



ఇబ్రహీంపట్నంలో స్పోర్ట్స్‌మీట్‌లో బంతి వేస్తున్న కమాండెంట్ సయ్యద్ జమీల్ పాషా

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో మూడో బెటాలియన్ పోలీస్ కానిస్టేబుల్స్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ పాషా.. జ్యోతి వెలిగించి క్రీడల పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయసాధనకు కృషి చేస్తాం

మీర్‌పేట, న్యూస్‌టుడే: సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి ఆశయసాధనకు కృషి చేయడమే ఆయనకు మనమిచ్చే నివాళి అని వక్తలు పేర్కొన్నారు. మీర్‌పేటలో సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు జి.రాములు, వృత్తి సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.యాదగిరిచారి, మండల సీపీఐ మండల కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డి, సీపీఎం సీనియర్ నాయకుడు దాసరి బాబు, అరవింద్‌శర్మ తదితరులు.. సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, బహుజన సంఘం నాయకుడు రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి చర్యలు

సరూర్‌నగర్, న్యూస్‌టుడే: జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) పని చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కొత్తపేటలోని బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌లో సోమవారం టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జర్నలిస్టు ఇంటి స్థలాల దరఖాస్తు పత్రాలను ఆవిష్కరించారు. విలేకరుల వివరాలను మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కటకం సుభాష్, కోశాధికారి సంరెడ్డి శశిపాల్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై పర్యవేక్షణ షురూ

◆ ఎట్టకేలకు ఎంఈవోల భర్తీ
◆ బాధ్యతలు స్వీకరించిన అధికారులు



మహేశ్వరం ఎంఈవో కృష్ణానాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మహేశ్వరం, న్యూస్‌టుడే: విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఇప్పటికే పాఠశాలలకు ఉచిత విద్యుత్తు సౌకర్యం ప్రకటించింది. బడులపై పర్యవేక్షణ తగ్గి విద్యా వ్యవస్థ కుంటుపడిందని గుర్తించిన సర్కారు.. ఎట్టకేలకు ఈ పరిస్థితులను చక్కబెడుతోంది. ప్రతి మండలానికి ఎంఈవోలను నియమించింది. ఆయా మండలాల్లో పనిచేసే సీనియర్ గెజిటెడ్ హెచ్‌ఎంలను పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వీరంతా బాధ్యతలు స్వీకరించారు.

రోజుకు రెండు పాఠశాలల తనిఖీ..

మండలంలోని ఉపాధ్యాయుల వేతనాలకు సంబంధించిన రికార్డులను ఎంఈవోలు సిద్ధం చేస్తారు. ప్రతి పాఠశాలను సందర్శించి కార్యక్రమాల అమలు తీరుపై ఆరా తీస్తారు. ఉపాధ్యాయులకు వివిధ శిక్షణ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిస్తారు.

◆ సర్కారు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో పాటు ఏకరూప దుస్తులు, పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనం అమలు తీరు పరిశీలిస్తారు.

◆ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించడంతో పాటు పాఠశాలల్లో రికార్డులను తనిఖీ చేస్తారు.

◆ స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించేలా ప్రోత్సహిస్తారు.

◆ మండల పరిషత్ సమావేశాలకు, స్టాండింగ్ కమిటీ సమావేశాలకు హాజరై ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తారు.

◆ ఎస్ఎంసీ సమావేశాలకు హాజరు కావడంతో పాటు ప్రతినెల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేస్తారు.

◆ క్లస్టర్ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను సేకరిస్తారు.

◆ పాఠశాలల గ్రాంట్ల వినియోగంతో పాటు రికార్డుల నిర్వహణ, ఉపాధ్యాయుల సెలవు వివరాలు తదితర దస్త్రాలను పరిశీలిస్తారు. మండల విద్యాధికారులు రోజుకు రెండు పాఠశాలల చొప్పున నెలకు 20 చోట్ల తనిఖీలు చేపట్టాలి.


◆ ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థులు ఎలా చదువుతున్నారో అడిగి తెలుసుకుంటారు. పిల్లలు ఎక్కడ వెనకబడ్డారో నివేదికలు తయారు చేయించి ఉన్నతాధికారులకు పంపిస్తారు.

రంగారెడ్డి జిల్లా సమాచారం

విభాగం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	880	49,407
ప్రాథమికోన్నత	180	14,004
ఉన్నత	250	62,878

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలి

– సుశీందర్‌రావు, జిల్లా విద్యాధికారి



అన్ని మండలాలకు ఎంఈవో(ఎఫ్ఏసీ)లను నియమించాం. కొన్నేళ్ల నుంచి మూడు, నాలుగు మండలాలకు ఒకరే ఉన్నారు. చాలా ఇబ్బందులు పడేవారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోలు.. ఇక నుంచి అన్ని పాఠశాలలను పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూస్తారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

ఆర్కేపురం, కందుకూరు, మీర్‌పేట న్యూస్‌టుడే:

? అల్కాపురి కాలనీలో దోమల బెడద ఎక్కువగా ఉంది.
– రమాదేవి, అల్కాపురి కాలనీ

✓ వెంటనే ఫాగింగ్ చేయిస్తాం. –సుజాత, సరూర్‌నగర్ డీసీ

? తుమ్మలూరు గేట్ సమీపంలో ఓ హోటల్ వద్ద మురుగునీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. –శ్రీనివాస్, కందుకూరు

✓ సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం.– గంగాధర్, ఏఈ

? మీర్‌పేట తిరుమలహిల్స్‌కాలనీలో రోడ్డుపై వ్యర్థాలు వేస్తున్నారు. చెత్త పేరుకుపోయింది. – ఎస్.ప్రసాద్, రాఘవేంద్రనగర్, మీర్‌పేట

✓ వ్యర్థాలను తొలగిస్తాం. అక్కడ వేయకుండా చర్యలు తీసుకుంటాం.
– దుర్గదీప్‌లాల్, మేయర్, మీర్‌పేట

కేఎల్ఆర్‌కు మార్కెట్ కమిటీ సత్కారం



మహేశ్వరం, న్యూస్‌టుడే: గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డితో పాటు డైరక్టర్లు.. సోమవారం మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, దేప భాస్కర్‌రెడ్డిని తుక్కుగూడలో సత్కరించారు. కార్యక్రమంలో డైరక్టర్లు మధుసూదన్‌రావు, గోవర్దన్‌రెడ్డి, వెంకటేశ్‌గుప్తా, మచ్చేందర్‌రెడ్డి నాయకులు గణేశ్, ఉపేందర్‌రెడ్డి, రవీంద్ర, సైదులు, శివ పాల్గొన్నారు.


3 నుంచి ప్రత్యంగిరా దేవి శరన్నవరాత్రులు



ఆర్కేపురంలో కరపత్రాలు విడుదల చేస్తున్న మునిపల్లె శ్రీనివాస్

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆర్కేపురంలోని కుర్తాళం పీఠానికి చెందిన ప్రత్యంగిరా దేవి శరన్నవరాత్రులు అక్టోబర్ 3వ తేదీ నుంచి 12 వరకు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. దీనికి సంబంధించిన సోమవారం ఆలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరాత్రులలో ప్రతిరోజు ఉదయం 6-30కి విశేష అభిషేకం, ఉ 10-30కి మహిళలతో కుంకుమార్చన సేవ, సా. 6-00కి అమ్మవారి ప్రత్యేక అలంకరణ దర్శనం, లలితా, విష్ణు సహస్రనామ పారాయణం, భక్తి సంగీతం, రా. 8-00లకు మహా నక్షత్ర హారతి సేవ.. తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అక్టోబర్ 12న శనివారం సాయంత్రం 6-00 గంటలకు శమీపూజ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో విఠల్ శర్మ, అరుణ, హేమంత్ శర్మ, రామశర్మ, అశ్వంత్, సంతోషి, హేమ, పద్మలక్ష్మి, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

మోత్యానాయక్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు



మైసిగండిలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, న్యూస్‌టుడే: కాంగ్రెస్‌పార్టీ నాయకుడు దీపావత్ మోత్యానాయక్ (48) మృతి.. కాంగ్రెస్‌పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్ మాజీ ఎంపీపీ దీపావత్ కమ్లీ భర్త మోత్యానాయక్ అనారోగ్యంతో శనివారం మృతిచెందిన విషయం తెలిసిందే. మైసిగండిలో సోమవారం మోత్యానాయక్ సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, ఆమనగల్లు మాజీ ఎంపీపీ అనిత, వివిధ గ్రామాల నాయకులు పాల్గొని నివాళి అర్పించారు.

తలకొండపల్లి, న్యూస్‌టుడే: వీరన్నపల్లి గ్రామానికి చెందిన బెక్కరి సుప్రీత్‌రెడ్డి మృతికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సంతాపం తెలిపారు. సోమవారం సుప్రీత్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు.

'హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చొద్దు'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చొద్దని భారాస జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోరారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటీవల హైడ్రా అధికారులు ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును పరిశీలించారని గుర్తుచేశారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు, తుర్కయంజాల్‌లోని మాసబ్‌చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొంతమంది పేదలు తెలియక ఇళ్లు నిర్మించుకున్నందున వారిని వదిలేయాలన్నారు. ఈ రెండు చెరువులు రెండేళ్ల కిందట పూర్తిస్థాయిలో నిండినా.. ఆ ఇళ్లు మునిగిపోలేదని గుర్తు చేశారు.

ఉత్సాహంగా వృద్ధుల దినోత్సవం

మహేశ్వరం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ ఆధ్వర్యంలో సోమవారం రావిరాల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వృద్ధ జంటలను సత్కరించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సూపర్‌వైజర్ విద్యావతి, వైద్యాధికారి తేజశ్విని, ప్రధానోపాధ్యాయురాలు హరితారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ రాజు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఫాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో ఎల్మినేడు గ్రామంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజుతో పాటు సీఐ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంఖాల శేఖర్‌రెడ్డి మాట్లాడారు. జాబ్‌మేళాలో 50మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఫాక్స్‌కాన్ జీఎం మురళి పాల్గొన్నారు.

లాభాల బాటలో సహకార సంఘం

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: రైతులకు మెరుగైన సేవలందిస్తున్న బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఆగస్టు నాటికి రూ.2.95 కోట్ల నికర లాభం ఆర్జించిందని అధ్యక్షుడు చేగూరి భరత్‌కుమార్ వివరించారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యుల రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు, పంట రుణాలు ఎకరాకు రూ.42 వేలు ఇస్తామన్నారు. గ్రామానికో ఆదర్శ సభ్యులను సన్మానించారు. మేనేజర్ ఐలేష్ సంఘం పరిపాలన నివేదికను సభకు వివరించారు. ఉపాధ్యక్షురాలు నార్లకొండ మల్లమ్మ, సహాయ రిజిస్ట్రార్, పరిశీలకుడు రవికుమార్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

బాలాపూర్, న్యూస్‌టుడే: ప్రధాన రహదారుల్లో రాకపోకలు అధికంగా ఉంటాయని, ఈ నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత తెలిపారు. నాదర్‌గుల్‌లో చేపట్టిన రహదారి విస్తరణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఇందిరానగర్‌లో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ జి.రఘు, డీఈ యాదయ్య, కార్పొరేటర్లు టి.శ్రీధర్‌రెడ్డి, ఎన్.సునీత, జి.ఇంద్రసేన, బి.రోహిణి, ఏఈ వినీల్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లిస్తే కొత్త రుణాలు

యాచారం: రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాల బకాయిలు వెంటనే చెల్లిస్తే.. కొత్తవారికి అప్పులు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని యాచారం పీఏసీఎస్ ఛైర్మన్ రాజేందర్‌రెడ్డి కోరారు. యాచారం సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. సంఘం పరిస్థితిని రైతులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏవో రవినాథ్, సీఈఓ నాగరాజు, వైస్‌ఛైర్మన్ యాదయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆదిభట్ల: తమ దృష్టికొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. సోమవారం కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 78 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, డీఆర్డీఓ శ్రీలత, పాల్గొన్నారు.

ఆవిష్కరణలపై దృష్టి పెట్టండి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థులు మంచి ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఓయూ మాజీ వైస్‌ఛాన్స్‌లర్, ప్రొఫెసర్ సత్యనారాయణ సూచించారు. సోమవారం ఇబ్రహీంపట్నం వినోభానగర్‌లోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ప్రదీప్‌కుమార్, డైరెక్టర్లు ఈశ్వర్ ప్రసాద్, భగత్, ప్రిన్సిపల్ శేఖర్‌బాబు, వైస్‌ప్రిన్సిపల్ సుబ్బారావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

మంచాల, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి సహకార సంఘాలు కృషి చేస్తాయని డీసీపీబీ ఛైర్మన్ కొత్తకురుమ సత్తయ్య తెలిపారు. సోమవారం మంచాలలో మంచాల సహకార సంఘం ఛైర్మన్ హనుమంతురెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సత్తయ్య మాట్లాడారు. రైతులు త్వరగా బకాయిలు చెల్లిస్తే కొత్త రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. సంఘం ఇప్పటివరకు సాధించిన ప్రగతిని రైతులకు వివరించారు. సమావేశంలో సీఈఓ శ్రీనివాస్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

దోషులకు శిక్ష తప్పదు



ఇబ్రహీంపట్నంలో నిరసన తెలుపుతున్న విశ్వహిందూ పరిషత్, భాజపా నాయకులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూను అపవిత్రం చేసిన వారిని దేవుడే శిక్షిస్తాడని విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ విభాగ్ ప్రముఖ్ శ్రీరాం, జిల్లా అధ్యక్షుడు సౌకుంట్ల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఓం చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు సతీష్, దుర్గవాహిని, మాదవి, రాజేశ్వర్, రాజేందర్, రమేష్, శివ, బూడిద నర్సింహరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు పసునూరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

తితిదే కల్తీ లడ్డూ దోషులను శిక్షించాలి

సరూర్‌నగర్, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ పవిత్రను దెబ్బతీసిన దోషులను వెంటనే శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ వివేకానంద జిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తపేట కూడలిలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, విశ్వహిందూ పరిషత్ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ పాల్గొన్నారు.

సందడిగా బతుకమ్మ సంబురాలు



మహేశ్వరంలో బతుకమ్మలతో విద్యార్థులు, అధ్యాపకులు

మహేశ్వరం, న్యూస్‌టుడే: బతుకమ్మ వేడుకలను సోమవారం మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మ, ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. బతుకమ్మలను అందంగా అలంకరించిన వారికి ఇంఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ చందన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నర్సింహులు, శ్రీదేవి, జహిదాబేగం, శ్రీహరిరెడ్డి, దయానంద్, నరేందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ ఏబీవీపీ మహేశ్వరం మండల శాఖ ఆధ్వర్యంలో గడికోట మైదానంలో బతుకమ్మ సంబురాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీరామ్, శివకృష్ణ, శ్రీనివాస్, రాజేశ్, రాఘవేంద్ర, వంశీ, ప్రణీత్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



కందుకూరులో ఎంపీడీఓ సరితకు జ్ఞాపిక అందజేస్తున్న విద్యార్థులు

కందుకూరు, న్యూస్‌టుడే: క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని కందుకూరు ఎంపీడీఓ సరిత అన్నారు. ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి కబడ్డీ అండర్-14, 17 బాలుర, బాలిక పోటీలను సోమవారం కందుకూరులోని చైతన్య పాఠశాల ప్రాంగణం సమీపంలో ఎంపీడీఓ సరిత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహ, పీఈటీ సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, జోనల్ కార్యదర్శి రవికుమార్, మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు, న్యూస్‌టుడే: వాలీబాల్‌లో ప్రతిభ చూపిన పులిమామిడి ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, పీడీ స్వామి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, బుచ్చయ్యగుప్తా, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



రావిచెడ్ ఉన్నత పాఠశాలలో..

ఆమనగల్లు, కడ్తాల్, న్యూస్‌టుడే: కడ్తాల్ మండలం రావిచెడ్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీలు నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14, 17 బాలుర, బాలికల విభాగాల్లో తలకొండపల్లి క్రీడాకారులు మొదటిస్థానం, కడ్తాల్ క్రీడాకారులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ గోపాల్, పీఏసీఎస్ డైరక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, మహ్మద్ సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

భాజపాతోనే దేశం అభివృద్ధి



కడ్తాల్‌లో సభ్యత్వ నమోదు చేయిస్తున్న భాజపా నేత నరేందర్‌రెడ్డి

కడ్తాల్ (ఆమనగల్లు), న్యూస్‌టుడే: భాజపాతోనే దేశం అభివృద్ధి చెందుతుందని పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి అన్నారు. కడ్తాల్‌లో సోమవారం సభ్యత్వ నమోదు అభియాన్ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాజపా అసెంబ్లీ కోకన్వీనర్ నర్సింహ, నాయకులు రాఘవేందర్ గౌడ్, మహేష్, భగీరథ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సమితి కొత్త కమిటీ ఎన్నిక



బడంగ్‌పేటలో నూతన కమిటీ

బాలాపూర్: బడంగ్‌పేట బ్రాహ్మణ సేవా సమితి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రమాశంకర్ తెలిపారు. నూతన అధ్యక్షుడిగా బి.రామ్మోహన్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.శ్రీరామశర్మ ఎన్నికయ్యారు. వీరిని కమిటీ సభ్యులు సత్కరించారు.

వ్యాపారిని బెదిరించి రూ.8 వేలు దోపిడీ

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: పహాడీషరీఫ్‌లో నివాసం ఉంటున్న ముజీబ్ అహ్మద్(48).. కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై కూరగాయలతో వెళుతున్న అహ్మద్‌ను.. మామిడిపల్లి వద్ద నలుగురు ఆగంతుకులు మాస్కులు ధరించి కత్తితో బెదిరించారు. అతని వద్ద ఉన్న రూ.8వేలు తీసుకొని వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదం ఆడుతున్న ఆరుగురి అరెస్టు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోచమ్మ బస్తీ సమీపంలోని శ్మశాన వాటికలో జూదం ఆడుతున్న ఆరుగురిని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 6 చరవాణులు, రూ.21వేలు స్వాధీనం చేసుకున్నారు.

నందివనపర్తిలో నలుగురు..

యాచారం: యాచారం మండలం నందివనపర్తిలో నలుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.83,740 నగదు, నాలుగు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శంకర్ కుమార్ చెప్పారు.

సంక్షిప్త సమాచారం

గీత కార్మికులకు కిట్ల పంపిణీ

ఆమనగల్లు: గీతా కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్ అందించారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన 75 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై కృష్ణప్రసాద్, బీసీ వెల్ఫేర్ అధికారి మాధవరెడ్డి, రాష్ట్ర కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, కిట్ల శిక్షకులు పాల్గొన్నారు.

బాలాజీ ఆలయంలో బ్రహ్మోత్సవాలు

జల్‌పల్లి: మామిడిపల్లిలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సీఎంఆర్ కాలనీలో దత్తాత్రేయ ఆలయం

బాలాపూర్: అల్మాస్‌గూడ సీఎంఆర్ కాలనీలో దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని నిర్మించనున్నట్లు కాలనీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, నాగ శ్రీనివాస శర్మ తెలిపారు. దత్త జయంతి నాటికి విగ్రహ ప్రతిష్ఠ చేస్తామన్నారు. కార్యక్రమంలో జి.వినోద్‌గుప్తా, నవీన్, మధు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు గొప్పవి

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలం అంతారం గ్రామంలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు గట్టుఇప్పలపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురికి మందులు అందించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో ఆంజనేయులు, సునీత పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

యాచారం: యాచారం మండలం గున్‌గల్ గ్రామానికి ఎంపీ నిధులతో 20 వీధి దీపాలు కేటాయించారు. పంచాయతీ సిబ్బంది సోమవారం స్తంభాలకు దీపాలు అమర్చినట్టు మాజీ వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు దసరా సెలవులు అమలు చేయండి


నరసింహారెడ్డికి వినతి పత్రం ఇస్తూ..

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు దసరా సెలవులు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర కమిటీ సోమవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ (డీఎస్ఈ) ఇ.వి నరసింహారెడ్డికి విన్నవించింది. అనంతరం ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యా శాఖ అక్టోబరు 2 నుంచి 12 వరకు దసరా సెలవులను ప్రకటించిందని, ఆ సెలవులు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకూ వర్తిస్తాయన్నారు. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులకు మాత్రమే సెలవులు ఇచ్చి, ఉపాధ్యాయులకు ఇవ్వడం లేదన్న విషయాన్ని డీఎస్ఈ దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు ఆయన వెంట రాష్ట్ర నాయకుడు సైదులు ఉన్నారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

'ప్రజావాణి'కి 155 ఫిర్యాదులు

ఈనాడు, హైదరాబాద్: జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 155 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ ఆమ్రపాలి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు.

కండర క్షీణత వ్యాధిగ్రస్థులకు సంరక్షకుడి భృతి కల్పించాలి


ర్యాలీలో బాధితులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: కండర క్షీణత వ్యాధి బాధితులు సంరక్షకుడి (కేర్ టేకర్) ఖర్చు భరించలేని స్థితిలో ఉన్నారని, వారికి సంరక్షకుడి భృతి (కేర్ టేకర్ అలవెన్స్) కల్పించాలని తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టీఎండీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్ నుంచి ఖైరతాబాద్ ప్రధాన కూడలికి తమ సమస్యలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెళ్లి, తిరిగి ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 3500 మంది కదల్లేని స్థితిలో నాలుగు గోడల మధ్య బతుకీడుస్తున్నారన్నారు. సంరక్షుడి భృతితో పాటు తీవ్ర వైకల్యం గల వారికి రూ.20వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. టీఎండీఏ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఖాతాలోకి డబ్బులు పంపిస్తానని మోసం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేస్తానంటూ రూ.50వేలు కాజేసిన ఘటన ఇది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కమలాపురి కాలనీకి చెందిన సహాయ దర్శకుడు సిరికృష్ణ ఆదివారం జూబ్లీహిల్స్ రోడ్ నం.5లోని ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు జమ చేయడానికి వెళ్లాడు. ఓ వ్యక్తి తనకు అత్యవసరమని, నగదు ఇస్తే ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేస్తానని నమ్మించాడు. నగదు తీసుకున్న తర్వాత నెఫ్ట్ ద్వారా డబ్బులు పంపించినట్లు చూపించాడు. అయితే నగదు ఖాతాలో జమకాలేదు. రెండు గంటల సమయం పడుతుందని నమ్మించి ఆ వ్యక్తి అక్కడి నుంచి జారుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: మధురానగర్‌కు చెందిన నీలకంఠం సెప్టెంబరు 26న మధురానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో గల ఎస్‌బీఐ బ్యాంకు ఏటీఎంలో రూ.40వేలు డిపాజిట్ చేయడానికి వెళ్లాడు. అక్కడే ఉన్న అపరిచిత వ్యక్తి రూ.40 వేలు ఇస్తే నేను మీ ఖాతాలోకి డబ్బులు పంపుతానని నమ్మించాడు. నీలకంఠం నగదు ఇవ్వగా ఆన్‌లైన్‌లో తాను డబ్బు పంపిస్తున్నట్లు మెసేజ్ చూపించాడు. కొద్ది నిమిషాల్లో నగదు మీ ఖాతాలో జమవుతుందని ఉడాయించాడు. బాధితుడు సోమవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తనిఖీల్లో పట్టుబడిన మత్తు ఇంజెక్షన్లు.. ఇద్దరి అరెస్టు

పంజాగుట్ట, న్యూస్‌టుడే: మత్తు ఇంజెక్షన్లు తరలిస్తున్న వ్యక్తిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. యూసుఫ్‌గూడ కృష్ణానగర్ చెందిన మహ్మద్ నయీముద్దీన్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్. ఈనెల 28న అమీర్‌పేట్‌లో ద్విచక్రవాహనంపై వస్తుండగా పోలీసులు తనిఖీలు చేశారు. వాహనం డిక్కీ తెరిచి చూడగా 7 మత్తు ఇంజెక్షన్లు లభించాయి. పోలీసులు నయీముద్దీన్‌ను అరెస్టు చేసి విచారించగా అవి మధుమేహానికి సంబంధించిన ఇంజెక్షన్‌లని చెప్పాడు. పోలీసులు క్లూస్‌టీం సిబ్బందిని, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను పిలిపించి విచారించారు. మల్కాజిగిరి నేరేడ్‌మెట్‌కు చెందిన సిద్ధూ వీటిని కొనుగోలు చేస్తున్నట్లు తెలడంతో ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.

కులం పేరుతో దూషణ.. అట్రాసిటీ కేసు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: కులాంతర వివాహం చేసుకున్న వరుడి కుటుంబ సభ్యులపై అట్రాసిటీ కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం... యాదగిరినగర్‌లో ఉంటున్న బాధిత మహిళ (26)కు ఘట్‌కేసర్‌కు చెందిన విష్ణుతో ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇద్దరి కులాలు వేరు కావడంతో బాధితురాలి ఇంటికి వచ్చిన విష్ణు ఆమె తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లిచేసుకున్నాడు. విష్ణు కాపురాన్ని సొంతూరికి మార్చాడు. ఇంట్లో విష్ణు, అతని తల్లి వీరమణి, ఆమె సోదరి సరస్వతీ అదే అపార్టుమెంట్‌లో ఉండే రాజు ఆమెను కులం పేరుతో దూషించారు. అదనపు కట్నం కొరకు వేధించారు. తనను అసభ్యకరంగా కులంపేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ ఆదివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజీకి రాలేదని దాడి.. కేసు

యూసుఫ్‌గూడ: కేసును రాజీ చేసుకోవడానికి రాలేదనే కారణంతో ఓ యువకుడిని దాడిచేసి గాయపర్చిన ఘటన ఇది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన నారాయణ సెప్టెంబరు 29న నడిచి వెళ్తుండగా, అదే ప్రాంతానికి చెందిన పవన్, అతని స్నేహితుడితో బైక్‌పై వచ్చి అటకాయించాడు. జూన్ 4న రాత్రి పవన్, నారాయణ ఇంట్లోకి జ్ఞప్రవేశించి అతడి కుమారుడు, కూతురిపై దాడిచేయడంతో నారాయణ కూతురు మీనాక్షి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. అప్పట్లో పవన్ జైలుకు వెళ్లివచ్చాడు. కేసు రాజీకి రాలేదనే నేపంతో దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

బంజారాహిల్స్ యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే :

? బంజారాహిల్స్ ఉదయనగర్ బస్తీలోని మసీదు ఎదురుగా ఉన్న వీధిలో రెండు వీధి దీపాలు వెలగడం లేదు. చీకటిపడిన తరువాత రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సమస్య పరిష్కరించండి.
– ముర్తుజా, ఉదయనగర్, బంజారాహిల్స్.

✓ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం. – సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్ – 18

? శాలివాహననగర్ కాలనీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ సమీపంలో బజారులో వీధి దీపాలు రెండు నెలలుగా వెలగడం లేదు. ఫిర్యాదు చేసినా సిబ్బంది పట్టించుకోవడం లేదు.
–భాస్కర్ రాజు, శాలివాహననగర్ కాలనీ.

✓ వెలగని వీధిదీపాలకు వెంటనే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం.
– వసుదేవ్, జీహెచ్ఎంసీ సర్కిల్ నం.17, వీధిదీపాల నిర్వహణ ఇన్‌ఛార్జి.

ఓవైపు సుందరం.. మరోవైపు దుర్గంధం!

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: నగరం మధ్యలో అహ్లాదకరంగా పచ్చని చెట్లతో పార్కు ఉందంటే పర్యాటకులు కాసేపు సేదదీరేందుకు అక్కడికే చేరుకుంటారు. అలాంటి ఆక్షణ ఉన్నదే నెక్లెస్ రోడ్డులోని ఐమ్యాక్స్ థియేటర్ ఎదుట గల లేక్‌వ్యూ పార్కు. అయితే, కొన్ని రోజులుగా ఈ పార్కులో అహ్లాదం కరవైంది. మురుగుమయంగా మారుతోంది.

లేక్‌వ్యూ పార్కులోకి చేరుతున్న మురుగు

ఇబ్బంది పడుతున్న వాకర్లు, పర్యాటకులు


మురుగు చేరుతున్నది ఇక్కడి నుంచే..

దారి ప్రత్యేకం

చాలా పార్కుల్లో ఉదయపు నడక దారి ప్రత్యేకంగా సిమెంట్ లేదా టైల్స్‌తో ఉంటుంది. లేక్‌వ్యూలో మాత్రం మట్టితో దారి ఉంటుంది. దాంతో ఇక్కడ నడక సాగించేందుకు చాలా మంది ఆసక్తి చూపుతారు. వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకు వాకర్స్ సందడి ఉంటుంది. అదే సమయంలో పార్కుకు పర్యాటకులూ చేరుకుని అక్కడి చెట్ల కింద పచ్చని గడ్డిలో సేదతీరుతుంటారు.

ఏం జరుగుతోంది..

రెండు వారాలుగా మురుగు పార్కులోని కొలనులోకి ప్రవహిస్తోంది. గతంలో మహా భారత్‌నగర్ బస్తీ నుంచి వరద నీరు వచ్చేందుకు ఏర్పాటు చేసిన పైపు లైన్‌కు స్థానికులు మురుగు నీటిని మళ్లించగా, కొద్ది నెలల కిందట హెచ్ఎండీఏ, జలమండలి అధికారులు పరిష్కరించారు. తాజాగా ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో వరద నీటిని వెలుపలకు పంపేందుకు మింట్ కాంపౌండ్‌లో సంపు నిర్మాణం చేసి అక్కడి నుంచి మోటారు సాయంతో పైపులైన్ ద్వారా లేక్‌వ్యూ పార్కులోకి పంపిస్తున్నారు. ఇటీవల వర్షాలు వచ్చినపుడు కాలనీలో డ్రైనేజీలు పొంగి ఈ కాలువలోకి ప్రవహించాయి. ఆ సమయంలో వరద నీరు అధికంగా ఉండటంతో మురుగు ప్రభావం కనిపించలేదు.

సమన్వయంతోనే పరిష్కారం

పార్కులోని కొలను బాగుచేసేందుకు హెచ్ఎండీఏ లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తుండగా, జీహెచ్ఎంసీ, జలమండలి నిర్వాకంతో పార్కు కొలను దుర్గంధ భరితంగా మారుతోంది. పర్యాటకులు వచ్చిన సమయంలో అహ్లాదంగా ఉండేలా నీటి ఫౌంటెయిన్ ఏర్పాటుచేస్తారు. అహ్లాదం దేవుడెరుగు కాని మురుగు వాసన వెదజల్లుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు శాఖల అధికారులు సమన్వయంతో సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


ఉద్యానంలో కొలను

అధికారులు వస్తున్నా..

ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో వర్షం పడినప్పుడు మాత్రమే పార్కులోకి నీరు ప్రవహించేలా అధికారులు ఏర్పాటు చేశారు. అయితే దొడ్డి దారిన వరద కాలువకు సీవరేజీ పైపులు కనెక్షన్ ఇచ్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమస్యపై వాకర్లు హెచ్ఎండీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, జీహెచ్ఎంసీ, జలమండలి సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిశీలించారు. పరిష్కారం మాత్రం చూపడం లేదని వాపోతున్నారు.

సీపీఆర్ చేద్దాం.. ప్రాణాలు రక్షిద్దాం



అకస్మాత్తుగా గుండెపోటుకు గురైతే కాపాడే సీపీఆర్‌పై సోమవారం జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అపోలో ఆసుపత్రి వైద్యులు శిక్షణ ఇచ్చారు. ఆపద వేళ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.
– న్యూస్‌టుడే, ఫిల్మ్‌నగర్

ఘుమఘుమలు



ఎర్రమంజిల్‌లోని రీజెన్సీ కలినరీ కళాశాలలో 'తెలుగు తరంగం' పేరుతో సోమవారం వంటకాల ప్రదర్శన ఏర్పాటుచేశారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్ర, హైదరాబాదీ వంటకాలు 150 రకాలు ప్రదర్శించారు. – న్యూస్‌టుడే, సోమాజిగూడ

స్వచ్ఛ ప్రతిజ్ఞ



హైదరాబాద్ గ్రామర్ స్కూల్ విద్యార్థులతో కలిసి కార్పొరేటర్ వెంకటేశ్ సోమవారం ఫిల్మ్‌నగర్‌లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'నేను చెత్త వేయను... ఇతరులను చెత్త వేయనివ్వను' ప్రతిజ్ఞ చేయించారు. – న్యూస్‌టుడే, ఫిల్మ్‌నగర్

ముట్టడి



మంత్రి కొండా సురేఖపై భారాస సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు తెలంగాణ భవన్ ముట్టడికి యత్నించారు. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి అక్కడి నుంచి పంపించారు. – న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

రాజ్‌భవన్ బడి పిల్లలకు చల్లని తీగునీరు


కూలర్‌ను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

సోమాజిగూడలోని రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలకు హడ్కో సంస్థ వాటర్ ప్యూరిఫైయర్ కమ్ కూలర్‌ను బహూకరించింది. దాదాపు రూ.లక్ష వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ కూలర్‌ని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. – న్యూస్‌టుడే, సోమాజిగూడ

మా పోరాటానికి మద్దతివ్వండి



పూడూరు మండలం దామగుండంలో నేవీ ప్రాజక్టు ఏర్పాటుకు వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని భారాస నాయకుడు జి.నాగేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో దామగుండం పరిరక్షణ కమిటీ సభ్యులు సోమవారం సినీ నటుడు సోనుసూద్‌కు వినతి పత్రం అందజేశారు.
– న్యూస్‌టుడే, పూడూరు

హైడ్రాపై బక్క జడ్సన్ వినూత్న నిరసన

ఈనాడు, హైదరాబాద్: హైడ్రాపై మాజీ కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ వినూత్న నిరసన చేపట్టారు. సోమవారం ఆయన సచివాలయం, జీహెచ్ఎంసీ భవనాలపై ఆర్‌బీ-ఎక్స్ గుర్తులను వేశారు. ఈ భవనాలు హుస్సేన్‌సాగర్ బఫర్‌జోన్‌లో ఉన్నాయని హైడ్రా ఈ కార్యాలయాలను కూల్చాలని ప్రభుత్వానికి సవాల్ చేశారు.

కాంగ్రెస్ వ్యక్తిగత దాడులకు పాల్పడుతోంది

ఫిల్మ్‌నగర్: భారాస నేతలపై కాంగ్రెస్ వ్యక్తిగత దాడులకు పాల్పడుతోందని పార్టీ నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆనంద కన్వెన్షన్‌లో హరీశ్‌రావు భాగస్వామి అని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఖైరతాబాద్: ఎన్ఎఫ్‌సీఎల్ సర్కిల్‌లో అభివృద్ధి పనులను జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పరిశీలించారు.

పథకాలు వినియోగించుకోండి

వెంగళ్‌రావునగర్: జీహెచ్ఎంసీ సర్కిల్-19 యూసీడీ విభాగం ఆధ్వర్యంలో వెంగళరావునగర్ డివిజన్‌లో డ్వాక్రా మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ దేదీప్య పాల్గొన్నారు. యూసీడి విభాగం సీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహాత్మాగాంధీ సిద్ధాంతాలు యువతకు మార్గదర్శకం

నారాయణగూడ: శాంతి, అహింసలను ఆయుధాలుగా ప్రయోగించి పోరాడిన నాయకుడు మహాత్మాగాంధీ అని వక్తలన్నారు. నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంత్యుత్సవాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డా.విజయకుమార్ సర్వోదయ ఫౌండేషన్ కార్యదర్శి ప్రొ.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడారు.

అంబేడ్కర్ వర్సిటీ స్థలాన్ని కేటాయించొద్దు

జూబ్లీహిల్స్: డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి చెందిన పది ఎకరాల స్థలాన్ని జేఎన్ఎఫ్ఏయూకి కేటాయించవద్దని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. నోడల్ అధికారి డాక్టర్ బానోతు ధర్మ, అసోసియేషన్ అధ్యక్షుడు సాకా వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి డాక్టర్ ఉదయిని పాల్గొన్నారు.

త్వరలో కొత్త వీధి దీపాలు

బంజారాహిల్స్: వెంకటేశ్వర కాలనీ డివిజన్ బంజారాహిల్స్ రోడ్డు నం.1, 7, 8, 9 ప్రాంతాల్లో కొత్త వీధి దీపాల ఏర్పాటుపై సోమవారం స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. అవసరమైన చోట రోడ్డు విభాగినులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ సూచించారు. మున్సిపల్ డిప్యూటీ ఈఈ చైతన్య పాల్గొన్నారు.

సీసీటీవి కెమెరాలతో నేరాల నియంత్రణ

బోరబండ: నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ముఖ్యమని బోరబండ కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ అన్నారు. మధురానగర్‌లో నిర్వహించిన యూత్‌కమిటీ సమావేశంలో బస్తీ అధ్యక్షుడు చెట్టి దేవేందర్ రూ.20వేల చెక్కును బోరబండ ఠాణా డీఐ బి.భూపాల్‌గౌడ్, అడ్మిన్ ఎస్సై షేక్ నాగుల్‌మీరాకు అందజేశారు.

జూబ్లీహిల్స్: నిఘానేత్రాలు అసలైన దోషులను పట్టిస్తాయని జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి అన్నారు. హైలం కాలనీలో ఆ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీవాసులంతా ముందుకొచ్చి ఏర్పాటు చేసుకున్న 20 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపకార వేతనాలు

యూసుఫ్‌గూడ: యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న 9వ తరగతి 9మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ఉల్లాస్ ట్రస్ట్ ఏటా పరీక్షలు నిర్వహించి మెరిట్ విద్యార్థులను ఎంపిక చేస్తారు.

లక్ష్యంపై స్పష్టత ఉంటే విజయం సాధ్యం

నారాయణగూడ: జీవిత లక్ష్యంపై స్పష్టత ఉండి, పట్టుదలతో పరిశ్రమ కచ్చితంగా అనుకున్న సాధించగలుగుతారని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి మెంటార్ బాలలత అన్నారు. సోమవారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సోహం లీడర్ షిప్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖాముఖీలో విద్యార్థుల ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు.

తల్లిదండ్రులే కనిపించే దైవం


కళాకృష్ణకు సత్కరించిన డా.కె.వి.రమణాచారి

రవీంద్ర భారతి, న్యూస్‌టుడే: తల్లిదండ్రులే కనిపించే దైవం అని ప్రభుత్వ మాజీ సలహాదారు, డా.కె.వి.రమణాచారి అన్నారు. సోమవారం రాత్రి రవీంద్రభారతిలో శ్రీకూచిపూడి నృత్య నిలయం ఆధ్వర్యంలో కులపతి భాగవతుల రామకోటయ్య స్మృత్యార్థం 'శతవత్సర పారంపర్యం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ నాట్యాచార్యులు డా.కళాకృష్ణకు భాగవతుల రామకోటయ్య స్మారక పురస్కారంతో సత్కరించారు. ఆధ్యాత్మిక శాస్త్రవేత్త వీఎస్ఆర్ మూర్తి, పద్మశ్రీ డా.ఆనందశంకర్ జయంత్, పద్మశ్రీ ఉమామహేశ్వరి, కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత దీపికారెడ్డి మాట్లాడారు.

అసలైన లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించండి

బోరబండ, న్యూస్‌టుడే: ఎస్పీఆర్ హిల్స్ కమలానగర్‌లో నిర్మించిన రెండు పడకగదుల ఇళ్లను నిజమైన లబ్ధిదారులకు కేటాయించాలని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. మూసీ నిర్వాసితులకు కమలానగర్ ఇళ్లను కేటాయిస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కమిషనర్ ఛాంబర్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు.

రికార్డు అసిస్టెంట్లను జేఆర్వోలు గుర్తించండి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: పంచాయతీల్లో వీఆర్ఏలుగా ఉన్న తమను రెవెన్యూతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలకు పంపుతూ రికార్డు అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం జూనియర్ రెవెన్యూ ఆఫీసర్ (జేఆర్ఓ)లుగా గుర్తించాలని తెలంగాణ రికార్డు అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి వీరన్న ముదిరాజ్, నరసింహ మౌర్య కోరారు. గతంలో పదోతరగతి అర్హత గల ఈ పోస్టులను ఇంటర్‌గా, ఇప్పుడు డిగ్రీ అర్హతగా మార్చడం సరికాదన్నారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారు ప్రస్తుతం రాష్ట్రంలో 22వేల మంది ఉన్నారని, ఇంటర్ అర్హత గల వారందరినీ జేఎల్ఓలుగా గుర్తించాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లిన వారిని సొంత జిల్లాకు మార్చాలని కోరారు. 2014 నుంచి నేటి వరకు చనిపోయిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అసోసియేషన్‌కు రాష్ట్ర కమిటీని ప్రకటించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కావలి సత్యనారాయణ, సాగే ఓంకార్ తదితరులు ఉన్నారు.

'15లోపు అద్దె చెల్లించకుంటే భవనాలకు తాళాలు వేస్తాం'


మాట్లాడుతున్న ఎ.దేవేందర్ రెడ్డి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రైవేటు అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ వసతి గృహాల అద్దె బకాయిలు ఈ నెల 15వ తేదీలోపు చెల్లించకుంటే తాళాలు వేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవన యాజమాన్య సంఘం హెచ్చరించింది. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సంఘం అధ్యక్షుడు ఎ.దేవేందర్ రెడ్డి, సలహాదారు కొండా దేవయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 950 గురుకులాలు, 150 హాస్టళ్లు మొత్తం 1100 అద్దె భవనాలు ఉండగా, రూ.500 కోట్ల అద్దె రావాల్సి ఉందన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి బండి కుమార స్వామి, నాయకులు అభిలాష్, కృష్ణమూర్తి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు సమానత్వం, స్వేచ్ఛ, రక్షణ అవసరం

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: మహిళా సాధికారత, సమానత్వాన్ని సాధించి, వారికున్న హక్కులను పరిరక్షించినప్పుడే వారి జీవితాలు బాగుపడతాయని వక్తలన్నారు. సోమవారం రవీంద్రభారతిలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అండ్ సోషల్ జస్టిస్ (ఎన్‌హెచ్ఆర్‌సీఎస్‌జే) ఆధ్వర్యంలో 'మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు ఆపాలి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎన్‌హెచ్ఆర్‌సీఎస్‌జే జాతీయ అధ్యక్షుడు ఆకాష్ మాట్లాడుతూ.. మహిళలు తమ హక్కులతో పాటు రక్షణ చట్టాలను గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ ఛైర్మన్ శ్రీనివాసరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి, సామాజికవేత్త డా.సుబ్రహ్మణ్యం, న్యూరో స్పెషలిస్టు (ఖమ్మం) డా.జగదీష్‌బాబు, స్త్రీవైద్య నిపుణురాలు డా.నీరజ, డీఎస్పీ శేఖర్‌రెడ్డి, సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య, సాయి శివరావు, మౌనిక తదితరులున్నారు.

మూసీ సుందరీకరణ పేరుతో ప్రజల జీవితాల్లో అంధకారం


మాట్లాడుతున్న సంధ్య

ఖైరతాబాద్: మూసీ సుందరీకరణ పేరుతో అక్కడ నివాసం ఉంటున్న ప్రజల జీవితాలు అంధకారం అవుతున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో దాదాపు 8 వేల కుంటుంబాలకు చెందిన సమస్య ఇది అని పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో పీఓడబ్ల్యూ సంధ్య, నివాస హక్కుల ప్రచార పరిరక్షణ సంస్థ (ఛత్రి) కన్వీనర్ వర్గీస్ తెక్నాత్, నివాస హక్కుల ఫెడరేషన్ నేత జీవన్ కుమార్, ఎంవీ ఫౌండేషన్ కన్వీనర్ వెంకట్ రెడ్డి మాట్లాడారు. మూసీ కింద ఉన్న 74 గ్రామాల ప్రజలో మాట్లాడిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రొ.హరగోపాల్ ఫోన్ ద్వారా సందేశమిచ్చారు.

జీటీఎస్ దేవస్థానంలో ప్రసాదాల విక్రయం నిలిపివేత

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: వెంగళ్‌రావునగర్ డివిజన్ జీటీఎస్‌కాలనీలోని శ్రీవీరాంజనేయ భవానీశంకర అయ్యప్ప సాయిబాబా దేవస్థానంలో రెండు నెలలు నుంచి ప్రసాదాల విక్రయం నిలిపివేశారని, ప్రతి గురువారం 500-600 మందికి నిర్వహించే అన్నదానం సగానికి కుదించారని భక్తులు వాపోయారు. నిత్యం వచ్చే భక్తులకు కనీసం తాగునీరు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే ఇది రెండో అతిపెద్ద ఆలయం. 2017లో దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లింది. అప్పటి నుంచి కొన్ని రోజులు అభివృది, కమిటీ, తరువాత నాలుగుసార్లు పాలక మండలిని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జులై 25న పాలకమండలి కమిటీ కాలపరిమితి పూర్తయింది. అప్పటి నుంచి ఆలయ నిర్వాహణ గాడి తప్పిదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై దేవాదాయశాఖ సికింద్రాబాద్ జోన్ అసిస్టెంట్ సంధ్యారాణి స్పందిస్తూ.. దేవస్థానంలో ఏమి జరుగుతుందో తెలుసుకునేందుకు ఇన్‌స్పెక్టర్‌ని పంపించి పరిశీలిస్తామన్నారు. సమస్యలుంటే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. కమిషనర్‌తో మాట్లాడి నూతన పాలక మండలి కమిటీ నియమిస్తామని చెప్పారు.

కూకట్‌పల్లి

12ఏళ్లుగా అనాథలకు సాయం


నగదు అందిస్తున్న సూర్యప్రకాశరావు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పన్నెండేళ్లుగా అనాథలకు ఆర్థిక సాయం చేస్తున్నామని కూకట్‌పల్లి శ్రీవినాయక భక్త బృందం ఛైర్మన్ నాయినేని సూర్యప్రకాశరావు అన్నారు. సోమవారం భాజపా కార్యాలయంలో 150మందికి రూ.900చొప్పున పంపిణీ చేశారు. వినాయక లడ్డూవేలంలో వచ్చిన సొమ్మును సమాజ సేవకు ఉపయోగించాలని ఏటా ఒంటరి మహిళలు, వయోవృద్ధులు, వితంతువులకు నగదు అందిస్తూ వస్తున్నామన్నారు. సి. హెచ్. సూర్యారావు, నాయినేని పద్మారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 36 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి జోన్, మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్ల కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి 36 ఫిర్యాదులు అందాయి. జోనల్ కార్యాలయంలో సీపీ గణపతి వినతులు స్వీకరించగా మొత్తం 34 ఫిర్యాదులు అందాయి. మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్ల పరిధిలో ఒక్కొక్క ఫిర్యాదు వచ్చింది.

రూ.1.9కోట్లతో విభాగిని సుందరీకరణ

స్పందనకు వందనం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: బాలాజీనగర్ డివిజన్ కేపీహెచ్‌బీలో అధికారులు విభాగిని సుందరీకరణ పనులు ప్రారంభించారు. కాలనీ ఒకటో రోడ్డు నుంచి రాజీవ్ రోటరీ వరకు పొడవునా ఉన్న విభాగిని ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక అలా పడి ఉంది. 'ఈనాడు'లో సెప్టెంబర్ 2న 'ఏళ్లుగా ఏమీ మారలేదు' శీర్షికన కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్ల పరిధిలోని విభాగినులపై కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎస్‌ఈ చిన్నారెడ్డి టెండర్లు ఖరారు చేయించారు. ఒకటో రోడ్డు నుంచి రాజీవ్ రోటరీ వరకు 1.7 కిలోమీటర్ల దూరానికి రూ.1.9కోట్లతో పనులు మొదలుపెట్టారు. ఎత్తు మీటరు ఉండనుంది. ఉద్యానవన విభాగం అధికారులు పచ్చదనం అభివృద్ధి చేయాల్సి ఉంది.

సీసీతో రోడ్డు పరిశుభ్రం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి రంగధాముని చెరువు రోడ్డులో కొంతమేర అధ్వానంగా మారింది. ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా రోడ్డు పక్కన బురద పరుచుకొని అపరిశుభ్రంగా దర్శనమిస్తుంది. ఈ సమస్యను 'ఈనాడు'లో ప్రచురించగా ఇటీవల అధికారులు సీసీతో నిర్మించి, పరిశుభ్రంగా మార్చి సమస్యను పరిష్కరించారు.

ఆలోచన మంచిదే.. లోపమెక్కడ?

అయోమయంగా చెత్తడబ్బాల వ్యవహారం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ప్రజాధనం.. పైసా ఖర్చు చేస్తున్నామంటే.. దానికెంత సార్థకత అన్నది పక్కాగా లెక్కలు వేయాల్సిందే. నిధులిచ్చారుగా అని.. మమ అనిపిస్తే దుర్వినియోగమవుతాయి. దీనికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇక్కడ చెత్త డబ్బాల ఏర్పాటు విషయంలో ఒకటికాదు.. రెండోసారి కూడా అదే తప్పిదం జరిగింది. అయినప్పటికీ మూడోసారి మళ్లీ రూ.లక్షలు వెచ్చించి డబ్బాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం ఆందోళన కలిగిస్తుంది. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో ప్రధాన రహదారుల్లో ధ్వంసమైన, మాయమైన వాటి స్థానంలో కొత్తగా చెత్తడబ్బాలు నెలకొల్పేందుకు జరుగుతున్న కసరత్తు గురించి తెలుసుకుందాం..


జోనల్ కార్యాలయంలో బిగించేందుకు సిద్ధంగా చెత్త డబ్బాలు

నిధులు దుర్వినియోగం

కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో జాతీయ రహదారితోపాటు బాలానగర్, జేఎన్‌టీయూ రోడ్డు, ఫతేనగర్, కూకట్‌పల్లి, ఉషాముళ్లపూడి ఆసుపత్రి రోడ్డు, నిజాంపేట రోడ్డు, ఐడీపీఎల్‌కాలనీ రోడ్డు ఇలా కొన్ని ప్రధానమైనవి ఉన్నాయి. ఈ రహదారుల్లో చిరు వ్యాపారుల వద్ద వచ్చే చెత్త రోడ్లపై వేయకుండా ఉండడంతోపాటు.. ప్రజలకు ఉపయోగపడేలా చెత్త డబ్బాల ఏర్పాటుకు నాలుగేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఏర్పాట్లు చేశారు. కానీ, గుత్తేదారుకిచ్చి డబ్బాలు ఏర్పాటుచేయిస్తున్న అధికారులు.. వాటి నాణ్యతను పట్టించుకోవడంలేదు. ఫలితంగా డబ్బాలు పెట్టగానే కొందరు మాయం చేస్తుండగా.. మరికొన్ని చోట్ల ధ్వంసమవుతున్నాయి. ఆలోచన మంచిదైనా.. పర్యవేక్షణ, పక్కాగా ఏర్పాటు చేయించలేకపోవడమనే లోపం కనిపిస్తోంది.


వివేకానందనగర్‌కాలనీ జంక్షన్ సమీపంలో మిగిలిన ఫ్రేమ్

సమాలోచనలు జరుగుతున్నాయి

చెత్తడబ్బాల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఉన్నతాధికారులు సమాలోచనలు జరుపుతున్నారని మూసాపేట సర్కిల్ సహాయ వైద్యాధికారి కార్తీక్, కూకట్‌పల్లి సర్కిల్ సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ డీఈ శ్రీనివాస్ చెప్పారు. తొందరలోనే నిధుల వృథాకు అడ్డుకట్ట పడుతుంది.

అప్పుడు రెండేళ్లు.. ఇప్పుడు ఏడాదిలోపే..

- ◆ కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలోని జాతీయ రహదారితో సహా, పలు ప్రధాన రహదారుల్లో నాలుగేళ్ల క్రితం తడి, పొడి చెత్త డబ్బాలతో కూడిన ఫ్రేమ్‌లు ఏర్పాటుచేశారు. అప్పట్లో 200ప్రాంతాల్లో నెలకొల్పగా.. రెండేళ్లలో 90శాతం డబ్బాలు ఫ్రేమ్‌లతో సహా మాయమయ్యాయి.
- ◆ మాయమైన ప్రాంతాలతోపాటు అవసమైన చోట్ల గతేడాది మరోసారి రెండు సర్కిళ్లలో 146చోట్ల తడి, పొడితోపాటు హానికర మూడు డబ్బాలు నెలకొల్పారు.
- ◆ నాలుగైదు మాసాల్లోనే డబ్బాలు మాయమయ్యాయి. రెండు సర్కిళ్ల పరిధిలో 51చోట్ల కనిపించడంలేదు. మూసాపేటలో 35ప్రాంతాలు.. కూకట్‌పల్లిలో 16ప్రాంతాల్లో డబ్బాలు అవసరమని అధికారులు గుర్తించారు.
- ◆ రూ.లక్షల దుర్వినియోగమవుతున్నా.. శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. తాజాగా గుర్తించిన ప్రాంతాల్లో ఏర్పాటుకు డబ్బాలు వచ్చాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418
కేపీహెచ్‌బీకాలనీ:8008573195, మూసాపేట:8008573423, అల్లాపూర్:9491124918

మురుగు లీకేజీకి అడ్డుకట్ట



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని సాయికృష్ణకాలనీలో కొన్ని రోజులుగా భూగర్భ డ్రైనేజీ మురుగు లీకవుతుంది. దీంతో రోడ్లన్నీ మురుగుతో నిండి అధ్వానంగా మారడంతోపాటు రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని జలమండలి హస్మత్‌పేట సెక్షన్ మేనేజర్ తేజ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో మరమ్మతులు నిర్వహించి లీకేజీ నివారించారు.

ఎయిర్‌టెక్ యంత్రంతో పరిష్కారం



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ అయిదోఫేజ్ ప్రధాన రోడ్డులో మ్యాన్‌హోళ్లు పొంగి మురుగు రోడ్డెక్కింది. పల్లం ప్రాంతం వైపు పారడంతో ఆ ప్రదేశాలు అపరిశుభ్రంగా మారాయి. స్థానికులు 'ఈనాడు'కు ఫిర్యాదు చేయడంతో ఇదే విషయాన్ని జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఎయిర్‌టెక్ యంత్రంతో సమస్యను పరిష్కరించారు.

పూడిక తొలగింపు



అల్లాపూర్, న్యూస్‌టుడే: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ కూడలి ప్రధాన రహదారిలో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో పూడిక పేరుకుపోవడంతో సోమవారం మురుగు పొంగుతూ రోడ్డుపై పారటంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ విషయాన్ని జలమండలి అధికారుల దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లడంతో స్పందించారు. హెయిర్‌టెక్ యంత్రం సహాయంతో సిబ్బంది మ్యాన్‌హోల్‌లో పేరుకుపోయిన పూడిక తొలగించి సమస్య పరిష్కరించారు.


శిబిరంలో వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న అపూర్వ్ చౌహాన్

కార్మికుల ఆరోగ్యం ముఖ్యం: జడ్సీ

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కార్మికులు ఆరోగ్యంగా ఉండడం ఎంతో ముఖ్యమని కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ్ చౌహాన్ అన్నారు. సోమవారం కూకట్‌పల్లి సర్కిల్ హెచ్ఎంటీ శాతవాహననగర్ సామాజిక భవనంలో జరిగిన పారిశుద్ధ్య, ఎంటమాలజీ సిబ్బంది వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటే.. జోన్ పరిశుభ్రంగా ఉంటుందన్నారు. పోషకాహారంపై కార్మికులకు అవగాహన కల్పించారు. వైద్యులు కార్మికులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సర్కిల్ ఉప కమిషనర్ కృష్ణయ్య, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డీఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటుకు వినతి



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: దివ్యాంగులకు ప్రత్యేకంగా బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటుచేయాలని సీపీఐ నేతలు ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్(ఆపరేషన్స్) కవితను కోరారు. సోమవారం ప్రశాంత్‌నగర్ బస్ భవనంలోని కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం సమర్పించారు. కూకట్‌పల్లి ప్రాంతంలో దివ్యాంగులు అధిక సంఖ్యలో ఉన్న నేపథ్యంలో వారి సౌలభ్యం కోసం ప్రత్యేకంగా కౌంటర్ నెలకొల్పాలని, శ్రీశ్రీనగర్, ఇంద్రానగర్, ఎన్టీఆర్‌నగర్, వెంకటేశ్వరనగర్ ప్రజల సౌకర్యార్థం బస్టాపు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ మండల కార్యదర్శి జి.కృష్ణ, మనోచారి, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉందాం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న కృష్ణారావు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కష్టకాలంలో ప్రజలకు అండగా ఉందామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం శేషాద్రినగర్‌లో కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా కూల్చివేతల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల్లో భయాన్ని పోగొట్టి, బాధితులకు అండగా నిలవాలన్నారు. ప్రభుత్వ కూల్చివేతలను ఎండగడుతూ ప్రజల్లో ధైర్యాన్ని నూరిపోయాలని చెప్పారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా చూసుకోవాలన్నారు. పెండింగు పనుల విషయంలో అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. బతుకమ్మ పండగ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీశ్‌గౌడ్, సబిహాబేగం, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా స్వాగతోత్సవం


విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న రమేశ్

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ పరిధి సాయినగర్‌లోని ఇగ్నైట్ విద్యాసంస్థల ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. సంస్థ ఛైర్మన్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా ప్రారంభమైన 'బతుకమ్మ'

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలో బతుకమ్మ సంబరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మహిళలు హనుమాన్ దేవాలయం మైదానం వద్ద, పీఎన్ఎం పాఠశాల ప్రాంగణం వద్ద ఆడారు. రంగధాముని చెరువులో నిమజ్జనం చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎనిమిది నెలలుగా తొలగని యాతన

మూసాపేట, న్యూస్‌టుడే: భూగర్భ మురుగు కాల్వ నిర్మాణం కోసం చేపట్టిన తవ్వకాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో స్థానికులు యాతనకు గురవుతున్నారు. నెలల తరబడిగా కొనసాగుతున్న ఈ ఇబ్బందిని పట్టించుకునే వారే కరవయ్యారు. దీనిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. భరత్‌నగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్స్ భవనం పక్కన ఉన్న గల్లీలో జీహెచ్ఎంసీ అధికారులు ఎనిమిది నెలల క్రితం భూగర్భ మురుగు కాల్వను నిర్మించారు. వాస్తవానికి ఇక్కడి గల్లీలన్నీ 6 అడుగుల వెడల్పుతో మాత్రమే ఉంటాయి. అందులో రెండున్నర అడుగులు తవ్వకాలు చేయడంతో అక్కడ సిమెంట్ రోడ్డు ధ్వంసమైంది. పనులు పూర్తయ్యాక తవ్వకాల చోట మరమ్మతులు చేయాల్సి ఉంది. మిగతా చోట్ల మరమ్మతులు చేసిన అధికారులు సీనియర్ సిటిజన్స్ భవన ప్రహరీని ఆనుకుని ఉన్న రెండు గల్లీల్లో మాత్రం అలాగే వదిలేశారు. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వర్షాకాలంలో వరద రోజుల తరబడిగా నిలిచిపోతుంది. నాలుగు నెలల క్రితం ఇదే గల్లీకి చెందిన బాలిక డెంగీతో చనిపోయిన సంగతి తెలిసిందే. అయినా అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సీనియర్ సిటిజన్స్ భవనం పక్కన పాడైపోయిన రోడ్డు


మరో వీధిలో ఇలా..

తిరుమల పవిత్రతను కాపాడాలి: వీహెచ్‌పీ


వై జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

మూసాపేట: తిరుమల పవిత్రతను కాపాడాలనే నినాదంతో విశ్వహిందూ పరిషత్తు(వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో సోమవారం మూసాపేట వై జంక్షన్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పలువురు నేతలు మాట్లాడుతూ..లడ్డూ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ఆలయ నిర్వాహణ బాధ్యతను ధార్మిక సంస్థలకు అప్పగించాలన్నారు. తిరుమల ఉద్యోగుల విషయంలో ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ ప్రాంతీయ అధికారులు పుల్లా సత్యనారాయణ, జనార్దన్‌రెడ్డి, బజ్‌రంగ్‌దళ్ జిల్లా కార్యదర్శి వినోద్‌పాండే, భాజపా నేతలు మాధవరం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

మూసాపేట, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల తెలిపిన ప్రకారం..ఆల్విన్‌కాలనీకి చెందిన సాల్మాన్(52) ఖైరతాబాద్‌కు వెళ్లడానికి తన ద్విచక్ర వాహనంపై సోమవారం బయలుదేరాడు. కూకట్‌పల్లి వివేకానందానగర్‌లోని మనం ఆసుపత్రి సమీపం వద్ద జగద్గిరిగుట్ట నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు ద్విచక్ర వాహనం తగిలి కిందపడ్డారు. దీంతో బస్సు వెనక చక్రాలు అతని ఎడమ కాలుమీద నుంచి వెళ్లడంతో చితికిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దీక్షిత తెలిపారు.

ఇంటి నుంచి వచ్చిన వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: ఇంటి నుంచి వచ్చిన వ్యక్తి మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..న్యూ బోయిన్‌పల్లి పరిధి బాలాజీనగర్‌కు చెందిన జనరేటర్ మెకానిక్ పల్నాడు రాజు(60) సోమవారం ఇంటి నుంచి బయటకి వచ్చాడు. సాయంత్రం ఇతను కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ వద్ద కదల్లేకుండా ఉండటంతో చుట్టుపక్కల వారు అంబులెన్స్‌ను పిలిపించారు. అప్పటికే రాజు మృతిచెందినట్టు అంబులెన్స్ సిబ్బంది చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటకెక్కిన పారిశుద్ధ్య నిర్వహణ

ప్రబలుతున్న జ్వరాలు.. ఆందోళనలో ప్రజలు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: బహిరంగ చెత్త పారబోతను నివారిస్తామని మూసాపేట సర్కిల్ పారిశుద్ధ్య విభాగం అధికారులు ప్రతిసారీ చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయి. ఆ మధ్య నాలుగోఫేజ్ మల్టీప్లెక్స్ ఫంక్షన్‌హాల్‌లో ఉప కమిషనర్ ఆధ్వర్యంలో సమావేశం కూడా నిర్వహించారు. వారం రోజుల్లో జీవీపీ పాయింట్స్(బహిరంగ చెత్త పారబోత ప్రదేశాలు)ను నివారించబోతున్నామని గొప్పగా చెప్పారు. ఇంకా పెరిగాయి తప్ప ఒక్కటీ నివారించలేకపోయారు. విషజ్వరాలు ప్రబలుతున్నాయి. అధికారులకు మొరపెట్టుకున్నా మార్పు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు.


ధర్మారెడ్డికాలనీ ఫేజ్-Iలో రహదారికి ఇరువైపులా..


కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లో ఆట స్థలం పక్కన ఇరుకు రోడ్డులో..

రైతుబజారు వెనక దుర్వాసన..

రైతుబజారు వెనక రోడ్డులో వ్యర్థాలు పేరుకుని తీవ్ర దుర్వాసన వెదజల్లడం ఈనాటి సమస్య కాదు. నివాసితులు తరచూ బాధను అనుభవిస్తూ డంపింగ్‌ను నివారించాలంటూ సమరం చేస్తున్నారు. వర్షాలు పడితే బాధలు అదనం. ఇప్పటికే వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఇటీవల ఉపకమిషనర్ రమేశ్‌ను కలిసి నివాసితులు గోడువెళ్లబోసుకున్నారు. ధర్మారెడ్డికాలనీ ఫేజ్-1, మూడోఫేజ్, రెండు, మూడు, నాలుగు రోడ్డు నాలా, భువనవిజయం మైదాన ప్రాంతాల్లో బహిరంగ చెత్త పారబోత నిర్విరామంగా కొనసాగుతోంది. ప్రమాదకర ఇనుపరాడ్లు, సీలింగ్ వ్యర్థాలు సైతం పారవేస్తున్నారు.

3 పూటలూ తొలగించాలని ఒప్పందం

ప్రధాన బహిరంగ చెత్త పారబోత ప్రదేశాలైన రమ్య మైదానం, సర్దార్‌పటేల్‌నగర్, రైతుబజారు వెనక వ్యర్థాలను తొలగించాలని జీహెచ్ఎంసీ రాంకీ సంస్థకి బాధ్యతలు అప్పగించిన సమయంలో చేసుకున్న ఒప్పందం. తర్వాత నాలుగో ఫేజ్‌లోని మసీదు పాయింట్ కూడా చేర్చారు. ఆయా ప్రదేశాల్లో 3 పూటలూ తొలగించాలి. తొలి మూడు, నాలుగు నెలలు కొనసాగిన ప్రక్రియ తర్వాత అటకెక్కించారు. ప్రస్తుతం ఉదయం పూటే తరలించడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. జీహెచ్ఎంసీ-రాంకీ మధ్య సమన్వయం సరిగా లేక జనం ఇక్కట్ల పాలవుతున్నారు.

చికన్ గన్యా బారినపడ్డా: శోభ, ధర్మారెడ్డికాలనీ ఫేజ్-I

రైతుబజారు వెనక చెత్త పారవేసే ఎదురే మా ఇల్లు. దుర్వాసన భరించలేకపోతున్నాం. దోమల గురించి చెప్పనవసరం లేదు. నేను చికన్ గన్యాతో బాధపడ్డాను. మా ఇంట్లో అద్దెకు ఉన్న వారికి కూడా జ్వరాలే.

రాకపోకలకు స్థలమే ఉండటం లేదు: రమణ, మూడోఫేజ్

పీవీ సింధు ఆట స్థలం పక్కన రోడ్డు ప్రవేశంలో వ్యర్థాలు పడేస్తున్నారు. ప్రమాదకర రాడ్లు కూడా డంప్ చేస్తున్నారు. పరుగులు, ఈగలు, దోమలు ఎక్కువయ్యాయి. రాకపోకలకు స్థలమే ఉండం లేదు. ఎన్నోసార్లు ఫిర్యాదు చేశాం.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే


బాలాజీనగర్ రెయిన్‌బో స్కూల్‌లో..


బాలానగర్ చాకలిబస్తీ అంగన్‌వాడీలో పెద్దలకు సన్మానం

కూకట్‌పల్లి, బాలానగర్, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి బాలాజీనగర్‌లోని రెయిన్‌బో స్కూల్‌లో సోమవారం గ్రాండ్ పేరెంట్స్ డే జరిగింది. చిన్నారులు వారి గ్రాండ్ పేరెంట్స్ కాళ్లు కడగగా.. వారు అక్షితలు వేసి పిల్లలను ఆశీర్వదించారు. బాలానగర్ చాకలిబస్తీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాండ్ పేరెంట్స్‌ను సత్కరించి చిన్నారులకు వారి ప్రాధాన్యతను వివరించారు. పోషన్ బీ, పడాయి బీ కార్యక్రమంలో చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వీడ్కోలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి జోన్ ఏసీపీ శ్రీధర్‌గౌడ్ పదవీ విరమణ వీడ్కోలు వేడుకలు సోమవారం కార్యాలయంలో జరిగాయి. వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు, పలువురు ఉద్యోగులు ఆయన్ని సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాజారెడ్డి, వైస్ ఛైర్మన్ సమ్మెట ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పురాణం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి

●శేరిలింగంపల్లి ● పటాన్‌చెరు

చేతులు కలిపిన టీ హబ్, పానాసోనిక్


ఒప్పంద కార్యక్రమంలో సీఈఓ శ్రీనివాస్‌రావు, అంకుర, పానాసోనిక్ సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం టీ హబ్, జపాన్‌కు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ పానాసోనిక్ వ్యూహాత్మక భాగస్వామ్యంతో ముందుకు సాగనున్నాయి. పానాసోనిక్ ఆధునిక నెస్టం హై డెఫినిషన్ పవర్ లైన్ కమ్యునికేషన్ (హెచ్‌డీ- పీఎల్‌సీ) సాంకేతిక సేవలను భారత్‌లో విస్తరించేందుకు టీ హబ్‌లోని రెండు సంస్థలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా టీ హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆ ఒప్పందం ద్వారా భారత్, జపాన్ దేశాలు పరస్పర ఆవిష్కరణలు, వ్యాపార రంగంలో సహకరించుకుంటాయని తెలిపారు. నెస్టం హెచ్‌డీ- పీఎల్‌సీ సాంకేతికత డేటా కమ్యునికేషన్స్ (అంతర్జాల సేవలు)లో కీలకం కానుందని చెప్పారు. పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ మనీష్ మిశ్రా మాట్లాడుతూ.. ఈ సాంకేతికతను జపాన్, ఐరోపాల్లోని అనేక వాణిజ్య, గృహ ప్రాజెక్టుల్లో వినియోగిస్తున్నారని తెలిపారు. దూర ప్రాంతాల అనుసంధానం క్లిష్టంగా ఉండే కాంక్రీట్, లోహ నిర్మాణాలు, భూగర్భ క్షేత్రాలు, సొరంగాలు, స్మార్ట్ సిటీస్, ఎలివేటర్లు, రోబోటిక్ యంత్రాల్లో ఈ హెచ్‌డీ పీఎల్‌సీని వాడుకోవచ్చని, అంతర్జాల సేవలు సులభతరంగా పొందవచ్చన్నారు.

కాలువలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు


కుమ్మరికుంట వద్ద ఆక్రమణలు పరిశీలిస్తున్న కమిషనర్ సంగారెడ్డి

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే : నీటి కుంటల మధ్య ఉన్న లింకు కాలువలను ఆక్రమిస్తే క్రిమినల్ కేసు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి చెప్పారు. సోమవారం తెల్లాపూర్ పట్టణంలోని కుమ్మరికుంటతోపాటు అనుసంధాన కాలువల ఆక్రమణలను పరిశీలించారు. అక్కడ అడ్డుగా పోసిన మట్టిని తీయించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుమ్మరికుంట కాల్వల పరీవాహక ప్రాంతాల్లో జరిగిన అన్ని రకాల నిర్మాణాలను తొలగిస్తామని స్పష్టం చేశారు.

'అంబేడ్కర్ వర్సిటీ స్థలాన్ని ఇతరులకు కేటాయించొద్దు'

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి చెందిన పది ఎకరాల స్థలాన్ని జేఎన్ఎఫ్ఏయూకి కేటాయించవద్దని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఉన్నత విద్యావ్యాప్తిలో విశ్వవిద్యాలయం బడుగు బలహీనవర్గాలకు, పేద విద్యార్థులకు, మహిళలకు తక్కువ రుసుంతో ఉన్నత విద్యను అందిస్తుందన్నారు. భూమిని వేరే విశ్వవిద్యాలయానికి అప్పగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తున్నామన్నారు. సంఘం అధ్యక్షుడు సాకా వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి డాక్టర్ ఉదయిని, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్యాంటీన్ల ఏర్పాటు.. మహిళలకు తోడ్పాటు

- తొలిదశలో సర్కిల్‌కు రెండు
- చందానగర్‌లో త్వరలో ప్రారంభం
- స్వయం సహాయక సంఘాల వారికే అవకాశం


సర్కిల్ కార్యాలయం దగ్గర సిద్ధమవుతున్న ఆహారశాల

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: కోటి మంది మహిళలను ధనవంతులుగా మార్చాలనే ప్రభుత్వ విధానానికి అనుగుణంగా శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని సర్కిళ్ల అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా మహిళలతో క్యాంటీన్ల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. మొదటగా ప్రతి సర్కిల్‌లో రెండు తప్పనిసరిగా ఉండాలని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

సహకరిస్తూ.. సదుపాయాలు కల్పిస్తూ..

సాధారణంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అధికారులు బ్యాంకు రుణాలు మంజూరు చేయించడం, ఆ మొత్తంతో వారు చిన్నపాటి దుకాణాల ఏర్పాటు, ఇళ్లలోనే చీరలు, ఇతర దుస్తుల విక్రయం వంటి వాటితో స్వయం ఉపాధి పొందడం ఇప్పటివరకు జరుగుతోంది. ప్రస్తుతం జనసాంద్రత కాస్త అధికంగా ఉండే ప్రదేశాల్లో క్యాంటీన్ల ఏర్పాటుకు చొరవ తీసుకొంటున్నారు. ఈ క్రమంలో బ్యాంకు రుణం మంజూరు, ఆహారశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సహకరిస్తున్నారు. ఒక్కరే ఇందుకు ముందుకు వచ్చినా, లేదంటే కొద్దిమంది కలిసి ఆసక్తి కనబరిచినా ప్రోత్సహిస్తున్నారు. మొత్తంగా ఈ విషయంలో మహిళలకు వెన్నుదన్నుగా నిలవాలని నిర్ణయించి అమలు ప్రక్రియ ఆరంభించారు.

చివరి దశకు నిర్మాణ పనులు

ముందుగా చందానగర్ సర్కిల్ కార్యాలయం దగ్గర ఆహారశాల ఏర్పాటుకు అధికారులు నిర్ణయించగా, నలుగురు మహిళలు ముందుకు వచ్చారు. షెడ్డు నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. త్వరలో ప్రారంభించనున్నారు. ఇక్కడ ఉదయం టిఫిన్, టీ, మధ్యాహ్నం భోజనం వంటివి అందుబాటులో ఉండనున్నాయి. ఇదేవిధంగా మరోచోట ఏర్పాటుకు స్థలాల పరిశీలన చేపట్టారు. శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం దగ్గర, సర్కిల్‌లోని ఇంకో ప్రదేశంలో నెలకొల్పడానికి సన్నాహాలు చేస్తున్నారు. పటాన్‌చెరు, యూసుఫ్‌గూడ సర్కిళ్ల పరిధిలోనూ డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్నాయి.

వ్యాపారం బాగా సాగే స్థలాలు పరిశీలిస్తున్నాం

మహిళల ఆధ్వర్యంలో క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నాం. ముఖ్యంగా వ్యాపారం సక్రమంగా సాగి, ఆర్థిక ప్రగతి సాధించేలా ఉండే ప్రదేశాలు పరిశీలిస్తున్నాం. అంతగా గిరాకీ లేని ప్రదేశాలైతే వ్యాపారం సాగక వారు ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. ఆ పరిస్థితి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నాం.

–ఉషారాణి, ప్రాజెక్టు అధికారి, చందానగర్ సర్కిల్.

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228
చందానగర్ - 8008555322

చందానగర్, రామచంద్రాపురం రూరల్, శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే

? చందానగర్ మంజీరా రోడ్డు గుంతలమయంగా మారి ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం
– కె.వెంకట్, చందానగర్

✓ గుంతలు ఉన్న చోట్ల మట్టి పోయించి చదును చేయిస్తాం
– ప్రతాప్, ఏఈ ఇంజినీరింగ్ విభాగం

? తెల్లాపూర్ పట్టణంలో రేడియల్ రోడ్డుకు ఆనుకుని ఉన్న వరద కాలువలు సక్రమంగా నిర్మించకపోవడంతో వర్షం నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది.
– శ్రీనివాస్ తెల్లాపూర్ గ్రామస్థుడు

✓ వరద కాలువలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాం.. నిర్మాణం శాస్త్రీయ పద్ధతిలో జరగకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
– సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్

? కొండాపూర్ రాఘవేంద్రకాలనీ, రోడ్ నంబరు ఆరు.. మూలమలుపులో చెత్త వేస్తున్నారు. చాలా రోజులుగా శుభ్రం చేయలేదు.
– ఆచంట సీతారామారావు, కాలనీవాసి

✓ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చి వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
–శ్రీకాంత్‌రెడ్డి, సహాయ వైద్యాధికారి, శేరిలింగంపల్లి సర్కిల్

కోతుల తరలింపు

స్పందనకు వందనం

చందానగర్, న్యూస్‌టుడే: చందానగర్ వేమనరెడ్డికాలనీలో కోతుల సంచారంతో పడుతున్న ఇబ్బందులను స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. సమస్యను జీహెచ్ఎంసీ వెటర్నరీ అధికారి అబ్దుల్‌బాసిత్‌కు వివరించగా ఆయన సిబ్బంది పంపించి కోతుల గుంపులను వాహనాల్లో తరలించారు.

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు: ఎమ్మెల్యే


ఎస్ఎన్ కాలనీలో పాఠశాల భవన ప్రారంభోత్సవంలో ఎంపీ రఘునందన్‌రావు, మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం రామచంద్రాపురం డివిజన్ ఎస్ఎన్ కాలనీలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. కార్పొరేట్ స్కూళ్లతో సమానంగా సర్కారు బడులను తీర్చిదిద్దామని చెప్పారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం జరిగినందున ఫలితాలూ అదే రీతిలో ఉండాలన్నారు. కార్పొరేటర్లు పుష్ప, సింధు, ఉప కమిషనర్ సురేష్ తదితరులు ఉన్నారు.

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో మృతి చెందిన వారికి పరిహారం అందే విధంగా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. విద్యుత్‌షాక్‌తో మృత్యువాత పడిన జిన్నారం మండలం ఊట్ల గ్రామస్థుడు నల్ల సాయికుమార్ కుటుంబ సభ్యులకు సోమవారం పటాన్‌చెరులోని క్యాంపు కార్యాలయంలో రూ. 5 లక్షల చెక్కును, లక్ష్మీపతిగూడెం రెండు పాడి గేదెలను కోల్పోయిన ఇద్దరికి రూ.80 వేలు అందజేశారు. జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, గుమ్మడిదల మాజీ జడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదు..


అధికారులను నిలదీస్తున్న ఓ రైతు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే : అధికారుల నిర్లక్ష్యంతో కొందరు రైతులకు రుణమాఫీ జరగలేదని సహకార సంఘం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం 2018ని కట్ ఆఫ్ ఏడాదిగా నిర్ణయించిందని, తాము 2014 నుంచి రుణాలు తీసుకుంటుండగా వాటిని ఎప్పటికప్పుడు రెన్యువల్ చేయించకుండా అధికారులు అలానే వదిలేశారని అన్నదాతలు పేర్కొన్నారు. రెన్యువల్ చేసి ఉంటే తమకూ లబ్ధి చేకూరేదని చెప్పారు. అధికారుల తప్పిదం కారణంగా ఇస్నాపూర్, లక్డారం, పాశమైలారం, రుద్రారం, క్యాసారం, నందిగామ గ్రామాలకు చెందిన 1369 మంది తీసుకున్న రుణాలు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సహకార సంఘం అధ్యక్షుడు పాండు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరుకు వినతి పత్రం అందజేశారు.

భారతీనగర్ డివిజన్‌లో అభివృద్ధిపై సమీక్ష


కార్పొరేటర్ సింధుతో కలిసి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం భారతీనగర్ డివిజన్‌కు సంబంధించిన సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్ సింధు, అధికారులతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న అంతర్గత రోడ్లకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రధానంగా ఎంఐజీ కాలనీలో అభివృద్ధిపై చర్చించారు. పెండింగ్ పనులను పూర్తిచేయాలని, కొత్త ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో సహాయ వైద్యాధికారి శ్రీకాంత్, ఏఈ రషీద్, ఆదర్శరెడ్డి, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, సొసైటీ అధ్యక్షులు వెంకట్రావు, ఉపాధ్యక్షులు నారాయణ గౌడ్, డైరెక్టర్ నీలకంఠం, భాస్కర్ నాగమణి తదితరులున్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్


ట్యూషన్ తరగతులను పరిశీలిస్తున్న క్రాంతి వల్లూరు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే : పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను సోమవారం రాత్రి కలెక్టర్ క్రాంతి వల్లూరు సందర్శించారు. స్టడీ అవర్స్‌లో తరగతులను ప్రత్యక్షంగా చూసి వివరాలు తెలుసుకున్నారు. బోధన ఎలా ఉంది, భోజనం, వసతి సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయా లేదా అని విద్యార్థులను ఆరా తీశారు. దినచర్య, మెనూ వివరాలు ప్రిన్సిపల్ కల్పనను అడిగారు. వంట సామగ్రి నిల్వ చేసిన గదులను పరిశీలించారు. శుభ్రత పాటించాలని ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాత్రికి బస చేసి మరిన్ని వివరాలు తెలుసుకోనున్నామని వివరించారు. ప్రత్యేక అధికారి దేవుజా, ఎంపీ ఓ హరి శంకర్ గౌడ్, తహసీల్దార్ రంగారావు తదితరులున్నారు.

రేపటి నుంచి ప్రాంతీయస్థాయి జానపద ఉత్సవాలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: మాదాపూర్ శిల్పారామంలో ఈ నెల 2 నుంచి 4 వరకు డివిజన్ స్థాయి జానపద కళా ఉత్సవాలు (ఫోక్ ఆర్ట్స్ ఫెస్టివల్) నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శిల్పారామం, నాగ్‌పూర్ సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకల్లో 2న పేరిణి రాజు ద్వారా పేరిణి నాట్యం, భువనగిరి- మధు ఒగ్గుడోలు, కరీంనగర్ -అందెశి నారాయణ డప్పు, నగరానికి చెందిన రామారావు మాధురీ నృత్యం, 3న అశోక్ - బోనాలు, ఖమ్మం- ఆనంద్ కుమార్ కొమ్ముకోయ, మహబూబ్‌నగర్ -జంపయ్య థింసా నృత్యం, ఆదిలాబాద్ శ్రీధర్ - గుస్సాడీ నాట్యం, 4న కరీంనగర్ భువనేశ్వరి ఆధ్వర్యంలో బోనాల నృత్యం, తాండూర్- రమేష్ చెక్క భజన, ఆదిలాబాద్- కుమార్ లంబాడీ నృత్యం, శేరిలింగంపల్లి వెంకటేశ్వర సురభి థియేటర్ వారు నాటకం ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

సత్తా చాటిన శాంటామారియా విద్యార్థులు

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లిలోని శాంటా మారియా విద్యార్థులు జాన్ లాక్ ఇనిస్టిట్యూట్ గ్లోబల్ ఎస్సే ప్రైజ్ పోటీల్లో రాణించారు. స్వతంత్ర ఆలోచన, విమర్శనాత్మక, తార్కిక విశ్లేషణతో ముందుకు నడిపించడానికి ఉద్దేశించి ఏర్పాటుచేసిన పోటీ ఇది. నిషి, అన్య, రౌనక్ తమ ప్రతిభనుచాటి పురస్కారాలు పొందారు. లండన్‌లోని గ్రోస్వేనర్ హౌస్ హోటల్లో జరిగిన వేడుకల్లో బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ హేమా సంజయ్ సోమవారం వారిని అభినందించారు.

కార్పొరేషన్ పదవుల్లో అవకాశానికి వినతి

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే : పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో అండగా నిలిచామని కార్మికశాఖకు సంబంధించిన కార్పొరేషన్ పదవుల్లో అవకాశం కల్పించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి కోరారు. ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్‌రెడ్డికి సోమవారం ఆయన ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు.

కొత్త విద్యుత్తు స్తంభాల ఏర్పాటు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: శాంతినగర్‌కాలనీలో వేలాడే విద్యుత్ తీగలు, ఒరిగిన స్తంభాం ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులు గతంలో కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సోమవారం కొత్త స్తంభాలను ఏర్పాటు చేయించిన సమస్యను పరిష్కరించారు. వరదనీరు కాలనీలో వస్తున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. పరిష్కారం దిశగా కృషిచేస్తానని తెలిపారు.

ఉద్యోగ విరమణ చేసిన అధికారికి వీడ్కోలు


శంకరయ్యకు పింఛన్ పత్రాలు అందిస్తున్న సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్

రాయదుర్గం: ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్ఐ సానవల్లి శంకరయ్యను కుటుంబ సభ్యుల సమక్షంలో జాయింట్ సీపీ జోయెల్ డేవిస్ సోమవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పింఛన్ మంజూరు, ఉద్యోగ విరమణ ప్రయోజనాల పత్రాలను అందజేశారు. సైబరాబాద్ కమిషనరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీసీపీ ప్రసాద్, ఏడీసీపీ రవిచందన్‌రెడ్డి, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్, ఆర్ఐ హిమకర్, ఏఐఎస్ జి.మల్లేశం పాల్గొన్నారు.

రోడ్లెక్కిన మురుగు.. ఆగని పరుగు



చందానగర్ జాతీయ రహదారిపై గాంధీ విగ్రహం నుంచి విజేత సూపర్ మార్కెట్ వరకు బెల్ ఫ్లైఓవర్ వంతెన పనుల్లో భాగం వరద కాలువ నిర్మించారు. తాత్కాలికంగా పాత భూగర్భ డ్రైనేజీ లైన్ దీనికి కలపకపోవడంతో రహదారిపై మురుగు స్తంభించిపోతోంది. ఒకవైపు వంతెన నిర్మాణ పనులతో సర్వీస్ రోడ్డు ఇరుకుగా మారడం, మరోవైపు పక్కనే మురుగు నిలిచి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. –న్యూస్‌టుడే, చందానగర్



హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ కాలనీ రోడ్డు నెంబరు 2ఏ లో డ్రైనేజీ పొంగి దారి పొడవునా పారుతోంది. దుర్వాసన, అపరిశుభ్రతతో స్థానికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వారం నుంచి ఈ పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, ఆల్విన్‌కాలనీ

కారు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

● మరో యువకుడి పరిస్థితి విషమం


నుజ్జయిన ముందు భాగం


మృతుడు సాయితేజ

నాంపల్లి, న్యూస్‌టుడే: ఆరుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో బయలుదేరిన కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. అందులో ఒకరు దుర్మరణం చెందగా, మరోకరి పరిస్థితి విషమంగా ఉంది. నలుగురు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. సోమవారం తెల్లవారుజామున నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్ వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... నగరానికి చెందిన సాయితేజ(24), సందీప్, మాధురి, సాయికిషన్, సాయిసింధు గచ్చిబౌలిలోని జెన్‌ప్యాక్ కంపెనీలో ఉద్యోగులు. ఎప్పటిలాగే సోమవారం తెల్లవారుజామున 4గంటలకు కంపెనీ క్యాబ్‌లో హయత్‌నగర్ నుంచి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారు లక్డీకాపూల్ మీదుగా మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్ ప్రవేశ మార్గం వద్ద పైకి ఎక్కిన వెంటనే డ్రైవర్ సాయివంశీ ముందున్న ఓ బైక్‌ను ఓవర్‌టేక్ చేసి వేగంగా దూసుకువెళ్లేందుకు ప్రయత్నించాడు.. కానీ వేగాన్ని అదుపుచేయలేకపోవడంతో కారు ఫ్లైఓవర్‌కు ఎడమవైపు ఉన్న సిమెంటు గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయితేజ అక్కడికక్కడే మృతి చెందగా సందీప్‌కి పరిస్థితి విషమంగా ఉంది. సాయితేజ మృతదేహానికి ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టమ్ అనంతరం కుటుంబీకులకు అప్పగించామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు, యువతతోనే దేశాభివృద్ధి

రాయదుర్గం, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువతపైనే దేశాభివృద్ధి ఆధార పడి ఉంటుందని, ఈ క్రమంలో వారు బాధ్యతాయుతంగా మెలుగుతూ ముందుకు సాగాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీనారాయణ అన్నారు. స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల (ఆబిడ్స్) వార్షికోత్సవం, స్నాతకోత్సవం సోమవారం మాదాపూర్ శిల్పకళా వేదికలో ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ.. విద్యార్థులు శాస్త్రీయ దృక్కోణంలోనే విషయాలను చూడాలని సూచించారు. నేర్చుకున్న సాంకేతిక నైపుణ్యాలు సమాజానికి ఉపయోగపడేలా వినియోగించాలన్నారు. విద్యార్థినులకు పట్టాలు, ప్రతిభ చాటిన వారికి పతకాలు ప్రదానం చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొ.ఎం.రాములు, టీ హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస్‌రావు, మెథడిస్ట్ చర్చ్ ఆఫ్ ఇండియా బిషప్ ఎంఏ డేనియల్, కళాశాల కార్యదర్శి ఎ.కృష్ణారావు, మేనేజ్‌మెంట్ సభ్యుడు ఆర్.ప్రదీప్ రెడ్డి, డీన్ అకడమిక్స్ ప్రొ.ఎ.వినయ్ బాబు, ప్రిన్సిపల్ డా.సత్యప్రసాద్ లంక, డైరెక్టర్ డా.వి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్.. ఒకరికి రెండు రోజుల జైలు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సిబ్బంది నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 16 మంది పట్టుబడ్డారు. వీరిని సోమవారం సంగారెడ్డి కోర్టుకు తరలించగా 15 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేలు జరిమానా, ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు సీఐ లాలూనాయక్ తెలిపారు. మద్యం మత్తులో వాహనాలతో రోడ్డెక్కే వారిని కట్టడి చేస్తామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

మూసాపేట: ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల తెలిపిన ప్రకారం.. ఆల్విన్‌కాలనీకి చెందిన సాల్మాన్(52) ఖైరతాబాద్‌కు వెళ్లడానికి బైక్‌పై బయలుదేరాడు. కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని మనం ఆసుపత్రి వద్ద జగద్గిరిగుట్ట నుంచి మెహిదీపట్నం వెళ్తున్న బస్సుకు వాహనం తగిలి కిందపడ్డాడు. దీంతో బస్సు వెనక చక్రాలు అతని ఎడమ కాలుమీద నుంచి వెళ్లడంతో చితికిపోయింది. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దీక్షిత తెలిపారు.

కాలిబాటలు.. అడుగేయలేం

● రాయదుర్గం ఐటీ కారిడార్ దారిలో దుస్థితి


ఒకచోట అసంపూర్తి పనులతో ఇలా..


పాదచారుల వంతెన చెంత ..


బీఎన్ఆర్ హిల్స్‌లో మరో చోట ఇదీ పరిస్థితి

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గంలోని కాలిబాటలు ఇవి.. ఓ చోట అభివృద్ధి పనులు మధ్యలో నిలిపివేయగా... మరోచోట పూర్తయినా అందుబాటులోకి తీసుకురాకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. రాయదుర్గం టీ-బయోడైవర్సిటీ పార్కు కూడలి సమీపంలో పనులు ప్రారంభించి అర్ధంతరంగా ఆపేశారు. అక్కడి నుంచి ముందుకు వస్తే గతంలో నిర్మించిన కాలిబాట ఉపయోగపడటం లేదు. అదే దారిలో పాదచారుల వంతెన కింద అసలు ఫుట్‌పాతే లేదు. బీఎన్ఆర్ హిల్స్ మార్గంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించినా అనేక చోట్ల ధ్వంసమైంది. కాలిబాటల దుస్థితి కారణంగా ప్రజలు ప్రధాన రహదారిలో వాహనాల బారి నుంచి తప్పించుకుంటూ అవస్థల మధ్య నడక సాగిస్తున్నారు.


బయోడైవర్సిటీ పార్కు చౌరస్తా సమీపంలో ..

కుత్బుల్లాపూర్

అబ్బుర పరిచిన చిత్రలేఖనం


చిత్రాలు గీస్తున్న విద్యార్థులు

నిజాంపేట: విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో బాచుపల్లిలోని వీఆర్‌ఎస్ విజ్ఞానజ్యోతి స్కూల్‌లో చిత్రలేఖన పోటీలు సోమవారం నిర్వహించారు. గణనాథుడు అంశంపై నిర్వహించిన పోటీల్లో 125 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 108 నిమిషాల్లోనే చిత్రాలను గీశారు. దీన్ని విశ్వగురు సంస్థ ప్రత్యేక రికార్డుగా నమోదు చేసింది. ఎంపీ ఈటల రాజేందర్ హాజరైన మాట్లాడారు. చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీయడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు.

బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం



షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణలో అత్యంత వైభవంగా నిర్వహించే బతుకమ్మ ఉత్సవాలు సోమవారం నుంచే ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మను గాజులరామారం పరిధిలోని మహాదేవపురంలో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, పిల్లలు బతుకమ్మలను రంగురంగుల పూలతో అలంకరించి ఉత్సాహంగా పాటలు పాడారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: భాజపా ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై సోమవారం సీఐటీయూ షాపూర్‌నగర్ ఆధ్వర్యంలో ఏఎల్ లేబర్ ఆఫీస్ కార్యక్రమాన్ని చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతుబజారు నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. కార్మిక చట్టాలు అమలు చేయకుండా, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల పేరుతో ఎలాంటి కార్మిక చట్టాలు అమలు చేయకుండా 12 నుంచి 16 గంటల పని చేయిస్తున్నారని, ఈఎస్ఐ, పీఎఫ్ బోనస్ లాంటి సౌకర్యాలు కల్పించడం లేదని వాపోయారు. ఫార్మా కంపెనీలో సీనియర్ కార్మికులను ఏదో ఒక సాకుతో తొలగిస్తూ వారికి రక్షణ లేకుండా చేస్తున్నారన్నారు. అంజయ్య, శ్రీను, మల్లారెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య రోజు గ్రహణం లేదు

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: ఈ నెల 2న అమావాస్య రోజు ఎలాంటి గ్రహణం లేదని కుత్బుల్లాపూర్ హరిహర అర్చక సంఘం అధ్యక్షుడు శ్రీరంగం గోపి కృష్ణమాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రహణం పేరుతో కొందరు వదంతులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. పితృదేవతలకు ప్రతిఏడాది ఇచ్చినట్టే బియ్యం ఇవ్వటం, ఎంగిలిపూల బతుకమ్మ తదితర కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని తెలిపారు.

పోలియో బాధితుడికి ఆర్థిక సాయం

జీడిమెట్ల, న్యూస్‌టుడే: పోలియోతో బాధపడుతున్న దివ్యాంగుడికి ఓ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయం అందించింది. సుభాష్‌నగర్ డివిజన్ సూరారంకాలనీ రాజీవ్ గృహకల్పలో నివసించే శ్రీకాంత్ పోలియోతో దివ్యాంగుడిలా మారాడు. అతని పరిస్థితిని తెలుసుకున్న ప్రేరణ ఫౌండేషన్ ఫౌండర్ శరత్ సుదర్శి సహృదయ ఫౌండేషన్ ఫౌండర్ బిందు తాడివాకా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె బాధితుడికి రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి కీలకాని లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఛైర్మన్ ప్రీతమ్

ఏఎస్ రావునగర్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎస్సీ ఛైర్మన్ ప్రీతం సూచించారు. సోమవారం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసి ప్రత్యేక వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ డా.బి. ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల బదిలీలు... భర్తీ అవ్వని పోస్టులు

పాఠాలకు దూరంగా విద్యార్థులు


దుండిగల్, న్యూస్‌టుడే


కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

సకల సదుపాయాలతో నిర్మించిన కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు క్యూ కడుతుంటారు. కానీ ప్రస్తుతం కళాశాలలో అధ్యాపకుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. జులై 31న జరిగిన సాధారణ బదిలీల్లో కళాశాలకు చెందిన ఆరుగురు అధ్యాపకులు బదిలీ అయ్యారు. ఇప్పటివరకూ వారి స్థానాల్లో అధ్యాపకులను భర్తీ చేయలేదు. దీంతో విద్యార్థులు పాఠాలకు దూరంగా ఉండాల్సి వస్తోంది.

సిలబస్ పూర్తయ్యేనా..

జూన్ 1న తరగతులు ప్రారంభమైనా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను సకాలంలో పంపిణీ చేయలేదు. ఈ లోపు జులై 31న ఒకేసారి ఆరుగురు అధ్యాపకులు బదిలీ అయ్యారు. ప్రస్తుతం వృక్షశాస్త్రం, జంతు శాస్త్రం, కెమిస్ట్రీ, చరిత్రకు సంబంధించిన అధ్యాపకులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఇటీవల నలుగురు గెస్ట్ ఫ్యాకల్టీలు కళాశాలలో చేరగా... వారు గణితం, ఎకనామిక్స్, కామర్స్, పొలిటికల్ సైన్స్ బోధించనున్నారు. ఫిజిక్స్, తెలుగు, ఇంగ్లీష్ చెప్పేందుకు అధ్యాపకులు లేరు. సకాలంలో పాఠ్యపుస్తకాలు అందక, అధ్యాపకుల కొరతతో సిలబస్ పూర్తయ్యేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



ఉత్తీర్ణతపై ప్రభావం..

గత ఏడాది పూర్తిస్థాయిలో అధ్యాపకులు అందుబాటులో ఉన్న ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గింది. మొదటి సంవత్సరంలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 20.99 మాత్రమే. 281 మంది విద్యార్థులకు 59 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 127 మందికి 58 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రస్తుతం అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఆ ప్రభావం ఉత్తీర్ణత శాతంపై పడే అవకాశం ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారం రోజుల క్రితం నలుగురు గెస్ట్ ఫ్యాకల్టీ కళాశాలలో చేరారు. ప్రస్తుతం విద్యార్థులకు ఫిజిక్స్ పాఠాలను నేనే బోధిస్తున్నాను. **- నాగేందర్, కళాశాల ప్రిన్సిపల్**

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
శాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

కుత్బుల్లాపూర్, నిజాంపేట, దుండిగల్, న్యూస్‌టుడే:

? మల్లారెడ్డి హాస్పిటల్ ఎదుట సీఆర్ఎంపీ రహదారిపై వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
– రజనీకాంత్, సూరారం కాలని

● వెంటనే సిబ్బంది పంపించి వీధిదీపాలను పునరుద్ధరిస్తాం. - రఘుపతి రెడ్డి, డీఈ ఎలక్ట్రికల్ విభాగం గాజులరామారం సర్కిల్

? సూరారం ప్రధాన రహదారి పక్కన వ్యర్థాలను తొలగించడం లేదు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.
– రాజ్యలక్ష్మి, లక్ష్మీనగర్, సూరారం

● సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– తిరుపతి, ఏఈ సూరారం డివిజన్

? కౌసల్యకాలనీలో వీధి కుక్కల సంచారం అధికంగా ఉంది. వచ్చిపోయే వారిపై దాడులు చేస్తున్నాయి. దీంతో బయటకు రావాలంటే పిల్లలు, మహిళలు భయపడుతున్నారు. –సాయి, కౌసల్యకాలనీ

● జీహెచ్ఎంసీ సాయంతో ఇప్పటికే అన్ని కుక్కలకు శస్త్రచికిత్సలు చేయించాం. త్వరలోనే మరోసారి చేయాలని ప్రతిపాదించాం.
– డి.సౌజన్య, కమిషనర్, నిజాంపేట

? మల్లంపేట బస్‌స్టాప్ నుంచి పోచమ్మ ఆలయం వరకు రహదారి విస్తరణ చేపట్టలేదు. ఈ మార్గంలో రోడ్డుపై గుంతలు పడి వాహనాలు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. – పవన్, దుండిగల్

● హెచ్ఎండీఏ అధికారులతో కలిసి రహదారి విస్తరణ చేపడతాం. రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం.
– సత్యనారాయణ, కమిషనర్, దుండిగల్ పురపాలిక

రాష్ట్ర ప్రజల చూపు భాజపా వైపు: ఎంపీ


సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న ఈటల రాజేందర్

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రతి భాజపా కార్యకర్త క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి అత్యధికంగా సభ్యత్వాలను నమోదు చేయించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. గాజులరామారంలో సోమవారం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు భాజపా వైపు చూస్తున్నారని రాబోయే రోజుల్లో భాజపా ప్రజాదరణలో అగ్రభాగాన ఉంటుందన్నారు. గాజులరామారం మాజీ సర్పంచి పగిడి శంకర్‌రెడ్డికి సభ్యత్వాన్ని అందజేశారు. జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌యాదవ్, కార్పొరేటర్ రావుల శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డికి పరామర్శ..

అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న భాజపా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్‌రెడ్డిని షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఎంపీ ఈటల రాజేందర్ సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మేడ్చల్ జిల్లా కన్వీనర్ డా.మల్లారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేయొద్దన్నా వినట్లే



ఆలయ సమీపంలో ఫ్లెక్సీ పక్కన చెత్త

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: పద్మానగర్ ఫేస్-2 రింగురోడ్డు సమీపంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ సమీపంలో గతంలో కొందరు చెత్త చెదారం వేసేవారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు అక్కడ చెత్త వేయకుండా మొక్కలు నాటి కర్రలు ఏర్పాటు చేశారు. దీంతో కొన్ని రోజులు చెత్త వేయడం మానేశారు. ఇటీవల మళ్లీ అక్కడ చెత్త వేస్తుండగా చెత్త వేస్తే రూ.500-1000 జరిమానా విధిస్తామని అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయినా కొందరిలో మార్పు రావడం లేదు. ఫలితంగా పాదచారులు, వాహనదారులు, ఆలయానికి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

దుండిగల్, న్యూస్‌టుడే: బౌరంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఆ సంఘం ఛైర్మన్ బాల్‌రెడ్డి అన్నారు. స్థానిక సహకార సంఘంలో ఆయన అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. సంఘం కార్యదర్శి అసదుల్లా, వైస్ ఛైర్మన్ వెంకటేష్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పాదబాటలు తొలగించాలని ఉప కమిషనర్‌కు లేఖ

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నర్సింహకు లేఖ రాశారు. సుచిత్ర కూడలి నుంచి కుత్బుల్లాపూర్ దారి, జాతీయ రహదారిపై పాదచారులు ఇబ్బందుల పాలవుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసి ఫుట్‌పాత్‌లను తొలగించటానికి కృషి చేయాలని కోరారు.

విధి నిర్వహణలో రాజ్యభాష వినియోగం


ప్రశంసాపత్రాలు ఇస్తున్న డీఐజీ అనిల్‌మింజ్

జవహర్‌నగర్ న్యూస్‌టుడే: విధి నిర్వహణలో హిందీని అధికంగా వినియోగించాలని రంగారెడ్డి జిల్లా సీఆర్‌పీఎఫ్ గ్రూప్ కేంద్రం డీఐజీ అనిల్ మింజ్ అన్నారు. సోమవారం జవహర్‌నగర్‌లోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ కేంద్రంలో హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్‌లో విధుల్లో ఉన్న పలువురు గెజిటెడ్ అధికారులు, 99 ఆర్ఏఎఫ్ బెటాలియన్ ఉద్యోగులు, సీఆర్‌పీఎఫ్ కార్యాలయ ఉద్యోగులకు హిందీ భాషా దినోత్సవం సందర్భంగా పలు పోటీలను నిర్వహించారు. ఉత్తములుగా నిలిచిన వారికి ప్రశంసా పత్రాలను ఇచ్చారు.

మూసీ సుందరీకరణ పేరుతో ప్రజల జీవితాల్లో అంధకారం

ఖైరతాబాద్: మూసీ సుందరీకరణ పేరుతో అక్కడ నివాసం ఉంటున్న ప్రజల జీవితాలు అంధకారం అవుతున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో దాదాపు 8 వేల కుటుంబాలకు చెందిన సమస్య ఇది అని పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో పీఓడబ్ల్యూ సంధ్య మాట్లాడుతూ.. సుందరీకరణ పేరిట 1997లో కొందరిని అక్కడి నుంచి తరలించినా ఫలితం లేకపోయిందన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతలతో గోదావరి నుంచి 15 టీఎంసీల నీరు తరలించి మూసీ నింపడం హాస్యాస్పదమన్నారు. నివాస హక్కుల ప్రచార పరిరక్షణ సంస్థ (ఛత్రి) కన్వీనర్ వర్గీస్ తెక్నాత్, నివాస హక్కుల ఫెడరేషన్ నేత జీవన్ కుమార్, ఎంవీ ఫౌండేషన్ కన్వీనర్ వెంకట్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. ప్రభుత్వం మూసీ పరివాహక ప్రాంత వారికి జీవించే హక్కు కల్పించాలన్నారు. మూసీ కింద ఉన్న 74 గ్రామాల ప్రజలతో మాట్లాడిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రొ.హరగోపాల్ ఫోన్ ద్వారా సందేశం ఇస్తూ ప్రజల్లో విశ్వాసం, వారికి గౌరవప్రదమైన జీవితం కల్పించాలన్నారు.

'భగవద్గీతపై పట్టు సాధిస్తే విద్యాలోనూ రాణిస్తారు'


ఉమామహేశ్వరరావును సన్మానిస్తున్న చింతల మల్లేశం, కృష్ణమోహన్ తదితరులు

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: భగవద్గీత పఠనం ద్వారా వ్యక్తుల తలరాతలు మార్చుకోవచ్చని అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. చింతల్ పరిధి వెంకటేశ్వరనగర్‌లోని సత్‌జ్ఞాన్ హైస్కూల్‌లో సోమవారం భగవద్గీతపై అవధానం నిర్వహించారు. విద్యార్థులు భగవద్గీతపై పట్టు సాధిస్తే విద్యారంగంలోనూ రాణించగలరని ఆయన పేర్కొన్నారు. భాష మీద పట్టు పెరుగుతుందన్నారు. విద్యార్థులు అడిగిన శ్లోకాల ప్రశ్నలకు సమాధానం చెప్పారు. అనంతరం అవధానిని ఘనంగా సత్కరించారు. పాఠశాల డైరెక్టర్ లయన్ చింతల మల్లేశం, నా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కృష్ణమోహన్, కవి విట్టుబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వరం పరిష్కారం


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మేడ్చల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులు 63 ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియకు విన్నవించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం సత్వరం చూపించాలని అధికారులను ఆదేశించారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

ఏఎస్‌రావునగర్, న్యూస్‌టుడే: మహిళా హక్కులకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. కమలానగర్‌లో సోమవారం ఐద్వా మేడ్చల్ జిల్లా 3వ మహాసభ జరిగింది. ఈ సమావేశానికి ఆమె హాజరై మహిళలు విద్య, వైద్య రాజకీయ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు రావాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల వినోద, విజయ, ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మలుపుతో.. పొంచి ఉన్న ప్రమాదం



దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్ పురపాలిక పరిధి బౌరంపేట నుంచి బహదూర్‌పల్లికి వెళ్లే మార్గంలో స్థానిక సాయినాథ్ సొసైటీలో మూల మలుపు వద్ద గుంతలు పడి రోడ్డు అధ్వానంగా మారింది. బహదూర్‌పల్లి టెక్ మహీంద్రా నుంచి దుండిగల్ పురపాలిక కార్యాలయం మీదుగా మేడ్చల్ వైపు వెళ్లే మార్గంలో డి.పోచంపల్లిలోని రెండు పడకల ఇళ్ల గృహ సముదాయాల సమీపంలో మలుపు వద్ద రోడ్డు ధ్వంసమై ప్రమాద భరితంగా ఉంది. మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు



గాజులరామారం డివిజన్ పరిధిలోని వీనస్ ఎన్‌క్లేవ్ కాలనీ నుంచి జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహసముదాయానికి వెళ్లే దారిలో రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు మధ్యలో రెండు అడుగుల మేర గుంత ఏర్పడింది. దాదాపు అరకిలోమీటర్ వరకు ఇదే దుస్థితి. దీంతో వాహనదారులు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే,షాపూర్‌నగర్

తీగలు తొలగించారు... స్తంభం మరిచారు



పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: విద్యుత్తు అధికారులు బిల్లు వసూళ్లపై చూపిన శ్రద్ధ మరమ్మతుల్లో చూపడం లేదన్న విమర్శలు వస్తున్నారు. పేట్‌బషీరాబాద్ జాతీయ రహదారి నుంచి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రోడ్డుకు ఆనుకొని స్తంభం ఉండడంతో విద్యుత్తు తీగలు తొలగించి పక్క స్తంభానికి మార్చారు. కానీ స్తంభాన్ని మాత్రం తొలగించలేదు. అధికారులు చొరవ తీసుకుని స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' పేట్‌బషీరాబాద్ ఏఈ జ్ఞానేశ్వర్‌ను సంప్రదించగా త్వరలో తొలగిస్తామన్నారు.

జ్వరం తగ్గడం లేదని యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల, న్యూస్‌టుడే: జ్వరం తగ్గడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల ఠాణా పరిధిలోని కళావతినగర్‌లో జరిగింది. కాలనీకి చెందిన ఎం.సందీప్(26) జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహించేవారు. రెండ్రోజులుగా తీవ్రమైన జ్వరంలో బాధపడుతూ ఇంట్లోనే ఉన్నారు. సోమవారం కుటుంబీకులు పనుల నిమిత్తం బయటకు వెళ్లాక సందీప్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణ ప్రణాళికలో ప్రక్షాళనకు శ్రీకారం

బదిలీలతో అక్రమాలకు చెక్

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే

జంట సర్కిళ్లలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల బదిలీలతో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారులను బదిలీచేస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు జారీచేయడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధారణ బదిలీల్లో భాగంగా కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలోని వివిధ విభాగాల సిబ్బంది ఇతర సర్కిళ్లకు బదిలీ అయినా పట్టణ ప్రణాళిక విభాగాల్లోని సెక్షన్ అధికారులను మాత్రం బదిలీ చేయలేదు. వీరిలో కొందరి పనితీరు సరిగ్గా లేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులను ఇక్కడి నుంచి బదిలీచేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.


కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం

బదిలీ అయిన అధికారులు..

కుత్బుల్లాపూర్ సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ప్రభావతిని మూసాపేట సర్కిల్ సెక్షన్ అధికారిగా బదిలీచేసి, ఆమె స్థానంలో శేరిలింగంపల్లి సర్కిల్ సెక్షన్ అధికారి రమేశ్‌ను నియమించారు. గాజులరామారం సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ సంతోశ్‌ను ఖైరతాబాద్ జోనల్ కార్యాలయానికి బదిలీచేసి, ఆయన స్థానంలో కూకట్‌పల్లి సర్కిల్ ఏసీపీ రమేశ్‌ను ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఇదే సర్కిల్‌లో ఏళ్లతరబడి సెక్షన్ అధికారులుగా పనిచేస్తున్న నరేశ్‌ను గోషామహల్ సర్కిల్‌కు, సంగీతను మల్కాజిగిరి సర్కిల్‌కు బదిలీ అయ్యారు. సంగీత స్థానంలో నూతన సెక్షన్ అధికారిగా తుల్జాసింగ్‌ను నియమించగా నరేశ్ స్థానంలో ఇంకా ఎవ్వరిని నియమించలేదు.

కండర క్షీణత వ్యాధిగ్రస్థులకు సంరక్షకుడి భృతి కల్పించాలి


ర్యాలీలో కండర క్షీణత వ్యాధి బాధితులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: కండర క్షీణత వ్యాధి బాధితులు సంరక్షకుడి (కేర్ టేకర్) ఖర్చు భరించలేని స్థితిలో ఉన్నారని, వారికి సంరక్షకుడి భృతి (కేర్ టేకర్ అలవెన్స్) కల్పించాలని తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టీఎండీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్ నుంచి ఖైరతాబాద్ ప్రధాన కూడలికి తమ సమస్యలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెళ్లి, తిరిగి ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 3500 మంది కదల్లేని స్థితిలో నాలుగు గోడల మధ్య బతుకీడుస్తున్నారన్నారు. సాంకేతికత ఎంతో అభివృద్ధి చెందుతున్నా ఈ వ్యాధి నయం చేసేందుకు మందు కనిపెట్టలేదని వాపోయారు. తమ తల్లిదండ్రులకు భారం కాకుండా ఉండాలని పదేళ్లుగా ప్రభుత్వాలను సాయం కోరుతున్నామని, పలు పర్యాయాలు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు. ప్రభుత్వం మానవత్వం చూపి సంరక్షుడి భృతితో పాటు తీవ్ర వైకల్యం గలవారికి రూ.20వేల పెన్షన్ ఇవ్వాలని, బ్యాటరీ వీల్ ఛైర్లు మంజూరు చేయాలని, ఆరోగ్య కార్డులు, పోషకాహారం ఇవ్వాలని, డీఎన్‌ఏ పరీక్షలు చేయించాలని కోరారు. సమావేశంలో టీఎండీఏ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి వినోద్‌కుమార్, సలహాదారు శివకుమార్, సభ్యులు రమేష్ యాదవ్, కైలాష్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.